

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శుక్రవారం | 17-10-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 182 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి ఉ.11:12 తదుపరి ద్వాదశి, నక్షత్రం: మఖ మ.1:58 తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.10:32-12:15, దుర్ముహూర్తం: ఉ.8:31-9:18, మ.12:23-1:10, అమృతఘడియలు: ఉ.11:26-1:07, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:12, సూర్యాస్తమయం: 5:48 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




లిచ్‌ఫీల్డ్ (84 నాటౌట్)


గంభీర్, రోహిత్

వచ్చారు.. మొదలెట్టారు

నెట్స్‌లో చెమటోడ్చిన రోహిత్, కోహ్లీ

పెర్త్: ఆస్ట్రేలియాతో పరిమిత ఓవర్ల సిరీస్‌లో తలపడేందుకు ఇక్కడ అడుగుపెట్టిన టీమిండియా వెంటనే సాధనలోకి దిగింది. సిరీస్‌లో భాగంగా మూడు వన్డేలు, ఐదు టీ20లలో భారత్-ఆసీస్ తలపడనున్నాయి. తొలి వన్డే ఈనెల 19న జరగనుంది. ఈ నేపథ్యంలో గురువారం పెర్త్ చేరుకున్న టీమిండియా వెంటనే ప్రాక్టీస్ మొదలెట్టింది. ముఖ్యంగా స్టార్ బ్యాటర్లు రోహిత్, విరాట్ ఎక్కువ సేపు నెట్స్‌లో గడిపారు. టెస్ట్‌లు, టీ20లకు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరు వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న విషయం విదితమే. ఈ ఫార్మాట్‌లో రో-కో చివరిసారి గత మార్చిలో చాంపియన్స్ ట్రోఫీలో ఆడారు. నెట్ ప్రాక్టీస్ తర్వాత కోచ్ గంభీర్‌తో రోహిత్ చాలాసేపు సంభాషించడం ఆసక్తి రేపింది. మరోవైపు సాధనకు ముందు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్‌తో మాట్లాడిన కోహ్లీ తర్వాత పేసర్ అర్ష్‌దీప్‌తో ముచ్చటించాడు. శుక్ర, శనివారాల్లో కూడా భారత జట్టు ప్రాక్టీస్ చేయనుంది.

పెర్త్ చేరిన క్రికెటర్లు..: తొలి విడతగా బుధవారం ఉదయం న్యూఢిల్లీ నుంచి బయలుదేరిన భారత క్రికెటర్లు రోహిత్, కోహ్లీ, కెప్టెన్ గిల్, కేఎల్ రాహుల్, జైస్వాల్, అర్ష్‌దీప్, హర్షిత్ రాణా, నితీశ్ కుమార్‌తోపాటు కొందరు సహాయ సిబ్బంది గురువారం తెల్లవారుజామున పెర్త్ చేరుకున్నారు. వారు ప్రయాణించిన విమానం మూడున్నర గంటలు ఆలస్యంగా వచ్చింది. ఆ తర్వాత కోచ్ గంభీర్, కుల్దీప్, అక్షర్, బౌలింగ్ కోచ్ మోర్కెల్, ఇతర కోచింగ్ సిబ్బంది పెర్త్ చేరుకున్నారు.




యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్, నితీశ్‌కుమార్ రెడ్డి

పెర్త్ పిచ్‌పై రో-కోకి కష్టమే
ఆకాశ్ చోప్రా

సుదీర్ఘ విరామం తర్వాత విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ భారత్ తరపున బరిలోకి దిగబోతున్నారు. అయితే ఆదివారం ఆసీస్‌తో జరిగే తొలి వన్డే ఈ ద్వయానికి సవాల్‌గా మారనుందని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా తెలిపాడు. 'ఐపీఎల్‌లో ఆడిన తర్వాత విరాట్, రోహిత్ మళ్లీ ఇప్పుడే బ్యాట్ పట్టనున్నారు. అదీ బౌన్స్ అధికంగా ఉండే పెర్త్ పిచ్‌పై తొలి మ్యాచ్ కావడం వారికి ఇబ్బందికరమే. అయితే ఈ మూడు వన్డేలు ఆ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్ల భవిష్యత్‌ను నిర్ణయించలేవు' అని చోప్రా స్పష్టం చేశాడు. మరోవైపు విరాట్-రోహిత్‌లకు ఆసీస్ పర్యటన అంత సులువు కాదని, కుదురుకునేందుకు సమయం పడుతుందని మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ అభిప్రాయపడ్డాడు. ఇక విదేశీ ఫ్రాంచైజీ లీగ్‌ల్లో ఆడేందుకు భారత యువ ఆటగాళ్లను అనుమతించాలని మాజీ కోచ్ రవిశాస్త్రి కోరాడు.

సెమీస్‌లో ఆస్ట్రేలియా

బంగ్లాపై 10 వికెట్ల విజయం
హీలీ అజేయ శతకం

మహిళల వన్డే వరల్డ్‌కప్



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా అదరగొడుతోంది. అజేయ ఆటతీరుతో దూసుకెళ్తున్న ఈ జట్టు సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. గురువారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో కెప్టెన్ అలీసా హీలీ (77 బంతుల్లో 20 ఫోర్లతో 113 నాటౌట్) వరుసగా రెండో శతకం పూర్తి చేయగా, లిచ్‌ఫీల్డ్ (72 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 84 నాటౌట్) సహకరించింది. దీంతో ఏకంగా 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించిన ఆసీస్ 9 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 198 పరుగులు సాధించింది. శోభన (66 నాటౌట్), రుబియా హైదర్ (44) రాణించడంతో ఆ మాత్రం స్కోరైనా అందుకోగలిగింది. మహిళల క్రికెట్‌లో ఆసీస్‌పై బంగ్లా తరపున అత్యధిక వ్యక్తిగత స్కోరు శోభనదే కావడం విశేషం. అటు బౌలింగ్‌లో లెగ్ స్పిన్నర్ అలన కింగ్ (10-4-18-2) పొదుపైన బౌలింగ్‌తో అదరగొట్టింది. వేర్హమ్, సదర్లాండ్, గార్డ్‌నర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆస్ట్రేలియా 24.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 202 పరుగులతో నెగ్గింది. ఓపెనర్లు హీలీ, లిచ్‌ఫీల్డ్ చెలరేగడంతో పవర్‌ప్లేలోనే జట్టు 78 పరుగులు సాధించింది. 67 రన్స్ దగ్గర హీలీ సులువైన క్యాచ్‌ను ఫర్గానా వదిలేసింది. ఇక వరల్డ్‌కప్‌లో రెండో ఫాస్టెస్ట్ (73 బంతుల్లో) సెంచరీ పూర్తి చేసిన హీలీ ఆ వెంటనే హ్యాట్రిక్ ఫోర్లు బాదగా, అటు 25వ ఓవర్‌లో లిచ్‌ఫీల్డ్ రెండు వరుస ఫోర్లతో మ్యాచ్‌ను ముగించింది.


సంక్షిప్త స్కోర్లు

బంగ్లాదేశ్: 50 ఓవర్లలో 198/9 (శోభన 66 నాటౌట్, రుబియా 44; అలన కింగ్ 2/18, వేర్హమ్ 2/22, సదర్లాండ్ 2/41, గార్డ్‌నర్ 2/48); **ఆస్ట్రేలియా** : 24.5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 202 (హీలీ 113 నాటౌట్, లిచ్‌ఫీల్డ్ 84 నాటౌట్)

నేటి మ్యాచ్ — మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
శ్రీలంక x దక్షిణాఫ్రికా

బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌లో చాముండేశ్వర్‌నాథ్

న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ వంకిన చాముండేశ్వర్‌నాథ్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అత్యున్నత కమిటీలో చోటు లభించింది. బోర్డు అపెక్స్ కౌన్సిల్‌లో భారత క్రికెటర్ల సంఘం (ఐసీఏ) ప్రతినిధిగా చాముండి (66) ఎన్నికయ్యాడు. బుధ, గురువారాల్లో జరిగిన ఆన్‌లైన్ ఓటింగ్‌లో చాముండి 672 ఓట్ల భారీ తేడాతో ప్రత్యర్థి రాజేష్ వి. జడేజాపై భారీ విజయం సాధించాడు. చాముండికి 755 ఓట్లు పోల్‌కాగా.. జడేజాకు 83 ఓట్లు మాత్రమే లభించాయి. బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్‌కు ఎన్నికైన తొలి తెలుగు వ్యక్తిగా నిలిచిన చాముండి భారత జట్టు మాజీ క్రికెటర్ దిలీప్ వెంగ్‌సర్కార్ స్థానంలో ఈ బాధ్యతలు చేపట్టనున్నాడు. బీసీసీఐకి సంబంధించిన అత్యున్నత నిర్ణయాలను తీసుకొనే బాడీ అపెక్స్ కౌన్సిల్. ఇందులో బోర్డు అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, ఇద్దరు ఐసీఏ సభ్యులు, 'కాగ్', జనరల్ బాడీనుంచి ఒక్కొక్కరు...ఇలా 9 మంది ఉంటారు. కాగా ఐసీఏ మహిళా నామినీగా సుధా షా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ప్రతినిధిగా శుభాంగి దత్తాత్రేయ కులకర్ణి ఎన్నికయ్యారు. ఇక ఐసీఏ బోర్డు ఎన్నికల్లో చాముండి మినహా అందరి ఎన్నిక ఏకగ్రీవమైంది.



ఫస్ట్‌క్లాస్ క్రికెట్ నుంచి..

రాజమండ్రికి చెందిన చాముండేశ్వర్‌నాథ్ ఆంధ్ర తరపున 1978 నుంచి 1992 వరకు ఫస్ట్‌క్లాస్ క్రికెట్ ఆడాడు. 13 మ్యాచ్‌లకు సారథ్యం కూడా వహించాడు. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) మాజీ కార్యదర్శి అయిన ఆయన జాతీయ జూనియర్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గానూ పనిచేశాడు. 2009 ఐసీసీ టీ20 వరల్డ్‌కప్‌లో భారత జట్టు మేనేజర్‌గా సేవలందించాడు. ప్రస్తుతం ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహరిస్తున్నాడు.

తెలుగు టైటాన్స్ ఓటమి

న్యూఢిల్లీ: ప్రొ.కబడ్డీ లీగ్‌లో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ పరాజయం చవిచూసింది. యు ముంబా 33-26తో టైటాన్స్‌పై గెలుపొందింది. ఉత్కంఠ భరితంగాసాగిన మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 6-4తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది.

క్వార్టర్స్‌లో తన్వీ, ఉన్నతి

బీడబ్ల్యూఎఫ్ జూనియర్ చాంపియన్‌షిప్స్

గువాహటి: వర్ధమాన షట్లర్లు తన్వీ శర్మ, ఉన్నతి హుడా బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్స్ క్వార్టర్స్‌కు చేరుకొన్నారు. జ్ఞాన దత్తుతోపాటు భవ్య చబ్రా జోడీ కూడా తమకంటే మెరుగైన ర్యాంకర్లను ఓడించి రౌండ్-8లోకి అడుగుపెట్టింది. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో తన్వీ 15-8, 15-5తో సన్ లి యువాన్ (చైనా)ను, ఉన్నతి 15-10, 15-7తో కరిన్ టీ (మలేసియా)ను ఓడించింది. బాలుర సింగిల్స్‌లో దత్తు 15-12, 15-13తో గారెట్ టాన్‌పై గెలిచాడు. మిక్స్‌డ్‌లో భవ్య-విశాఖ జంట 12-15, 15-11, 15-12తో ఫ్రెంచ్ జోడీ తిబౌల్ట్ గార్డన్-అగాతే క్యువాస్‌పై గెలిచింది.

శ్రీరామ్‌కు కాంస్యం

ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్



డ్యూరెస్ (అల్బేనియా): ఫిడే ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్ అండర్-18 విభాగంలో హైదరాబాద్‌కు చెందిన ఉప్పల శ్రీరామ్ ఆదర్శ్ కాంస్యం సాధించాడు. 11 రౌండ్ల ఈ చాంపియన్‌షిప్‌లో శ్రీరామ్ మొత్తం 8.5 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. చివరి రౌండ్‌లో సింగపూర్‌కు చెందిన జేవియర్ హబస్‌తో గేమ్‌ను ఆదర్శ్ డ్రా చేశాడు. సిద్దార్థ్ జగదీశ్ (సింగపూర్) స్వర్ణం, అర్టియమ్ స్త్రిబక్ (ఫిడే) రజత పతకం నెగ్గారు.

రషీద్ సెంచరీ

- ఆంధ్ర 470 ఆలౌట్
- యూపీతో రంజీ


రషీద్ (136)

కాన్పూర్: షేక్ రషీద్ (136) సెంచరీ నమోదు చేయడంతో.. ఉత్తరప్రదేశ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర భారీ స్కోరు సాధించింది. ఆటకు రెండో రోజైన గురువారం 289/3తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 470 రన్స్‌కు ఆలౌటైంది. క్రితం రోజు 90ల్లో ఉన్న రషీద్ శతకం పూర్తి చేశాడు. అతడిని శివమ్ శర్మ పెవిలియన్ చేర్చాడు. విప్రజ్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్‌లో యూపీ ఆట చివరకు 73/1 స్కోరు చేసింది. ఆంధ్ర స్కోరుకు యూపీ ఇంకా 397 పరుగుల దూరంలో ఉంది. ఇక హైదరాబాద్‌లో ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ రెండో రోజు ఆట చివరికి వికెట్ నష్టానికి 77 రన్స్ చేసింది. అంతకు ముందు ఢిల్లీ 529/4 వద్ద డిక్లేర్ చేసింది. సనత్ సంగ్వాన్ (211 నాటౌట్), ఆయుష్ డిసౌజా (209) డబుల్ సెంచరీలు సాధించారు.

యూఏఈకి టీ20 ప్రపంచ కప్ బెర్త్

దుబాయ్: యూఏఈ జట్టు వచ్చే ఏడాది జరిగే పురుషుల టీ20 వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది. ఆసియా-ఈఏపీ క్వాలిఫయర్స్ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన మ్యాచ్‌లో యూఏఈ ఎనిమిది వికెట్లతో జపాన్‌ను ఓడించింది. దాంతో ఈ టోర్నీలో నేపాల్, ఒమన్‌తో కలిసి మూడో జట్టుగా యూఏఈ టిక్కెట్ దక్కించుకుంది. యూఏఈ ఎంట్రీతో ఈ ప్రపంచకప్‌లో పాల్గొనే మొత్తం 20 జట్లూ ఖరారయ్యాయి. 2026 ఫిబ్రవరి-మార్చిలో జరిగే ఈ వరల్డ్‌కప్‌నకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి.

క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ, లక్ష్యసేన్

డెన్మార్క్ ఓపెన్

ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో సాత్విక్/చిరాగ్, లక్ష్యసేన్ క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి ద్వయం 21-19, 21-17తో లీ/యాంగ్ (తైపీ) జంటని ఓడించింది. ఇక సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-13, 21-14తో అంటొన్‌సెన్ (డెన్మార్క్)కు షాకిచ్చాడు. మిక్స్‌డ్‌లో ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో జోడీ వాకోవర్ ఇచ్చింది.

బ్లాక్ హాక్స్ గెలుపు

హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ 3-1తో గోవా గ్లాడియేటర్స్‌పై నెగ్గింది. బ్లాక్ హాక్స్ 15-13, 20-18, 17-15, 15-9తో విజయం సాధించింది. యుధి యమమోటో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

ఇన్ఫీ లాభం రూ.7,364 కోట్లు

క్యూ2లో 13 శాతం వృద్ధి నమోదు | రూ.44,490 కోట్లకు పెరిగిన ఆదాయం

వార్షికాదాయ అంచనా 2-3 శాతం ● ఒక్కో షేరుకు రూ.23 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికానికి (క్యూ2) దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ రూ.7,364 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి గడించిన రూ.6,506 కోట్ల లాభంతో పోలిస్తే 13.2 శాతం వృద్ధి నమోదైంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 8.6 శాతం పెరిగి రూ.44,490 కోట్లకు చేరింది. 2024-25 క్యూ2లో రెవెన్యూ రూ.40,986 కోట్లుగా ఉంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయం వృద్ధి అంచనా శ్రేణిని జూన్ త్రైమాసికంలో (క్యూ1)లో ప్రకటించిన 1-3 శాతం నుంచి 2-3 శాతానికి మెరుగుపరిచింది. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీ తన వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.23 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. క్యూ2 ఆదాయంలో ఆర్థిక సేవల విభాగం వాటా 5.6 శాతం పెరిగి 27.7 శాతానికి చేరుకుంది. మాన్యుఫాక్చరింగ్ విభాగ వాటా 16.5 శాతంగా నమోదైంది. ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ విభాగ వాటా 13.4 శాతంగా, రిటైల్ 12.7 శాతం, కమ్యూనికేషన్స్ విభాగ వాటా 12.1 శాతంగా ఉంది. ఈ జూన్ 30 నాటికి కంపెనీలో మొత్తం 3,23,788 మంది ఉద్యోగులుండగా.. ఈ సెప్టెంబరు 30 నాటికి 8,203 పెరుగుదలతో 3,31,991కి పెరిగింది. క్యూ2లో ఉద్యోగుల వలసల రేటు 14.3 శాతానికి తగ్గింది.


ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ , సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా

12,000 మంది ఫ్రెషర్ల నియామకం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరుతో ముగిసిన ప్రథమార్ధంలో 12,000 మంది ఫ్రెషర్లను నియమించుకున్నట్లు ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మొత్తానికి ప్రణాళికకు అనుగుణంగా 20,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోనున్నట్లు ఆయన చెప్పారు.

హెచ్1బీ వీసాల అవసరం చాలా తక్కువే..

అమెరికాలోని మా కార్యాలయాల్లో పనిచేస్తున్న మెజారిటీ ఉద్యోగులకు ఇమ్మిగ్రేషన్ మద్దతు అవసరం లేదు. వీసా స్పాన్సర్‌షిప్ అవసరమైన వారు చాలా తక్కువ మందేనని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ తెలిపారు.

"అనిశ్చిత వాతావరణం ఇంకా కొనసాగుతోంది. సాధారణంగా ఐటీ రంగంలో ప్రథమార్ధంతో పోలిస్తే ద్వితీయార్ధంలో వ్యాపారం నెమ్మదిస్తుంది. అయితే, కొత్త డీల్స్ చురుకుగా జరుగుతున్న నేపథ్యంలో వార్షికాదాయ అంచనా దిగువ శ్రేణిని 2 శాతానికి పెంచాం. ఈ అంచనాను అందుకుంటామని పూర్తి ధీమాతో ఉన్నాం."
– సలీల్ పరేఖ్, ఎండీ, సీఈఓ, ఇన్ఫోసిస్

తగ్గిన సైయెంట్ లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సైయెంట్ రూ.137 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 16.4 శాతం క్షీణించింది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం ఆదాయం మాత్రం 4.5 శాతం వృద్ధితో రూ.1,438 కోట్లుగా నమోదైంది. కాగా ఒక్కో షేరుకు కంపెనీ రూ.16 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

అమెరికాకు తగ్గిన ఎగుమతులు

న్యూఢిల్లీ: అమెరికాకు జరిగే వస్తు ఎగుమతులపై సుంకాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. సెప్టెంబరు నెలలో మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతులు 546 కోట్ల డాలర్లకు (సుమారు రూ.48,000 కోట్లు) పడిపోయాయి. గత ఏడాది సెప్టెంబరుతో పోలిస్తే ఇది 11.7% తక్కువ. ఈ ఏడాది ఆగస్టులో నమోదైన 687 కోట్ల డాలర్ల ఎగుమతులతో పోల్చినా ఎగుమతులు 17.9% తగ్గాయి. ఆగస్టు 27 నుంచి అమెరికా మన వస్తు ఎగుమతులపై 50% సుంకాలు విధించడమే ఇందుకు ప్రధాన కారణం.

మార్కెట్‌కు కొనుగోళ్ల మద్దతు

862 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల ప్రభావం వల్ల గురువారం వరుసగా రెండో రోజు కూడా ఈక్విటీ మార్కెట్లలో ర్యాలీ కొనసాగింది. అమెరికన్ ఫెడరల్ కీలక వడ్డీ రేటు తగ్గిస్తుందన్న ఆశలు మార్కెట్లలో కొనుగోళ్ల జోరును పెంచాయి. సెన్సెక్స్ 862.23 పాయింట్ల లాభంతో 83,467.66 వద్ద ముగియగా నిఫ్టీ 261.75 పాయింట్ల లాభంతో 25,585.30 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 1010.05 పాయింట్ల లాభంతో 83,615.48 పాయింట్లను తాకింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.47%, మిడ్‌క్యాప్ సూచీ 0.29% లాభపడ్డాయి.

ఐపీఓకి డ్యూరోఫ్లెక్స్: మ్యాట్రెసెస్ తయారీ కంపెనీ డ్యూరోఫ్లెక్స్ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి అనుమతి కోరుతూ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా తాజాగా రూ.183.6 కోట్ల విలువ గల ఈక్విటీ షేర్లు జారీ చేయనుంది. ఓఎఫ్ఎస్ విధానంలో ప్రమోటర్లు 2.25 కోట్ల ఈక్విటీ షేర్లు విక్రయించనున్నారు.

బిజినెస్

ఔన్స్ గోల్డ్ 4,300 డాలర్లు దాటిన

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం సరికొత్త రికార్డు స్థాయికి ఎగబాకింది. ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు ఒక దశలో 100 డాలర్లకు పైగా పెరిగి తొలిసారిగా 4,300 డాలర్లు దాటింది. అమెరికా-చైనా మధ్య మళ్లీ మొదలైన వాణిజ్య యుద్ధం, యూఎస్ షట్‌డౌన్ వంటి ప్రతికూలతలతో పాటు అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు బులియన్ డిమాండ్‌ను ఎగదోస్తున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఔన్స్ గోల్డ్ 61 శాతానికి పైగా పెరిగింది. భారత్‌లో బంగారం ధరలు ఇంటర్నేషనల్ మార్కెట్ రేటు, డాలర్-రూపాయి మారకం విలువకు అనుగుణంగా మారుతుంటాయి. దీంతో శుక్రవారం ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల పసిడి మరో రూ.2,800కు పైగా పెరిగి రూ.1.35 లక్షలకు చేరువయ్యే అవకాశం కనిపిస్తోంది.

ఎస్‌జీబీలు అదుర్స్: 2017-18 ఆర్థిక సంవత్సరంలో సిరీస్-3 కింద జారీ చేసిన సావరిన్ గోల్డ్ బాండ్స్ (ఎస్‌జీబీ) కూడా మదుపరులు బంపర్ లాభాలు పంచాయి. 2017 అక్టోబరు 16న జారీ చేసిన ఈ ఎస్‌జీబీల ఫైనల్ రిడంప్షన్ గడువు గురువారంతో ముగిసింది. ఒక్కో గ్రాము రూ.2,860 చొప్పున ఈ బాండ్స్ కొనుగోలు చేసిన వారికి తుది రిడంప్షన్ నాటికి ఒక్కో గ్రాము ఎస్‌జీబీపై రూ.12,567 అందుకున్నారు. అంటే ఎనిమిదేళ్ల కాలపరిమితి ముగిసేసరికి మదుపరులు 388 శాతం లాభం కళ్లజూశారు.

విప్రో ఆదాయం రూ.22,697 కోట్లు

లాభం రూ.3,246 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికానికి (క్యూ2) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన ఒక శాతం పెరిగి రూ.3,246.2 కోట్లుగా నమోదైంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.3,208.8 కోట్లుగా ఉంది. ఈ క్యూ2లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.7 శాతం పెరిగి రూ.22,697.3 కోట్లకు చేరింది. ఈ జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంతో పోలిస్తే మాత్రం విప్రో లాభం 2.5 శాతం తగ్గగా.. ఆదాయం 2.5 శాతం పెరిగింది. ఈ క్యూ2 ఆదాయంలో 34.3 శాతం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) రంగం నుంచి సమకూరింది. కన్స్యూమర్ 18.2 శాతం, ఎనర్జీ, మాన్యుఫాక్చరింగ్ అండ్ రిసోర్సెస్ 17.4 శాతం, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్స్ 15.6 శాతం, హెల్త్‌కేర్ రంగం నుంచి 14.5 శాతం రెవెన్యూ లభించింది.

ఏఐ సేవల కోసం విప్రో ఇంటెలిజెన్స్

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతిక సేవలను మరింత విస్తృతం చేసేందుకు విప్రో ఇంటెలిజెన్స్‌ను ప్రారంభించింది సంస్థ. ఏఐ పవర్డ్ ప్లాట్‌ఫామ్స్, పరిష్కారాలు, ఆఫరింగ్స్‌తో కూడిన ఈ ఏకీకృత సూట్ ద్వారా కంపెనీ తన క్లయింట్లకు సమగ్ర స్థాయి ఏఐ సేవలందించనుంది. క్లయింట్లు ఏఐ సంబంధిత ప్రాజెక్టులపై ఎక్కువగా వెచ్చిస్తున్నారని విప్రో సీఈఓ, ఎండీ శ్రీనివాస్ పల్లియా అన్నారు.

2,900 మంది ఫ్రెషర్ల నియామకం

క్యూ2లో విప్రో ఉద్యోగుల సంఖ్య 2,260 పెరిగి మొత్తం 2,35,492కు చేరింది. గడిచిన మూడు నెలల్లో 2,900 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకున్నట్లు విప్రో సీహెచ్ఆర్ఓ సౌరభ్ గోవిల్ తెలిపారు. డిమాండ్ ఆధారంగా భవిష్యత్‌లో ప్రాంగణ నియామకాలు జరుపుతామన్న గోవిల్.. నిర్దిష్ట సంఖ్యనేమీ చెప్పలేదు. గత క్వార్టర్‌లో కంపెనీ ఉద్యోగుల వలసల రేటు 14.9 శాతంగా ఉంది.

అమెరికా ఉద్యోగుల్లో 80 శాతం స్థానికులే..

హెచ్1బీ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచిన విషయంపై విప్రో సీహెచ్ఆర్ఓ స్పందిస్తూ.. అమెరికాలోని తమ ఉద్యోగుల్లో 80 శాతం స్థానికులేనని అన్నారు. వీసా ఫీజు పెంపు ప్రభావం కంపెనీపై చాలా స్వల్పమేనని గోవిల్ పేర్కొన్నారు.

'పీఎస్‌బీ'ల్లో మరో మెగా విలీనం!

త్వరలో క్యాబినెట్ ముందుకు ప్రతిపాదన

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)ల్లో మరో మెగా విలీనానికి రంగం సిద్ధమవుతోంది. చిన్న బ్యాంకులైన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐఓబీ), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (సీబీఐ), బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం)లను భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ), పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) వంటి పెద్ద బ్యాంకుల్లో విలీనం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. దీనికి సంబంధించిన ప్రతిపాదనను అధికారులు త్వరలోనే కేంద్ర క్యాబినెట్, ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపిస్తారని తెలుస్తోంది.

ఎందుకంటే?

తదుపరి ఆర్థిక సంస్కరణల్లో భాగంగా పరపతి విస్తరణ జరగాలంటే పీఎస్‌బీల్లో ఈ మెగా విలీనాలు తప్పనిసరని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు ఫిన్‌టెక్ కంపెనీలు, ప్రైవేట్ బ్యాంకులు డిజిటల్ సేవలతో దూసుకుపోతున్నాయి. చిన్న పీఎస్‌బీలు వాటితో సరిగా పోటీపడలేక పోతున్నాయి. ఈ సమస్య నుంచి బయట పడాలంటే ఆర్థికంగా పటిష్ఠంగా ఉన్న పెద్ద పీఎస్‌బీల్లో విలీనం చేయడమే మార్గమని అధికార వర్గాలు భావిస్తున్నాయి. నిజానికి ఐఓబీ, సీబీఐలను ప్రైవేటీకరించాలని నీతి ఆయోగ్ ఐదేళ్ల క్రితమే సిఫారసు చేసింది. అయితే ఉద్యోగ సంఘాల వ్యతిరేకత, ఇతర సమస్యల కారణంగా ఈ విషయంలో పెద్దగా పురోగతి లేదు. ప్రైవేటీకరణకు బదులు చిన్నచిన్న పీఎస్‌బీలను పెద్ద పీఎస్‌బీల్లో విలీనం చేస్తే ఉద్యోగ సంఘాల నుంచి కూడా పెద్దగా వ్యతిరేకత ఉండక పోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం అమలైతే ప్రస్తుతం 12గా ఉన్న పీఎస్‌బీల సంఖ్య ఎనిమిదికి తగ్గుతుంది.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీలోకి ఓలా



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్.. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) మార్కెట్లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా తన తొలి రెసిడెన్షియల్ ఎనర్జీ స్టోరేజ్ సొల్యూషన్ 'ఓలా శక్తి'ని ఆవిష్కరించింది. ఓలా శక్తిని దేశీయంగా తయారు చేసిన 4680 భారత్ సెల్ టెక్నాలజీతో తీసుకువచ్చినట్లు ఓలా ఎలక్ట్రిక్ తెలిపింది. గృహోపకరణాలకు అనుగుణంగా ఉండే 120-290 వోల్టేజ్ పరిధిలో ఇది పనిచేస్తుందని తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	560
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	573	విశాఖపట్నం	545
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	124
వరంగల్	110	గుంటూరు	121
కరీంనగర్	110	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	107
విశాఖపట్నం	129	అనంతపురం	107
గోదావరి	124		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,29,440 ▲	1,18,650 ▲	2,06,000 ▲
విజయవాడ	1,31,000 ▲	1,25,000 ▲	1,81,000 ▲
విశాఖపట్నం	1,31,230 ▲	1,18,150 ▲	2,06,000 ▼
రాజమండ్రి	1,28,440 ▲	1,18,650 ▲	1,93,000 ▼
ప్రొద్దుటూరు	1,31,300 ▼	1,20,800 ▲	1,80,000 ▼
ముంబై	1,27,470 ▲	1,16,763 ▲	1,68,083 ▼

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 17-10-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ఆంధ్రజ్యోతి
IV
నవ్య నివేదన
శుక్రవారం • 17 అక్టోబర్ 2025

పర్వదినం



భారతీయ సాంస్కృతిక వారసత్వ చిహ్నంగా... యుగయుగాలుగా జరుపుకొంటున్న పండుగ దీపావళి. భారతీయ సనాతన ధర్మం దీపారాధనకు విశిష్ట స్థానం ఇచ్చింది. శ్రీఆదిశంకరాచార్యులు షణ్మత స్థాపన చేసినప్పుడు... పంచాయతన పూజా విధానంలో స్కంధునికి ప్రతీకగా... దీపారాధన ఏర్పాటు చేశారు. ఏ శుభ కార్యాన్ని ప్రారంభించినా ముందుగా దీపారాధన చేయడం ఆచారం. దీపం అగ్నికి సంకేతం. సత్కార్యాన్ని అడ్డుకోవడానికి వచ్చిన దుష్టశక్తులను దహించేయాలన్నది దానిలోని అంతరార్థం. సృష్టి, స్థితి, లయలకు దీపంతో సంబంధం ఉంది. దీపంలో కనిపించే నీలం, తెలుపు, ఎరుపు రంగులు త్రిమూర్తులకు ప్రతీకలంటారు. అదే విధంగా, విద్య, శక్తి, ఐశ్వర్యాలను ప్రసాదించే సరస్వతి, దుర్గ, మహాలక్ష్మి ఆ దీపకాంతిలో కొలువై ఉంటారని పూర్వులు చెప్పారు.

దీపావళి... దివ్య శోభావళి

దీపదర్శనం సకల పాపాలను పోగొడుతుంది. హృదయం అనే ప్రమిదలో భక్తి అనే తైలాన్ని నింపి, విశ్వాసం అనే వత్తిని ప్రేమ అనే అగ్నితో జ్వలింపజేసేదే దీపం. కళ్ళలో కనిపించే వెలుగు దాని కాంతి, జ్ఞానం అనే జ్యోతి. దీపకాంతులు విరజిమ్మే ఇంట్లో లక్ష్మీదేవి నివసిస్తుందనీ, నిత్యం ఉభయ సంధ్యల్లో దీపాలు వెలిగే ఇంట సిరిసంపదలు, సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని శాస్త్రవచనం. దీపావళి వేడుకలు ప్రాచీన కాలం నుంచి జరుగుతున్నాయి. పురాణాల్లో, ఇతిహాసాల్లో దీని ప్రస్తావన ఉంది. ప్రస్తుతం వివిధ ప్రాంతాల వారు తమతమ ఆనవాయితీల ప్రకారం ఈ పండుగను నిర్వహించుకుంటున్నారు. ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో అయిదు రోజుల పాటు... ధనత్రయోదశి (లక్ష్మీ పూజ), నరకచతుర్దశి (నరక సంహారం), దీపావళి (నరకాసుర సంహారానికి ఆనందం ప్రకటించడం, పితృదేవతలను స్మరిస్తూ, భూలోకానికి వచ్చిన వారు తిరిగి ఊర్ధ్వలోకాలకు వెళ్ళే మార్గం సూచిస్తున్నట్టు దివిటీలు చూపించడం) ఆశ్వయుజ మాసం చివరిలో వస్తాయి. కార్తిక మాసం ప్రారంభం రోజును... అంటే 'బలి పాడ్యమి'గా పరిగణిస్తారు. ఆ రోజున గోవర్ధన పూజలు జరుగుతాయి. విదియనాడు సోదరి ఇంట సోదరుడు విందు (భగినీ హస్తభోజనం) ఆరగించి, దీవెనలు, కానుకలు ఇస్తాడు. ఇది రక్షాబంధన్‌ను పోలి ఉంటుంది. దక్షిణ భారతదేశంలో... నరక చతుర్దశి, దీపావళిగా... రెండు రోజుల పండుగగా దీన్ని నిర్వహిస్తారు. బెంగాల్ ప్రాంతంలో కాళీ పూజలు, తమిళనాడులో ప్రత్యేకంగా పితృ పూజలు చేస్తారు.

విధి, విధానం

దీపావళి ముందురోజే ఇంట్లో అందరూ తైలంతో అభ్యంగన స్నానం చెయ్యాలి. తైలంలో లక్ష్మి, జలంలో గంగ సూక్ష్మరూపంలో ఉంటారని శాస్త్రాలు చెప్పాయి. అలాగే దీపావళి రోజున కూడా సూర్యోదయానికి ముందే తలస్నానం చేయాలి. ఆ రెండు రోజులూ ఉదయాన్నే ఇష్ట దైవాలను పూజించాలి. దీపాలను వెలిగించి, పూజామందిరం దగ్గర, ఇంటి ముందు, తులసికోట దగ్గర ఉంచాలి. దీపావళి నాడు లక్ష్మీ పూజ నిర్వహించాలని విష్ణు, మార్కండేయ పురాణాలు ప్రత్యేకంగా చెప్పాయి. అది క్షీరసాగర మథనంలో లక్ష్మీదేవి ఆవిర్భవించిన రోజు. దీపావళి నాటి సాయంత్రం ఇంటి ముంగిట కల్లాపు చల్లి ముగ్గులు పెట్టాలి. తులసికోట దగ్గర అలంకారాలు చేయాలి. అష్టైశ్వర్యాలు అనుగ్రహించే లక్ష్మీదేవితోపాటు గణపతిని కూడా అర్చించాలి. ప్రమిదల్లో దీపాలు వెలిగించాలి. షడ్రుచులతో కూడిన వంటకాలను నివేదించాలి. ధూప, దీప నివేదనలు పూర్తయిన తరువాత... ప్రమిదలను ఇంటి ముంగిట అలంకరించాలి. తులసికోట దగ్గర, ప్రతి గుమ్మానికి ఇరువైపులా దీపాలు పెట్టాలి. అలా దీపజ్యోతులతో ప్రకాశవంతమైన ఇంటికి మహాలక్ష్మి వచ్చి కొలువై ఉంటుందన్నారు పెద్దలు. అనంతరం బాణాసంచా కాల్చి, ఆనందోత్సాహాలతో వేడుక జరుపుకోవాలి.

• ఆయపిళ్ళ రాజపాప
(20న దీపావళి)

విశేషం

ప్రాచీనులు ఏర్పాటు చేసిన సంప్రదాయాలకు సంబంధించిన ప్రతి విధానం కుటుంబ సామరస్యానికి, ఆరోగ్య అభివృద్ధికి, ముఖ్యంగా సమాజ ఐకమత్యానికి సరిపడేలా చేసినదే. 'భగినీ హస్త భోజనం' కూడా అటువంటిదే. 'కార్తికమాసం ఎప్పుడు వస్తుందా? అక్క లేదా చెల్లెలి చేతి భోజనం ఎప్పుడు చేద్దామా?' అని ఎదురు చూస్తూ, బాంధవ్యపు గౌరవాన్ని నిలబెట్టుకొనేవారు నేటికి కూడా ఎందరో ఉన్నారు.

బంధాలు నిలిపే భోజనం...

'భగిని' అంటే 'పురుష సంతానమైన తనతో పాటు అదే తల్లి గర్భంలో పుట్టిన స్త్రీ సంతానం 'అని అర్థం. దీన్నే 'సహ+ఉదర' (సహోదర) అనే పదంతో వ్యవహరిస్తూ ఉంటారు. 'సోదర' అనే పదం కూడా ఉంది. సమానం ఉదరం యయోస్తా సోదరౌ... తనకు, తన చెల్లెలికి, అక్కకు తల్లి గర్భం ఒకటే అయినప్పుడు 'సోదర', 'సోదరి' అంటారు. ఆ సోదరీమణుల్లో వివాహాలు అయ్యాక, ప్రధాన కుటుంబం నుంచి వేరైపోయి, వేరే చోట ఉన్నప్పుడు... అప్పుడప్పుడు ఒక్క చోట కలుసుకోవడానికి, కలిసి భోజనం చేస్తూ, చిన్ననాటి విశేషాలను ముచ్చటించుకుంటూ, ఒక రోజంతా ఆనందంగా గడపడానికి ఏర్పాటు చేసిన పండుగ రోజు ఇది.

'పుట్టింటి చుట్టమైతే వంటింట్లో, అత్తింటి చుట్టమైతే వరండాలో...' అని తెలుగులో ఒక సామెత ఉంది. అక్కా చెల్లెళ్ళ ఇంటికి అన్నా తమ్ముళ్ళు వస్తే... కాళ్ళు కడుక్కున్నదే తడవుగా వంట చేస్తున్న అక్క దగ్గరకో, చెల్లెలి దగ్గరకో చేరుతారు. చిన్నప్పుడు బడిలో పెన్సిలు దొంగతనాలు, ఇంట్లో పాలూ పెరుగూ ఎవరికీ తెలియకుండా తాగెయ్యడం, మామయ్యను ఆటపట్టించడం, తాతయ్యతో మొట్టికాయలు తినడం, కలిసి ఎడ్ల బండి మీద పొరుగూరు తిరునాళ్ళకు వెళ్ళడం, అక్కడ కొనుక్కున్న బూరాలు, జడకుప్పెలు... ఇలా ఎన్నెన్నో మాట్లాడుకుంటూ ఉంటే, ఎంతో ఆనందం వెల్లివిరుస్తుంది.

దాంపత్యాలకు చికిత్స

ఈ పండుగ ప్రయోజనం అంతమాత్రమే కాదు... ఆ ఇద్దరూ ఉన్నవేళ... బావగారో, బావమరిదో తమ భార్యల మీద విసుక్కున్నా, చిర్రుబుర్రుమన్నా ఆ ఇంటి పరిస్థితి అడగకుండానే తెలిసిపోతుంది. తమ సోదరులకు ఇలాంటి పరిస్థితి ఎదురైతే పరిష్కరించవచ్చు. కానీ సోదరీమణుల కుటుంబాల్లో అలా కుదరదు. కాబట్టి పరిస్థితిని మౌనంగా గమనించి, తిరిగి వచ్చిన తరువాత ఆ తమ తండ్రికి తెలియజేసేవారు. మనం కూడా ఏదైనా కార్యాలయంలో పని చేస్తున్నట్టయితే.. ఉద్యోగుల మధ్య తలెత్తే వివాదాన్ని సర్వాధికారి సమక్షంలో, అతని అనుమతికి లోబడి పరిష్కరించుకుంటున్నాం కదా! ఇదీ అంతే. అన్నదమ్ములు ఈ పండుగ రోజున వస్తారని తెలిసి... చెల్లెలు-మరిది, అక్క-బావ జాగ్రత్తపడే అవకాశం ఉంది. కాబట్టి తమ కుమార్తెల సంసారం గురించి కుమారులు గమనించి చెప్పిన సమాచారాన్ని తల్లితండ్రులు మనసులో ఉంచుకొనేవారు. అకస్మాత్తుగా కుమార్తెల ఇళ్ళకు వెళ్ళేవారు. తద్వారా వాళ్ళ కుటుంబాల నిజస్వరూపాలు అర్థమయ్యేవి. వారం పదిరోజుల పాటు అక్కడే ఉండి, చికిత్స ప్రారంభించి, పరిస్థితిని సరి చేస్తూ ఉండేవారు. వెనుకటి రోజుల్లో... సకాలంలో ఇటువంటి చికిత్స జరగడం వల్ల విడాకుల మాట వినబడేది కాదు. అంతేకాదు, అత్తమామలు కబురూ కాకరకాయ లేకుండా ఎక్కడ వచ్చేస్తారో అనే ముందుచూపుతో... ఆ భార్యాభర్తలు కూడా సర్దుకుపోయేవారు.

చెరిగిపోని వాత్సల్యం కోసం...

ఈ పండుగ రోజున అన్న చెల్లెలి ఇంటికి



వస్తే... చెల్లెలిని ఆశీర్వదించి, ఆ దంపతులకు, మేనల్లుళ్ళకు, మేనకోడళ్ళకు వస్త్రాలు ఇచ్చేవారు. సోదరీమణులు స్వయంగా వంట చేసి సోదరులకు వడ్డించేవారు. 'భగినీ హస్త భోజనం' అంటే... సోదరి స్వహస్తాలతో వండి, వడ్డించిన భోజనం చేయడం. కాబట్టి పనివారికో, కేటరింగ్ వాళ్ళకో ఆ బాధ్యత అప్పగించడం సరికాదు. ఇలా పండుగలు, పబ్బాలు అనే వంకతో తరచూ కలుసుకోవడం వల్ల బాంధవ్యం, ప్రేమానురాగాలు, వాత్సల్యాలు చెరిగిపోకుండా ఉంటాయి. పురి (పురం అంటే శరీరం. ఆ శరీరంలో ఉంటాడు కాబట్టి ఆయన పురి (పూరీ) జగన్నాథుడు) క్షేత్రంలో అన్నాదమ్ములైన బలభద్రుడు, శ్రీకృష్ణుల మధ్య సుభద్ర నిత్యం పూజలందుకుంటూ ఉంటుంది. భ్రాతృ సంబంధాన్ని ఎప్పటికీ చెడగొట్టుకోవద్దని ఆ విగ్రహాలు సూచిస్తాయి.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
(23న భగినీ హస్తభోజనం)

దైవమార్గం

మార్త-మరియ

ఏసు క్రీస్తు తన పన్నెండు మంది శిష్యులతో గ్రామగ్రామానికీ సంచరిస్తూ, ప్రజల్ని పలకరించి... వారికి బోధలు చేస్తున్న కాలం అది. వారు ఎక్కడికైనా వెళ్ళినప్పుడు... తమతో పాటు ఏదీ తీసుకువెళ్ళేవారు కాదు. కట్టుబట్టలతోనే పర్యటించేవారు. కనీసం ఒక జోలె కూడా ఉండేది కాదు. ఎవరైనా ఆహ్వానిస్తే తప్ప ఏ ఇంట్లోనూ అడుగుపెట్టేవారు కాదు. ఎవరినీ ఏదీ అడిగేవారు కాదు.

ఒకసారి ఏసు శిష్యసమేతంగా ఓ కుగ్రామంలో అడుగు పెట్టాడు. ఆయన



గురించి అప్పటికే ఎన్నో విషయాలు విన్న మార్త అనే యువతి... ఏసును, ఆయన శిష్యులను తన ఇంటికి ఆహ్వానించింది. ఇంటికి వచ్చిన వారికి మర్యాదలు చేయాలి. కానీ వారు పదమూడు మంది. అలాగే గ్రామానికి చెందిన మరికొందరు పెద్దలు కూడా వారి వెనుక ఉంటారు. ఏ సౌకర్యాలు లేని పల్లెలో... వారందరికీ సంతృప్తిగా ఆతిథ్యం ఇవ్వడం మాటలు కాదు. కాబట్టి అతిథులకు మర్యాదలు చేయాలన్న ఆత్రుతతో ఆమె పనిలో నిమగ్నమైపోయింది.

మార్తకు ఒక చెల్లెలు ఉంది. ఆమె పేరు మరియ. వచ్చినవారిని వినయ విధేయతలతో ఆహ్వానించింది. నమస్కారాలతో, ఆత్మీయమైన మందహాసంతో పలకరించింది. ప్రభువు మాట్లాడుతూ ఉంటే.. వినసొంపుగా ఉన్న ఆయన సంభాషణలకు ఆకర్షితురాలైన మరియ... ఆయన పాదాల చెంతనే కూర్చుంది. ఆయన ప్రసంగాన్ని శ్రద్ధాసక్తులతో వింటోంది. ఇదంతా చూసిన మార్తకు మనసు మండిపోయింది. కోపం వచ్చింది. విసుక్కొంది. నేరుగా ప్రభువును సమీపించి... "స్వామీ! ఏమిటిది? నేను హడావిడిగా గొడ్డు చాకిరీ చేస్తూ ఉంటే... మరియ పనీపాటా లేకుండా మీ దగ్గర కూర్చుంది. ఆమెను కనీసం మందలించరా? మీరు చెప్పేవి వింటూ కూర్చుంటే పనులన్నీ ఎవరు చేస్తారు?" అని అడిగింది.

అప్పుడు ప్రభువు చిన్నగా నవ్వి... "ఆమె తన జీవితానికి ఏది అవసరమో దాన్నే వెతుక్కుంటూ వచ్చింది తల్లీ! ఆమె చేసిన పనిలో నాకు దోషం కనిపించలేదు. నీవు చేసే అనవసరమైన అనేక పనుల కన్నా... మరియ చేసేదే మిన్న. మనిషికీ, మనసుకు కావలసిన దాన్నే ఆమె ఎంపిక చేసుకుంది" అంటూ మరియలోని ఆధ్యాత్మిక కోణాన్ని మార్తకు చూపించాడు అజ్ఞానంతో మూసుకుపోయిన ఆమె కళ్ళు తెరిపించాడు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్,
9866755024

సద్బోధ

మార్గాలు వేరు, గమ్యం ఒక్కటే

జెన్ గురించి, జెన్ గురువుల గురించి ఓషో (ఆచార్య రజనీశ్) ఎన్నో ఉపన్యాసాలు ఇచ్చారు. ఆయన జైన కుటుంబంలో జన్మించినా... శ్రీకృష్ణుడు, గౌతమబుద్ధుడు, మహావీరుడు, ఏసు క్రీస్తు, మహమ్మద్ ప్రవక్తల గురించి అద్భుతంగా ప్రసంగించేవారు. ఒకసారి ఒక వ్యక్తి ఆయనను "మీరు ఏ మత ప్రవక్త గురించి చెప్పినా... అతను మాకు జెన్ గురువులాగే అనిపిస్తారు. ఎందుకని?" అని ప్రశ్నించాడు.

అప్పుడు ఓషో "నిజమే. వారంతా జెన్ గురువులే. 'జెన్' అంటే ఒక మతం కాదు. అది అన్ని మతాల మూలం, హృదయాల సారాంశం. సంస్కృతంలోని 'ధ్యానం'... పాళీ భాషలో 'జానం', చైనాలో 'చాన్', జపాన్‌లో 'జెన్' అయింది. అన్ని మతాల్లో ధ్యానమే ప్రధానమైన అంశం. ధ్యానం అంటే... ఆలోచనా తరంగాలు లేని చైతన్యం, ఎరుక. నేను కృష్ణుడు, మహావీరుడు, క్రీస్తు, మహమ్మద్... ఇలా ఎవరి గురించి ప్రసంగించినా... నా ఉద్దేశం మిమ్మల్ని అహంభావం, ఆలోచన లేని ఆ ధ్యాన స్థితికి చేర్చడమే. మీ అహంభావాన్ని నిర్మూలించడానికి, సమూలంగా నరికెయ్యడానికి వారిని నా కత్తులుగా ఉపయోగిస్తాను. 'కృష్ణ' అనే కత్తి కొందరికి ఉపయోగపడుతుంది. 'క్రీస్తు' అనే కత్తి మరి కొందరి విషయంలో పని చేస్తుంది" అన్నారు.



వివిధ మతాలకు చెందిన మహనీయులు ఎన్నో విషయాలు చెప్పారు. అయితే వారు ప్రాధాన్యత ఇచ్చింది అహంకార, మమకార నిర్మూలనకే. వాటిని వదులుకున్నప్పుడు చేరే స్థితిని 'జెన్' అని, 'ధ్యానం' అని, 'జ్ఞానం' అని అంటారు. 'పూర్ణం, బ్రహ్మం' అని కొందరు అంటే... 'శూన్యం, నిర్వాణం' అని మరికొందరు అంటారు. 'తావో' అని కొందరు చెబితే, 'నిర్వికల్ప సమాధి' అని ఇంకొందరు చెబుతారు. భాష వేరు, గురువులు వేరు, మతాలు వేరు, ప్రాంతాలు వేరు... కానీ సారాంశం ఒక్కటే. ఏకం సత్... విప్రా బహుధా వదన్తి... ఒకే సత్యాన్ని పండితులు బహు విధాలుగా చెప్పారు. మార్గాలు వేరు, గమ్యం ఒక్కటే. "ధ్యానమే మన స్వరూపం. ఇతర తలపులన్నిటినీ తొలగిస్తే... మన ఆత్మ సంభాషించడాన్ని వినగలుగుతాం. దానిని మీరు ఏ పేరుతోనైనా పిలవవచ్చు" అన్నారు రమణ మహర్షి.

• రాచమడుగు శ్రీనివాసులు

తెలుసుకుందాం

శ్రీవారి రూపం... అపురూపం

తిరుమలలోని ఆనంద నిలయ విమానంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి రూపం సర్వాంగ సుందరం. ఆ దివ్య స్వరూపాన్ని బ్రహ్మాది దేవతలు, అగస్త్యాది ఋషులు... ఇలా ఎందరో దర్శించి తరించారు. బ్రహ్మ పురాణం, శ్రీవరాహ పురాణాల్లో దీనికి సంబంధించిన వర్ణన ఉంది. "భుజకీర్తులు, కడియాలు తదితర అందమైన ఆభరణాలు కలవాడు, పొడవైన చక్కని నాలుగు చేతులు కలవాడు. నీల మేఘాల్లాంటి శరీర వర్ణం కలిగినవాడు, చిక్కని చిరునవ్వుతో భక్తుల మనసులను దోచుకొనే అందమైన ముఖమండలాన్ని, 'దయ' అనే తరంగంతో వికసించిన తామరల్లాంటి విశాలమైన కన్నులు, నిటారైన ముక్కు కలిగినవాడు. బంగారు మకర కుండలాలను, సుదర్శన చక్రాన్ని, శంఖాన్ని ధరించినవాడు. ఎల్లప్పుడూ వరాలు ఇవ్వడానికి వరద హస్తాన్ని, తనను ఆశ్రయించిన వారికి సంసార సాగరం మోకాలి లోతు వరకే ఉంటుందని సూచిస్తూ... కటి ప్రదేశం దగ్గర హస్తాన్ని కలిగినవాడు అయిన నారాయణుణ్ణి స్తుతిస్తూ.. దేవతలు, ఋషులు, దశరథుడు తదితరులు సూర్యుణ్ణి పోలిన ఆ తేజోరాశిని సందర్శించారు" అని అది చెబుతోంది.

ఆభరణాలు, అలంకారాలు....

తిరుమల కొండపై కొలువైన శ్రీవారి రూప సౌందర్యాన్ని ఆపాదమౌళి పర్యంతం కేవలం శుక్రవార అభి



షేకం సమయంలో మాత్రమే దర్శించవచ్చు. పైన పేర్కొన్న పురాణ వర్ణన... శ్రీవారి నిజరూపానికి సరిగ్గా సరిపోలుతోంది. శ్రీ వేంకటేశ్వర స్వామి పదహారు దళాలతో ఉన్న విశాలమైన పద్మపీఠంపై స్థిరంగా, ఠీవిగా నిలబడి ఉంటాడు. ఆయన రెండు పాదాలకు 'నూపురాలు' అనే ఆభరణాలు ఉన్నాయి. రెండు పాదాల్లో.... మధ్య వేళ్ళకు తప్ప మిగతా అన్ని వేళ్ళకూ ఉంగరాలు ఉన్నాయి. పాదాల నుంచి నడుము వరకు పీతాంబరాన్ని ధరించి ఉంటాడు. అందమైన మడతలతో నడుము చుట్టూ ధోవతి చుట్టుకొని, ముడి వేసుకొని, చక్కని సింహతలాటంతో కూడిన వడ్డాణం పెట్టుకొని ఉంటాడు. ఆ ధోవతి కుచ్చిళ్ళను పట్టి ఉంచే నిలువు కుచ్చిళ్ళు.. కాళ్ళకు మధ్యలో, నిండు పాదాల వరకూ ఉంటాయి. శ్రీ వైష్ణవ సంప్రదాయ ప్రకారం... గోచి పోసి, వెనుకవైపు నడుము మధ్య భాగంలో ముడివేసి చెక్కుకున్నట్టు ధోవతి ఉంటుంది. ఇక శ్రీవారి కంఠాభరణాలుగా మూడు హారాలు ఉంటాయి. శ్రీవైష్ణవ సంప్రదాయ 'విష్ణుముడి' కలిగిన యజ్ఞోపవీతం ఆరు పోగులతో ఉంటుంది. దాన్ని' ప్రలంబ యజ్ఞోపవీతం' అంటారు. పొట్ట చుట్టూ 'ఉదరబంధం' అనే ఆభరణం ఉంటాయి. ఛాతీకి కుడివైపున వక్షస్థలంలో... త్రిభుజాకారంలో రెండు చేతులతో.. అభయ, వరద ముద్రలున్న 'వ్యూహలక్ష్మీ అమ్మవారి' స్వరూపం అత్యంత స్పష్టంగా ఉంటుంది. స్వామి నాలుగు చేతులకు కేయూరాలు, కటక, కంకణాలనే ఆభరణాలను, బాహువుల పైభాగంలో కేయూరాలను ధరించి ఉంటాడు. నాలుగు చేతులలో... మణికట్టు దగ్గర మూడేసి కంకణాలు, ప్రతి చేతికి ముంజేతి భాగంలో 'వలయం' అనే మరో ఆభరణం ఉంటాయి. 'వరద హస్తం' లేదా 'వైకుంఠ హస్తం' అని పిలిచే శ్రీవారి కుడి అరచేతి మీద.. ఉత్తమమైన హస్త సాముద్రిక లక్షణాలతో కూడిన హస్తరేఖలు స్పష్టంగా కనిపిస్తాయి. 'కటి హస్తం' లేదా 'కట్యవలంబిత హస్తం' అని పిలిచే ఎడమ చేతిలో నాలుగు వేళ్ళు ఎడమ తొడను తాకుతూ ఉంటాయి, బొటన వేలు పైకి ఉంటుంది.

అతృప్త్య అమృతరూపం

శ్రీవారి రెండు చెవులకూ మకర కుండలాలు భుజాల వరకూ వేలాడుతూ ఉంటాయి. శిరస్సు మీద అత్యంత గంభీరంగా, వెదురుకాండంలా పొడవైన, అందమైన కిరీటం ఉంటుంది. కిరీటం కింది భాగంలో రత్నపట్ట, మధ్యభాగంలో కళాసౌందర్యంతో నిండిన పత్రపూరిమం, కిరీటం కింది భాగంలో 'ముకుళం' అనే పద్మం, దానిపైన శిఖామణి ఉంటాయి. కిరీటానికి, లలాటానికి మధ్య అనుసంధానంగా 'లలాట పట్టి' అనే రమణీయ ఆభరణం ఉంటుంది. స్వామి వారి నాసిక సూటిగా కొనదేలి ఉంటుంది. పుష్టిగా ఉన్న బుగ్గలు, చిన్న గడ్డం, అందమైన పెదవులు, వాటిపై అందరినీ మంత్రముగ్ధుల్ని చేసే చిరునవ్వుతో దర్శనమిస్తారు. కళ్ళు కలువల్లా ఉంటాయి. మధ్యలో కనుపాప గుండ్రంగా స్పష్టంగా కనిపిస్తుంది. కనుబొమ్మలు చక్కటి కృతితో, నాసిక ప్రారంభమయ్యేచోట కలుస్తాయి. ఒక్కటని ఏమిటి... శ్రీవారి దివ్యమంగళ విగ్రహంలో ప్రతి భాగం... పాదాల నుంచి కిరీటం వరకూ అత్యద్భుతంగా ఉంటుంది. చూసేకొద్దీ చూడ ముచ్చటగా భక్తుల మనస్సులను కట్టి పడేస్తుంది. అందుకే శ్రీవారి అర్చన స్వరూపానికి 'అతృప్త్య అమృతరూపం' అని పేరు.

• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి, 9440525788
(శ్రీ విఖనస ట్రస్ట్ ప్రచురించిన 'ది హిల్ ష్రైన్ ఆఫ్ తిరువేంగడం', టిటిడి ప్రచురించిన 'శ్రీ వేంకటేశ్వరస్వామివారు', 'శ్రీవారి సేవాక్రమం' గ్రంథాల ఆధారంగా)

థాయిలాండ్‌లో విష్ణురూపం

ఇటీవల థాయిలాండ్‌లో వెలుగుచూసిన విష్ణురూపం విషయానికి వస్తే... అర్చారూపంలో ఉన్న స్వామి రెండు పరహస్తాలలో శంఖు, చక్రాలను ధరించాడు. కుడి స్వహస్తాన్ని అభయముద్రగా, ఎడమ హస్తాన్ని 'కట్యవలంబిత ముద్ర'గా కలిగి ఉన్నాడు. తలపై కిరీటం, మెడలో కంఠహారం, ఉదర బంధం, యజ్ఞోపవీతం, కటిపై మణిమేఖలం, పాదాలపై మంజీరాలు, చేతులకు కడియాలు, బాహు వలయాలు, నడుము నుంచి దిగువకు పట్టుధోతీ, మధ్యలోనూ, నడుముకు అటూ ఇటూ కుచ్చిళ్ళు, ఆ ధోతీని బిగించి పట్టి ఉంచేందుకు అందమైన వడ్డాణం ధరించి ఉన్నాడు. ప్రతిమా లక్షణాన్ని అనుసరించి... ఆ విష్ణుమూర్తి శిల్పం క్రీస్తుశకం పది లేదా పదకొండో శతాబ్దాల కాలానిదని చెప్పవచ్చు. అయితే గదా పద్మాలు లేవు కాబట్టి... అది విష్ణుమూర్తి చతుర్వింశతి మూర్తులకన్నా భిన్నంగా ఉంది. ఎడమ హస్తం... కట్యవలంబిత హస్తంగా... శ్రీ వేంకటేశ్వరస్వామిని పోలి ఉన్నా, కుడి హస్తం వరద ముద్రగా కాకుండా అభయ ముద్రగా ఉంది కాబట్టి.... ఆ అందమైన మూర్తిని విష్ణు అంశకు చెందిన ఒక ప్రత్యేక ప్రతిమగా చెప్పవచ్చు. కానీ పాదపీఠం అచ్చం తిరుమల శ్రీవారి పాదపీఠంలా ఉండడం విశేషం.

సందేశం

మూడు వాగ్దానాలు

దేవుడి పట్ల భక్తి విశ్వాసాలు ఉన్న వారికి భరోసాను కల్పించే మూడు వాగ్దానాలను దైవ ప్రవక్త మహమ్మద్ చేశారు. వాటిలో మొదటిది... దాసుడి సంపద దానం చేయడం వల్ల తరిగిపోదు. అంటే ఒక మనిషి అల్లాహ్ మార్గంలో తన ధనాన్ని వెచ్చించడం వల్ల పేదవాడు అయిపోడు. అంతేకాదు, అతనికి శుభం కలుగుతుంది. అతను దానాలకు, సత్కార్యాలకు చేసిన ఖర్చుకు ఎన్నో రెట్లు తన ధనాగారం నుంచి అల్లాహ్ ప్రసాదిస్తూ ఉంటాడు. అతని ధనాన్ని వృద్ధి చేస్తాడు. రెండోది... దౌర్జన్యం పట్ల సహనం వహించిన వారు దౌర్జన్యానికి గురికారు. అంటే ఒక వ్యక్తి దౌర్జన్యానికి, అన్యాయంగా హింసకు గురైనప్పుడు... దానికి ప్రతీకారంగా దౌర్జన్య మార్గాలను అనుసరించకుండా ఉంటే.. అతని గౌరవాన్ని అల్లాహ్ ఇనుమడింపజేస్తాడు. ఇహపరాలలో గౌరవమైన పదోన్నతులు కల్పిస్తాడు. మూడోది... ఏ వ్యక్తి అల్లాహ్‌ను అర్థించే మార్గం తెరవడో... అతనికి దారిద్ర్యపు మార్గాన్ని అల్లాహ్ తెరుస్తాడు. అంటే... ఎవరైనా సృష్టికర్తను విస్మరించి, సృష్టిని అర్థించడం అలవాటుగా చేసుకుంటే... వారు దరిద్రుల దగ్గర చేతులు చాచే పరిస్థితికి ;గురవుతారు.

ఈ మూడు దైవ ప్రవక్త వాగ్దానం చేసిన తిరుగులేని అల్లాహ్ నిర్ణయాలు. అలాగే నాలుగు రకాల మనుషుల గురించి కూడా దైవప్రవక్త వివరించారు. ఒక రకం దాసులకు దైవం ధన సంపదలు ప్రసాదించాడు. సరైన జీవన విధానానికి కావలసిన జ్ఞానాన్ని ప్రసాదించాడు. అలాంటివారు తమ సంపదల వినియోగం విషయంలో అల్లాహ్‌కు భయపడతారు. ధన సంపదలతో తమ బంధుమిత్రులకు సాయపడతారు. సత్ప్రవర్తన కలిగి ఉంటారు. వారు అందరికన్నా అత్యున్నత స్థానంలో ఉంటారు. రెండో రకం వారికి దైవం మంచి జ్ఞానాన్ని, సత్సంకల్పాన్ని ప్రసాదించాడు. కానీ ధన సంపదలను ఇవ్వలేదు. అలాంటివారు "మేము కూడా ధనవంతులం అయి ఉంటే... వారిలా ఎన్నో పుణ్యకార్యాలు చేసేవాళ్ళం. మా ధనాన్ని సత్కార్యాలకు వినియోగించేవాళ్ళం" అంటారు. ఇలాంటి సంకల్పం కారణంగా... మొదటివారికి లభించినంత పుణ్యం వీరికి కూడా లభిస్తుంది. మూడోరకం వారికి దైవం ధన సంపదలు ప్రసాదించాడు. కానీ వాటిని సక్రమంగా వినియోగించే జ్ఞానాన్ని ప్రసాదించలేదు. అలాంటి వారు ధనాంధకారంతో ఉంటారు. తమ ధనాన్ని తప్పుడు మార్గాల్లో ఖర్చు చేస్తారు. బంధుమిత్రులను, బీదసాదలను పట్టించుకోరు. వారు అత్యంత నీచమైన స్థితిలో ఉంటారు. నాలుగోరకం వారికి అల్లాహ్ ధన సంపదను, మంచి జ్ఞానాన్ని ఇవ్వలేదు. వారు "మాకు ఆస్తిపాస్తులు ఉంటే హాయిగా ఉండేవాళ్ళం. కులాసాగా తిరిగేవాళ్ళం. భోగ విలాసాలలో తేలేవాళ్ళం" అని అనుకుంటారు. వీరి ఉద్దేశం మంచిది కాదు కాబట్టి సర్వ నాశనం అవుతారు. సంకల్పం మంచిది కాదు కాబట్టి అత్యంత నీచమైన స్థితిలో ఉంటారు. అంటే మనిషికి పాపాలు చేయాలనే కోరిక బలంగా ఉండి, వీలుకాకపోవడం వల్ల ఆ పాపాలు చేయకపోయినా... చెడ్డ ఆలోచనల కారణంగా అల్లాహ్ వేసే శిక్షకు పాత్రుడవుతాడు.

• మహమ్మద్ వహీదుద్దీన్





www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



శుక్రవారం | 17-10-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ

ఈశాన్య రుతుపవనాలు వచ్చేశాయి!

- దక్షిణాదిలో పెరగనున్న వర్షాలు
- దేశం నుంచి పూర్తిగా 'నైరుతి' నిష్క్రమణ
- రేపు అరేబియా సముద్రంలో అల్పపీడనం
- 20 కల్లా వాయుగుండంగా మారే చాన్స్
- 24న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

VI


గురువారం కురిసిన వర్షంతో నెల్లూరు రోడ్లపై మోకాలి లోతు నీరు

భారీగా లొంగుబాట్లు!

- కాంకేర్‌లో 50.. బీజాపూర్‌లో 140 మంది
- వీరిలో వాసుదేవరావు అలియాస్ ఆశన్న కూడా
- ఆయన వెంటే నాయకులు రాజమల్లు, రనిత
- నేడు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి సమక్షంలో తుపాకులు వీడనున్న మావోయిస్టు నేతలు
- ఇంత భారీఎత్తున లొంగుబాట్లు ఇదే తొలిసారి
- అబూజ్‌మడ్ మొత్తం దాదాపు ఖాళీ
- లొంగుబాటలో బండి ప్రకాశ్ కూడా?


లొంగిపోవడానికి అడవుల నుంచి బయటికి వస్తున్న క్రమంలో మీడియాతో మాట్లాడుతున్న ఆశన్న

ముందు మనల్ని మనం కాపాడుకోవాలి

- ఆ తర్వాత ఏం చేయాలో ఆలోచించవచ్చు
- సహచరులు అర్థం చేసుకోవాలి: ఆశన్న
- లొంగిపోవాలని ఇతర మావోయిస్టులకు పిలుపు

2



'నెస్లే'లో 16 వేల ఉద్యోగాల కోత!

- భారీ లే ఆఫ్‌లకు సిద్ధమైన దిగ్గజ ఆహార సంస్థ
- రానున్న రెండేళ్లలో తొలగింపునకు ప్రణాళికలు

2

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.58 కోట్ల దోపిడీ

ముంబై వ్యాపారవేత్త నుంచి దోచేసిన సైబర్ నేరగాళ్లు

2

గుజరాత్ మంత్రుల సామూహిక రాజీనామా

నేడు కొత్త మంత్రివర్గ ప్రమాణ స్వీకారం

2 నుంచి చంద్రబాబు లండన్ పర్యటన

- పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు
- అంతర్జాతీయ రోడ్‌షో

VI





అది నాణ్యతలేని మద్యమే

10

- అద్దేపల్లి నకిలీ మద్యం కేసులో ల్యాబ్ నివేదిక
- స్ట్రెంత్ ప్రమాణాలు పాటించకుండా తయారీ
- 25గా ఉండాల్సిన యూపీ 35గా నమోదు
- 75 ఉండాల్సిన ఓపీ 65గా నిర్ధారణ
- ప్రమాదకరం కాకపోయినా మంచిది కాదు
- ఎక్సైజ్ అధికారులకు చేరిన నివేదిక

రష్యా చమురుపై మళ్లీ మంటలు!

- కొనుగోళ్లు ఆపేస్తామని మోదీ నాకు హామీ ఇచ్చారు
- ట్రంప్ వ్యాఖ్య.. తప్పుబట్టిన భారత్
- ఆయనతో ప్రధాని అసలు మాట్లాడలేదని స్పష్టీకరణ
- ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారు.. రాహుల్ విమర్శ

2



2 నుంచి చంద్రబాబు లండన్ పర్యటన

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సహకారంతో నవంబరు 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా నిర్వహించనున్న భాగస్వామ్య సదస్సును విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాతీయ, అంతర్జాతీయ రోడ్ షోలను ప్లాన్ చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామిక ప్రముఖులు, పెట్టుబడిదారులు, విధానాల రూపకర్తలను విశాఖ వేదికపైకి చేర్చి ఏపీని పెట్టుబడులకు గమ్యస్థానంగా ప్రపంచానికి చాటిచెప్పడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా లండన్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ రోడ్‌షోలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. దీనికోసం నవంబరు 2 నుంచి 5 వరకు ఆయన లండన్‌లో పర్యటించనున్నారు. సీఎంతో పాటు ఆయన ముఖ్య కార్యదర్శి కార్తికేయ మిశ్రా కూడా లండన్ వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు సీఎంవో ప్రధాన కార్యదర్శి (పొలిటికల్) ముఖేశ్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

అమరావతిలో మరో రెండు '4 స్టార్' హోటళ్లు

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ప్రభుత్వం మరో రెండు '4 స్టార్' హోటళ్లు, అరకులో ఏకో లగ్జరీ రిసార్ట్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. దీంతో పాటు టూరిజం పాలసీ 2024-29లో భాగంగా ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. ఈ మేరకు పర్యాటక శాఖ ప్రత్యేక సీఎస్ అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అమరావతిలో సదరన్ గ్లోబల్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ సంస్థ నాలుగు నక్షత్రాల హోటల్‌ను ఏర్పాటు చేయనుంది. దీంతో పాటు దసపల్లా అమరావతి హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా నాలుగు నక్షత్రాల హోటల్‌ను నిర్మించాలని నిర్ణయించింది. అరకులో వీఎస్కే హోటల్స్ అండ్ రిసార్ట్స్ ఎల్ఎల్‌పీ సంస్థ ఏకో లగ్జరీ రిసార్ట్‌ను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ మూడింటి ఏర్పాటుకు ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీలో అనుమతి కూడా ఇచ్చింది. వీటికి టూరిజం పాలసీ నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. వంద శాతం ఎస్‌జీఎస్టీని పదేళ్ల పాటు రీయింబర్స్‌మెంట్ చేయనున్నారు. ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌లో 10 శాతం ప్రభుత్వం అందించనుంది. వంద శాతం స్టాంప్ డ్యూటీ రాయితీ ఇవ్వనుంది. పరిశ్రమల ధరలకే విద్యుత్తు సరఫరా చేయనుంది. ఐదేళ్ల పాటు విద్యుత్తు సుంకాన్ని కూడా తిరిగి చెల్లించనుంది. సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులన్నీ ఇచ్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. టూరిజం అథారిటీ సీఈవోకి ఈ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హైకోర్టులోనే తేల్చుకోండి

» తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపుపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంలో ప్రస్తుతం కల్పించుకోలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ టీ-ప్రభుత్వం ఇచ్చిన జీవోపై హైకోర్టు విధించిన స్టే ఎత్తివేసేందుకు నిరాకరించింది. బీసీ రిజర్వేషన్ల అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉండగా తాము విచారణకు స్వీకరించలేమని, దీనిపై హైకోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ)ని జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహ్రాతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. తాము తీసుకున్న ఈ నిర్ణయంతో హైకోర్టు విచారణ ప్రభావితం కావొద్దని, ఉచితానుచితాలపై స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎన్నికలు నోటిఫై చేయడానికి ముందే రిజర్వేషన్లపై చట్టం ఎందుకు తీసుకురాలేదని ధర్మాసనం ప్రశ్నించింది. అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లును గవర్నర్ పెండింగ్‌లో పెట్టారని సింఘ్వీ వివరించారు. గవర్నర్ నిర్దీతకాలంలో ఆమోదించకుంటే అనుమతి ఇచ్చినట్టే భావించాలన్న ఇటీవలి సుప్రీంకోర్టు తీర్పు మేరకు రిజర్వేషన్ల బిల్లుకు ఆమోద ముద్ర పడినట్టేనని భావించామని తెలిపారు. మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటకూడదని సుప్రీం మార్గదర్శకాలు ఉన్నాయి కదా అని ధర్మాసనం ప్రస్తావించగా.. కచ్చితమైన డాటా ఉంటే పరిమితి దాటవచ్చని సుప్రీంకోర్టు పేర్కొందని సింఘ్వీ వివరించారు. ప్రతివాది మధుసూదన్‌రెడ్డి తరఫున గోపాల్ శంకర్‌నారాయణ్ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం తెలంగాణ ప్రభుత్వ పిటిషన్‌ను సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. సాధారణ ప్రాంతాల్లో రిజర్వేషన్లు 50శాతం పరిమితికి మించరాదని స్పష్టం చేసింది.

ఈశాన్య రుతుపవనాలొచ్చేశాయి!

దక్షిణాదిలో పెరగనున్న వర్షాలు

» దేశం నుంచి పూర్తిగా 'నైరుతి' నిష్క్రమణ

» రేపు అరేబియా సముద్రంలో అల్పపీడనం

» 20 కల్లా వాయుగుండంగా మారే చాన్స్

» 24న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దేశం నుంచి నైరుతి రుతుపవనాలు పూర్తిగా నిష్క్రమించాయి. అదే సమయంలో దక్షిణాదిలోని ఐదు వాతావరణ సబ్ డివిజన్లపై ప్రభావం చూపే ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ మేరకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) గురువారం బులెటిన్‌ను విడుదల చేసింది. నైరుతి సీజన్‌లో దేశంలో పుష్కలంగా వర్షాలు కురిశాయి. నాలుగు నెలల సీజన్‌లో 869.6 మిల్లీమీటర్లకుగాను 937.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్ 1నుంచి సెప్టెంబరు 30 వరకు నైరుతి సీజన్‌గా పరిగణిస్తున్నా, అక్టోబరు 15న రుతుపవనాలు పూర్తిగా వైదొలగాల్సి ఉంది. అయితే, ఒకరోజు ఆలస్యంగా గురువారం దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వైదొలిగాయి. అదే సమయంలో తమిళనాడు, పుదుచ్చేరి, కోస్తాంధ్ర, రాయలసీమ, దక్షిణ కర్ణాటక, కేరళల్లో గురువారం ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయి. గడచిన 24గంటల్లో తమిళనాడు, కేరళ, కోస్తాంధ్ర, రాయలసీమల్లో వర్షాలు కురవడం, బంగాళాఖాతం మీదుగా తూర్పు/ఈశాన్య గాలులు భూ ఉపరితలం పైకి వీయడంతో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినట్టు ఐఎండీ నిర్ధారించింది. అక్టోబరు నుంచి డిసెంబరు నెలాఖరు వరకు ఈశాన్య సీజన్‌గా పరిగణిస్తారు. ఈ సీజన్‌లో బంగాళాఖాతం మీదుగా వచ్చే తూర్పు/ఈశాన్య గాలులు ఎక్కువగా ప్రభావం చూపుతాయి. బంగాళాఖాతంలో తుపానులు సంభవిస్తాయి. వీటి ప్రభావంతో దక్షిణాదిలో వర్షాలు కురుస్తాయి. ఇదిలావుండగా కామరూన్ పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, సముద్రం నుంచి వీచే తూర్పుగాలుల ప్రభావంతో గురువారం దక్షిణకోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల వర్షాలు, రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. శుక్రవారం రాయలసీమలో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇక ఆగ్నేయ అరేబియా సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో అదే ప్రాంతంలో శనివారం అల్పపీడనం ఏర్పడనుంది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి వచ్చే సోమవారానికి వాయుగుండంగా బలపడనుందని ఐఎండీ పేర్కొంది. ఇంకా ఈనెల 24వ తేదీన ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, ఇది వాయవ్యంగా పయనించే క్రమంలో బలపడనుందని తెలిపింది.



నెల్లూరు రోడ్లపై మోకాలి లోతు వరకు ప్రవహిస్తున్న వర్షం నీరు

నెల్లూరులో రోడ్లన్నీ జలమయం..

నెల్లూరు జిల్లా వ్యాప్తంగా గురువారం వర్షాలు కురిశాయి. వేకువజాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నెల్లూరు నగరంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వర్షానికి ప్రజలు బయట తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. అత్యధికంగా అల్లూరులో 56.4 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ప్రేమించలేదని పొడిచేశాడు

» బెంగళూరులో ఫార్మసీ విద్యార్థిని దారుణ హత్య


బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రేమను నిరాకరించిందని బీ ఫార్మసీ విద్యార్థిని ఓ యువకుడు కత్తితో పొడిచి దారుణంగా చంపేశాడు. ఈ ఘటన బెంగళూరు నగరంలోని మల్లేశ్వరంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు... పరీక్ష ఉండడంతో యామినీ ప్రియ(20) గురువారం ఉదయం 7 గంటలకు కళాశాలకు బయలుదేరింది. కొంతకాలంగా ప్రేమ పేరుతో వెంటపడుతున్న విఘ్నేశ్, మంత్రిమాల్ వెనుకవైపు ఉన్న రైల్వేట్రాక్ వద్ద ఆమెను ఆపి మరోసారి ప్రేమ ప్రతిపాదన చేశాడు. అంగీకరించని యామిని, పరీక్షకు సమయమవుతోందంటూ హడావుడిగా వెళ్లిపోయింది. పరీక్ష ముగిసిన తరువాత మధ్యాహ్నం ఇంటికి వెళ్తున్న యామినీని రైల్వేట్రాక్ సమీపంలో విఘ్నేశ్ అడ్డుకున్నాడు. వెంట తెచ్చుకున్న కారప్పొడిని ఆమె ముఖంపై కొట్టాడు. కళ్లలో కారప్పొడి పడి విలవిలలాడుతున్న ఆమెను కత్తితో విచక్షణారహితంగా పొడిచి పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో యామినీ ప్రియ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తండ్రి గోపాల్ కన్నీరుమున్నీరవుతూ... 'కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో విఘ్నేశ్ నా కూతురిని హింసిస్తున్నాడు. వేధింపులు భరించలేక ఆరు నెలల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు స్టేషన్‌కు పిలిపించి, హెచ్చరించి, వెంటపడనని చెప్పి రాయించుకున్నారు' అని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మత్తు ఇచ్చి భార్యను చంపిన వైద్యుడు

» అనారోగ్యాన్ని దాచిపెట్టి పెళ్లి చేశారన్న ఆగ్రహంతో దుశ్చర్య

» ఆరు నెలల తరువాత నిర్ధారణ, అరెస్టు

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అనారోగ్యాన్ని దాచి పెళ్లి చేశారన్న కోపంతో రగిలిపోయిన ఓ వైద్యుడు తన భార్యకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి చంపేశాడు. బెంగళూరు నగరంలోని విక్టోరియా ఆసుపత్రిలో చర్మరోగ నిపుణురాలిగా సేవలందించే డాక్టర్ కృత్తికారెడ్డికి, జనరల్ సర్జన్ మహేంద్ర రెడ్డితో 2024, మే 26న వివాహం జరిగింది. కొంతకాలానికి ఆమెకు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. అజీర్తి, గ్యాస్ట్రిక్, లో షుగర్‌తో బాధపడేవారు. పెళ్లికి ముందే ఆమెకు ఈ సమస్యలున్నాయని, వాటిని దాచిపెట్టి పెళ్లి చేశారని మహేంద్రరెడ్డి అనుమానించారు. ఆరు నెలల క్రితం ఆమెకు ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో ఏప్రిల్ 21న నగరంలోని తన పుట్టింటికి వెళ్లారు. కడుపునొప్పికంటూ ఆమెకు అక్కడే మహేంద్రరెడ్డి ఐవీ ఇంజెక్షన్ ఇచ్చారు. మరుసటి రోజు అక్కడే విశ్రాంతి తీసుకోవాలని సూచించి, ఆ రాత్రికి మరో ఐవీ డోస్ ఇచ్చారు. 23న కృత్తిక తన భర్తకు వాట్సప్‌లో తనకు నొప్పి ఎక్కువగా ఉందని మెసేజ్ పెట్టారు. ఆ రోజు రాత్రికి ఇంటికి వచ్చిన మహేంద్ర.. మరోసారి ఇంజెక్షన్ ఇచ్చారు. ఆ మరుసటి రోజు... అంటే 24వ తేదీ ఉదయం స్పృహ కోల్పోయిన ఆమెను కుటుంబ సభ్యులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు, అప్పటికే ఆమె మృతి చెందిందని తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని, పోస్టుమార్టం అవసరం లేదని మహేంద్రరెడ్డి వారించే ప్రయత్నం చేశారు. రేడియాలజిస్టుగా పనిచేస్తున్న కృత్తిక అక్క డాక్టర్ నిఖితరెడ్డి చెల్లి మృతిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఫోరెన్సిక్ ల్యాబ్‌లో పరీక్షించారు. అది సహజ మరణం కాదని, అనస్థీషియా హై డోస్ కారణంగా మృతి చెందారని నివేదిక వచ్చింది. వైద్యం పేరిట తన భార్యను డాక్టర్ మహేంద్ర రెడ్డి కుట్రపూరితంగా హత్య చేసినట్లు తేలింది. పోలీసులు ఆయనను బుధవారం అరెస్టు చేశారు. హత్య జరిగిన ఆరు నెలల తర్వాత వాస్తవం వెలుగులోకి వచ్చింది.



డాక్టర్ మహేంద్రరెడ్డి, డాక్టర్ కృత్తికారెడ్డి దంపతులు (ఫైల్)

తుది చార్జిషీట్ దాఖలు చేశారా?

» కోర్టుకు ఇచ్చింది ఫైనల్ చార్జిషీటేనా?

» సీనియర్ న్యాయవాది లూథ్రాను ప్రశ్నించిన ఏసీబీ కోర్టు

» మద్యం నిందితుల బెయిల్ పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

విజయవాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): "మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు తుది చార్జిషీటు దాఖలు చేశారా? కోర్టుకు ఇచ్చిన చార్జిషీట్ ఫైనల్ అవునో.. కాదో చెప్పండి. మీ ఐవో చాలా తెలివిగా పదాలను ఉపయోగిస్తున్నారు" అని ప్రాసిక్యూషన్ తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో రిమాండ్ ఖైదీలుగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, బూనేటి చాణక్య, చెరుకూరి వెంకటేశ్‌నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణకు సంబంధించిన బెయిల్ పిటిషన్లపై కోర్టులో గురువారం వాదనలు జరిగాయి. నిందితుల తరఫున వారి న్యాయవాదులు వాదనలు వినిపించారు. సీనియర్ న్యాయవాది సిద్ధార్థలూథ్రా వర్చువల్‌గా వాదనలు వినిపించారు. నిందితుల కుట్ర కోణాన్ని వివరించడానికి సమయం పడుతుందన్నారు. ఏడుగురికి సంబంధించిన పిటిషన్లపై వాదనలు వినిపించాల్సి ఉన్నందున రెండు రోజులు గడువు కావాలని కోరారు. దీనికి నిందితుల తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ రోజే వాదనలు ముగించాలన్నారు. రాజ్ కసిరెడ్డి, చాణక్య, బాలాజీ యాదవ్, నవీన్ కృష్ణ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై వారి తరఫు న్యాయవాదులు వాదనల తర్వాత కౌంటర్‌గా లూథ్రా వాదనలు వినిపించారు. ఈ సందర్భంలో లూథ్రాకు న్యాయాధికారి భాస్కరరావు కొన్నిప్రశ్నలు వేశారు. సిట్ అధికారులు కోర్టుకు తుది చార్జిషీటు సమర్పించారా? అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న చార్జిషీటు ఫైనల్ అవునో కాదో దర్యాప్తు అధికారిని అడిగి చెప్పాలన్నారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా పూర్తికాలేదని, ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తును బట్టి చార్జిషీటు దాఖలు చేశామని లూథ్రా తెలిపారు. నిందితులకు ఎట్టి పరిస్థితుల్లోను బెయిల్ మంజూరు చేయడం కుదరదని, కుట్ర కోణాలు బయటకు తీయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తదుపరి వాదనలను శుక్రవారానికి న్యాయాధికారి వాయిదా వేశారు.

ఏపీలో పెట్టుబడులు పెట్టండి!

» స్విట్జర్లాండ్‌లో వస్త్ర పరిశ్రమ ప్రముఖులతో మంత్రి కొండపల్లి సమావేశం

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులతోపాటు సాంకేతిక సహకారం, నూతన ఆవిష్కరణల భాగస్వామ్యాలను ఆకర్షించడమే లక్ష్యంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్విట్జర్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటిస్తున్నారు. గురువారం ఆయన స్విట్జర్లాండ్‌లో అత్యంత నాణ్యతతో వస్త్ర ఉత్పత్తుల తయారీలో అంతర్జాతీయంగా పేరున్న ఒలివర్ సంస్థ ప్రతినిధులు, ఇతర వస్త్ర పరిశ్రమ ప్రముఖులతో సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి వివరించారు. భారత్‌లో తమ యూనిట్‌ను స్థాపించడానికి ఒలివర్ కంపెనీ ఆసక్తి వ్యక్తం చేసినట్లు మంత్రి తెలిపారు. జర్మనీకి చెందిన ఫైర్స్‌ట్‌జెన్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో ఫిలిప్ ఆస్మస్, ఎక్స్‌పోర్ట్ అకాడమీ బాడెన్-వుర్టెన్ బర్గ్ ప్రతినిధులతోనూ కొండపల్లి చర్చలు జరిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' సెట్స్‌లో హైదరాబాద్‌కు చెందిన క్రికెటర్ తిలక్ వర్మకు ఘన సత్కారం జరిగింది. ఇటీవలె జరిగిన ఆసియా కప్ ఫైనల్లో పాకిస్థాన్‌పై అద్భుతంగా ఆడి భారత జట్టు విజయానికి దోహదపడిన తిలక్ వర్మను చిరంజీవి అభినందించి, సన్మానించారు. యూనిట్ సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య తిలక్ వర్మకు శాలువా కప్పి, ఆ మ్యాచ్‌లోని ఓ ఫొటోని ఫ్రేమ్‌గా బహూకరించారు చిరంజీవి. ఈ కార్యక్రమంలో దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల పాల్గొన్నారు.

అసురాగమనం



సాయిదుర్గాతేజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎస్‌వైజీ (సంబరాల ఏటిగట్టు). రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై కె. నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. సాయిదుర్గతేజ్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'ఎస్‌వైజీ' చిత్రం నుంచి 'అసుర ఆగమనం' పేరుతో ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఒక శక్తిమంతమైన యోధుడి పాత్రలో సాయిదుర్గా తేజ్ కనిపించారు. ఈ సందర్భంగా సాయిదుర్గతేజ్ మాట్లాడుతూ 'నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉండడానికి కారణమైన మా ముగ్గురు మావయ్యలు చిరంజీవిగారు, నాగబాబుగారు, పవన్‌కల్యాణ్ గారికి రుణపడి ఉంటాను. నా కెరీర్లో ఇది చాలా ముఖ్యమైన సినిమా. సర్వస్వం ధారపోశాను. మా నిర్మాతలు ఖర్చుకు వెనుకాడకుండా గ్రాండియర్‌గా నిర్మిస్తున్నారు. తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు. కె. నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం సాయిదుర్గాతేజ్ అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. ఈ సినిమా చాలా పెద్ద హిట్టవ్వాలి అని కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'సాయిదుర్గాతేజ్, నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి గారు దర్శకుడిగా నాపైన నమ్మకం ఉంచి భారీ చిత్రాన్ని తెరకెక్కించే అవకాశమిచ్చారు. అందరి సహకారంతో సినిమాను అద్భుతంగా తెరకెక్కిస్తున్నాం' అని రోహిత్ చెప్పారు.



అందరికీ నచ్చే 'డ్యూడ్'

\- ప్రదీప్ రంగనాథన్

'హైదరాబాద్ నాకు మరో కుటుంబం. నా సినిమాలన్నీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. 'లవ్ టుడే', 'డ్రాగన్' లానే 'డ్యూడ్' కూడా అందరికీ నచ్చుతుంది. డైరెక్టర్ కీర్తి చాలా మంచి సినిమా తీశారు. భవిష్యత్తులో అతను ఎంత పెద్ద డైరెక్టర్ అవుతారో సినిమా చూసిన తర్వాత మీరే చెప్తారు' అని అన్నారు కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్. ఆయన ప్రధాన పాత్రలో కీర్తీశ్వరన్ తెరకెక్కించిన చిత్రం 'డ్యూడ్'. ప్రదీప్ సరసన మమిత బైజు కథానాయికగా నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మించారు. సినిమా నేడు విడుదలవుతోన్న సందర్భంగా చిత్ర బృందం ప్రీరిలీజ్ వేడుక నిర్వహించింది. చిత్ర దర్శకుడు కీర్తీశ్వరన్ మాట్లాడుతూ 'నేను స్క్రిప్ట్ రాసుకొని దర్శకుడు కావాలనుకున్న తర్వాత చెన్నై మొత్తం తిరిగాను. చివరకు జూబ్లీహిల్స్‌లో నా ప్రయాణం మొదలైంది. తెలుగు ప్రేక్షకుల గురించి ప్రదీప్ చాలా ఆలోచిస్తారు. ఈ సినిమాలో ఒక విభిన్నమైన మమితను చూస్తారు. దీపావళితోపాటు సెలెబ్రేట్ చేసుకొనేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు. 'సినిమా తప్పకుండా అందర్నీ అలరిస్తుంది' అని చిత్ర నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ అన్నారు. కార్యక్రమంలో దర్శకులు హను రాఘవపూడి, బుచ్చిబాబు సాన, సాయి రాజేశ్, రాహుల్ సాంకృత్యన్, మహేశ్, శివ నిర్వాణ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు రావాల్సిందే



ఫిల్మ్ నగర్‌లోని దక్కన్ కిచెన్ కూల్చివేత కేసుపై నాంపల్లి కోర్టులో గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా హీరోలు దగ్గుబాటి వెంకటేశ్, రానా, నిర్మాత సురేశ్‌బాబు, అభిరామ్ నవంబరు 14న తప్పని సరిగా న్యాయస్థానానికి రావాలని కోర్టు ఆదేశించింది. పర్సనల్ బాండ్ సమర్పించేందుకు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాలను ధిక్కరించి దక్కన్ హోటల్ కూల్చివేశారన్న ఆరోపణలతో వెంకటేశ్, రానా, సురేశ్‌బాబు, అభిరామ్‌పై గతంలో కేసు నమోదైన సంగతి తెలిసిందే.

అభిమానులు గర్వించే సినిమాలు చేస్తా


\- కిరణ్ అబ్బవరం



'ఈ సినిమా చేయాలని అనుకున్నప్పుడే దీపావళికి విడుదల చేయాలని నిర్ణయించుకున్నాం. ఖచ్చితంగా కుటుంబ సభ్యులందరూ కలసి చూసే చిత్రం అవుతుందని నమ్మాం. మేము అనుకున్న దానికంటే సినిమా బాగా వచ్చింది. నన్నూ, మా చిత్రబృందాన్ని నమ్మండి. ఈ దీపావళి పండుగ 'కె.ర్యాంప్'తో మరింత సరదాగా ఉంటుంది. ఇకపై నా అభిమానులు గర్వపడేలా సినిమాలు చేస్తా' అని హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన హీరోగా జైన్స్ నాని తెరకెక్కించిన చిత్రమిది. యుక్తి తరేజా కథానాయిక. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. ఈ నెల 18న విడుదలవుతోన్న సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'సినిమా క్లైమాక్స్‌లో ఒక చిన్న ట్విస్ట్ ఉంటుంది. మంచి సందేశం కూడా ఉంటుంది. అన్ని వాణిజ్య హంగులతో తెరకెక్కించాం. కిరణ్ అబ్బవరం పాత్రచిత్రణ సరికొత్తగా ఉంటుంది. ఇంతకు ముందెన్నడూ చేయని పాత్రను ఈ చిత్రంలో పోషించారు. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో అంచనాలు ఏర్పడ్డాయి. సినిమా కూడా అదే స్థాయిలో ఉంటుంది' అని చెప్పారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'ఈ సినిమాను 47 రోజుల్లో పూర్తి చేశాం. కేరళలో ఆహ్లాదకరమైన వాతావరణంలో చిత్రీకరణ చేశాం. సెట్‌లో ప్రతి రోజూ నవ్వుకున్నాం. సెట్‌లో నవ్వించిన ఏ సినిమా కూడా సక్సెస్ విషయంలో గురి తప్పలేదు. 'కె- ర్యాంప్' కూడా మంచి విజయాన్ని అందుకుంటుంది' అని ఆకాంక్షించారు. సీనియర్ నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమా చూసిన తర్వాత అందరూ మహేశ్ బాబు, అల్లు అర్జున్, నాని తర్వాత కిరణ్ పేరే చెబుతారు. చేతన్ భరద్వాజ్ మంచి సంగీతం అందించారు. భవిష్యత్తులో జైన్స్ నాని పెద్ద దర్శకుడు అవుతాడు' అని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, నటుడు సాయికుమార్, హీరోయిన్లు విమలా రామన్, కామ్నా జెఠ్మలానీ, సంగీత దర్శకుడు చేతన్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



నవంబర్‌లో కొత్త షెడ్యూల్



బాలీవుడ్‌లో వరుస విజయాలతో జోరు చూపుతున్నారు కార్తీక్ ఆర్యన్. ఆయన కథానాయకుడిగా అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ముందు అనుకున్న ప్రకారం ఈ చిత్రం ఈ ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే చిత్రీకరణలో తీవ్ర జాప్యంతో విడుదల వాయిదా పడుతూ వస్తోంది. తాజాగా చిత్రబృందం ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. 'ఈ సినిమా కోసం కార్తీక్ ఆర్యన్ ఇంకా 45 రోజుల పాటు చిత్రీకరణలో పాల్గొనాల్సి ఉంది. నవంబర్ తొలి వారంలో ముంబైలో చిత్రీకరణ ఆరంభిస్తాం. వేసవిలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపింది.

ఇలాంటి విభిన్న చిత్రాలను ప్రోత్సహించాలి

\-సాయి రాజేశ్



అజిత్ మోహన్, రాజు శివరాత్రి, మోనికా బుసం కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, క్యాంప్ శశి తెరకెక్కిస్తున్నారు. రస్తా ఆర్ట్స్, ఔరా ఉలిస్ ఆర్ట్స్, అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు సాయి రాజేశ్ మాట్లాడుతూ 'రోహిత్, శశి తీసే సినిమాలు చాలా బావుంటాయి. కొత్త తరహా కథాంశంతో వస్తున్న చిత్రమిది. తప్పకుండా అందరూ ప్రోత్సహించాలి' అని కోరారు. 'రోడ్ ట్రావెల్ నేపథ్యంలో సాగే చిత్రమిది' అని క్యాంప్ శశి తెలిపారు.

www.andhrajyothy.com
విజయవాడ సిటీ
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
శుక్రవారం | 17-10-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్ర వైభవం!

రాష్ట్రాన్ని కొనియాడుతూ ప్రధాని ప్రసంగం.. మోదీ రాష్ట్ర పర్యటన విజయవంతం

శ్రీశైల మల్లన్న దర్శనంపై ఆనందం.. గుడి అరుగుపైనే బాబు, పవన్‌తో మాటామంతీ

కర్నూలు సభకు వెల్లువలా జనం.. రాష్ట్ర ప్రగతి, ప్రాజెక్టులపై మోదీ ఫోకస్





కర్నూలు సభకు హాజరైన ప్రజలకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ అభివాదం

మీ స్పీడు.. మా తోడు

ప్రధానమంత్రి మోదీ ఏపీ పర్యటన విజయవంతమైంది. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత ఆయన రాష్ట్రానికి రావడం నాలుగోసారి... రాయలసీమలో అడుగు పెట్టడం ఇది తొలిసారి! చంద్రబాబు సమర్థతను ప్రశంసిస్తూ... ఏపీ సత్తాను కొనియాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సాగింది. 'కర్నూలు సభ'కు భారీగా జనం తరలివచ్చారు. ఏపీ సత్తా, వేగం, సామర్థ్యం... దేశాభివృద్ధిలో ఏపీ భాగస్వామ్యం... వికసిత్ భారత్‌కు ఏపీ పురోగతే ఆధారం... అంటూ ఏపీ వైభవాన్ని ప్రధాని పలుమార్లు కొనియాడారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్‌కు మోదీ ప్రాధాన్యం ఇస్తూ సాగారు.

సమగ్ర కథనాలు 8, 9లో

'ఢిల్లీ-అమరావతి' ప్రగతి పరుగు

సీఎం విజన్‌కు సంపూర్ణ సహకారం

చంద్రబాబు, పవన్‌ల సమర్థ నేతృత్వం

ఏపీ ముఖ చిత్రం మారుతోంది

దేశ రక్షణకు కొత్త బలం 'డ్రోన్ హబ్'

'సీమ' ప్రగతి ద్వారాలు తెరిచే ప్రాజెక్టులు

గూగుల్‌తో అంతర్జాతీయ గేట్‌వేగా విశాఖ

ప్రజా ప్రయోజనాలే కేంద్రంగా మా పాలన

జీఎస్టీ సంస్కరణలతో 'పొదుపు పండగ'

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి

కర్నూలు సభలో ప్రధాని మోదీ పిలుపు

పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం

ఆత్మ నిర్భర్ భారత్‌లో ఏపీ కీలకం

సరికొత్త శక్తిగా రాష్ట్రం: మోదీ

కర్నూలు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అభివృద్ధితోనే భారతదేశ అభివృద్ధి ముడిపడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో రాయలసీమ అభివృద్ధి ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. 'ఢిల్లీ - అమరావతి' కలిసి ప్రగతిని పరుగులు తీయిస్తాయని స్పష్టం చేశారు. గురువారం రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ తొలుత శ్రీశైల మల్లికార్జునుడిని దర్శించుకున్నారు. అక్కడి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని వీక్షించారు. అనంతరం కర్నూలుకు చేరుకున్నారు. నన్నూరు సమీపంలోని సభా వేదిక నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రూ.13,429కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులు, పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జరిగిన

మిగతా 9వ పేజీలో...

వికసిత ఏపీతోనే వికసిత భారత్

మోదీ సంస్కరణలు గేమ్ చేంజర్లు

21వ శతాబ్దం ఆయనదే: ముఖ్యమంత్రి

సూపర్ సిక్స్, సూపర్ జీఎస్టీతో సూపర్‌గా పొదుపు

ఒక్కో కుటుంబానికి రూ.15,000 వరకూ ఆదా

డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ ప్రయోజనాలు

16 నెలలుగా రాష్ట్రానికి మోదీ సాయం మరువలేం

కేంద్రం సహకారంతోనే అమరావతిని నిలబెట్టాం

పోలవరాన్ని గాడిన పెట్టాం.. విశాఖ ఉక్కును కాపాడాం

భారీ పెట్టుబడులొచ్చాయ్.. మోదీ వల్లే క్వాంటమ్ వ్యాలీ

సీమకు ఎన్నెన్నో పరిశ్రమలు.. త్వరలోనే హైకోర్టు బెంచ్

బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీయేదే గెలుపు: చంద్రబాబు

• సన్నబడ్డావ్.. భేష్



కర్నూలు విమానాశ్రయంలో మంత్రి లోకేశ్‌తో సరదాగా మాట్లాడుతున్న ప్రధాని మోదీ. సీఎం చంద్రబాబు దరహాసం

మోదీ ఓ కర్మయోగి

ప్రతిఫలం ఆశించకుండా దేశానికి సేవ

భారత్‌ను తలెత్తుకొని నిలబడేలా మార్చారు

పన్నుల భారం తగ్గించడం చరిత్రలోనే లేదు

జీఎస్టీ 2.0తో ప్రతి కుటుంబానికీ ప్రయోజనం

15 ఏళ్లు కూటమి స్థిరమైన పాలన అందించాలి

లోకేశ్‌కు అన్ని శాఖలూ నిర్వహించే సమర్థత ఉంది

కర్నూలు సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

కోరినవన్నీ ఇస్తున్నారు!

ఆంధ్రాపై మోదీకి అపార ప్రేమ

16 నెలల్లో నాలుగు సార్లు రాష్ట్రానికి వచ్చారు

స్థిరమైన అభివృద్ధికి సుస్థిర ప్రభుత్వం ముఖ్యం

ఏపీ నంబర్ వన్ కావాలంటే.. ప్రభుత్వం కొనసాగడం అవసరం

గుజరాత్ ఇలాగే అభివృద్ధి చెందింది

మోదీ 3 దఫాలుగా ప్రధానిగా ఉన్నారు కనుకే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

మాది డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు

మంత్రి లోకేశ్ ఉద్ఘాటన

కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ పేరిట కొందరు అక్రమాలకు తెరలేపారు..! ప్రభుత్వంలో పలుకుబడి.. మంత్రుల అండదండలు ఉన్నాయని ప్రచారం చేసుకుంటూ వసూళ్లు మొదలుపెట్టారు..! కచ్చితంగా రెగ్యులరైజ్ చేయిస్తామని.. ప్రభుత్వ ఉద్యోగం ఖాయమని చెబుతూ.. ఒక్కో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ నుంచి రూ.1.5లక్షలు వసూలు చేసినట్టు సమాచారం. శ్రీకాకుళానికి చెందిన ఓ కాంట్రాక్టు జేఎల్, చిత్తూరుకు చెందిన ఓ కాంట్రాక్టు జేఎల్ దీనిలో కీలకంగా వ్యవహరిస్తున్నారని, వారికి మరో ముగ్గురు జేఎల్స్ సహకరిస్తున్నట్టు తెలిసింది.

ఇంటర్‌లో క్రమబద్ధీకరణ స్కామ్!

కాంట్రాక్టు జేఎల్స్ రెగ్యులరైజేషన్ పేరుతో వసూళ్లు

ఒక్కో జూనియర్ లెక్చరర్ నుంచి రూ.లక్షన్నర

వసూళ్లలో కీలకంగా ఇద్దరు జూనియర్ లెక్చరర్లు

వారిలో ఒకరు ఓ మంత్రికి సన్నిహితుడు

క్రమబద్ధీకరణకు మరో మంత్రి మాటిచ్చారని ప్రచారం

ఇప్పటికే దాదాపు రూ.20 కోట్లు వసూలు

3

జగన్ దెబ్బకు రైతులు విలవిల

నాడు.. లేని భూ వివాదాల సృష్టి.. రీ సర్వే బాధితులు 8.5 లక్షల మంది

పేరు, ఫొటోల పిచ్చితో 800 కోట్లు ఖర్చు

రైతుల ప్రమేయం లేకుండా అడ్డగోలుగా సర్వే

తప్పుల తడకతో అన్నదాతలకు కష్టాలు

కూటమి సర్కారు వచ్చాక వినతుల వెల్లువ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు పోయినా నాటి కష్టాలు ఇంకా వెంటాడుతున్నాయి. నాటి పాలకులు చేసిన తప్పులకు ఇప్పుడు రైతులు బాధలు పడుతున్నారు. రీ సర్వే పేరిట మాజీ సీఎం జగన్ చేసిన భూ విధ్వంస కార్యక్రమం వల్ల దాదాపు 8.5 లక్షల కుటుంబాలు విలవిల్లాడిపోతున్నాయి. చరిత్రలో తన పేరు, ఫొటో శాశ్వతంగా ఉండాలన్న దురాలోచనతో పాస్‌బుక్, సరిహద్దు సర్వే రాళ్ల ఏర్పాటుతో పాటు డ్రోన్లు, రోవర్లు ఇంకా అనేక రకాల సాంకేతిక పరికరాల కొనుగోలు కోసం జగన్ 800 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చు చేశారు. అంతచేసి చివరకు లక్షలాది మంది రైతులను కష్టాలపాలు చేశారు. జగనన్న శాశ్వత భూ హక్కు-రీ సర్వే పేరిట 6,860 గ్రామాల్లో భూముల కొలతలు వేయించి, ఆ గ్రామాల్లో కొత్తగా లక్షలాది సమస్యలు సృష్టించారు. గ్రామానికి సగటున 100 మందిపైనే రైతులు, భూ యజమానులను రీ సర్వే బాధితులుగా మార్చేశారు. శాశ్వత పరిష్కారం అంటూనే.. గ్రామాల్లో గిట్టని తెలుగుదేశం, జనసేన, ఇతర వర్గాల భూములను చిక్కుల్లో పడేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జగన్ సర్వే చేయించిన 6,860 గ్రామాల్లో సభలు నిర్వహించింది. తమకు తీవ్ర భూ సమస్యలు ఉన్నాయంటూ ఏకంగా 8.67 లక్షల మంది రైతులు ఏకరువు పెట్టారు. వారి పిటిషన్లను సర్కారు క్రోడీకరించగా, ఇవన్నీ రీ సర్వే తర్వాత కొత్తగా



పుట్టుకొచ్చిన సమస్యలే అని తేలింది. ఇందులో 40 వేల సమస్యలు పునరావృతం(రిపీట్) అయినట్లు కనిపిస్తున్నా, మిగిలిన 8.27 లక్షల సమస్యలు వాస్తవికమైనవని అధికారులు తేల్చారు. ఈ సమస్యలను పరిష్కరించాల్సిందే. భూములను తప్పుగా కొలిచారని, తమకు నోటీసులు ఇవ్వకుండానే రీ సర్వే చేశారని, పాసుపుస్తకాల్లో భూమి విస్తీర్ణం తప్పుగా, తక్కువగా నమోదు చేశారని, సరిహద్దులు, భూమిని తప్పుగా చూపించారని.. ఇంకా 18 రకాల సమస్యలను రైతులు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. జగన్ సర్కారు కొత్తగా తీసుకొచ్చిన జాయింట్ ఎల్‌పీఎమ్ అంశాన్ని కూడా రైతులు ప్రధానంగా లేవనెత్తారు. గ్రామాల నుంచి వచ్చిన పిటిషన్లను క్రోడీకరించడానికే అధికారులకు చాలా సమయం పట్టింది. ఇక ఆ సమస్యలను పరిష్కరించడానికి ఇంకెంతకాలం పడుతుందోనన్న ఆందోళన రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

'నెస్లే'లో 16 వేల ఉద్యోగాల కోత!

» భారీ లే ఆఫ్‌లకు సిద్ధమైన దిగ్గజ ఆహార సంస్థ

» రానున్న రెండేళ్లలో తొలగింపునకు ప్రణాళికలు

జ్యూరిచ్, అక్టోబరు 16: ప్రముఖ స్విట్జర్లాండ్ ఆహార దిగ్గజ సంస్థ 'నెస్లే' భారీగా ఉద్యోగాల కోతకు సిద్ధమైంది. రానున్న రెండేళ్లలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 16 వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు కంపెనీ గురువారం ప్రకటించింది. 'ప్రపంచం మారుతోంది.. దానికి తగ్గట్లే నెస్లే కూడా వేగంగా మారాల్సి ఉంది' అని కంపెనీ సీఈవోగా గత నెల బాధ్యతలు చేపట్టిన ఫిలిప్ నవ్రాటిల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది కఠినమైన నిర్ణయమేనని పేర్కొన్న ఆయన.. అయితే ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిందేనన్నారు. పొదుపు లక్ష్యంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపును నిలిపివేసిన కోర్టు

వాషింగ్టన్, అక్టోబరు 16: అమెరికాలో ప్రభుత్వ ఉద్యోగుల తొలగింపుపై ట్రంప్ యంత్రాంగం నిర్ణయాన్ని అక్కడి కోర్టు నిలిపివేసింది. అమెరికా బడ్జెట్‌కు సెనేట్ ఆమోదం తెలపకపోవడంతో రెండు వారాలుగా 'ప్రభుత్వ షట్‌డౌన్' పరిస్థితి కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే 4 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులను తొలగించిన ట్రంప్ యంత్రాంగం.. మరికొందరిని తొలగించేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఉద్యోగుల సంఘం కోర్టును ఆశ్రయించగా.. ప్రభుత్వ నిర్ణయాన్ని నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. కాగా, వివిధ దేశాలపై అడ్డగోలు టారిఫ్‌లు విధించడం సరికాదంటూ అమెరికా సుప్రీంకోర్టుకు చేరిన పిటిషన్‌పై నవంబరు 5న వాదనలు జరగనున్నాయి. వాదనలను వీక్షించడానికి తాను అమెరికా సుప్రీంకోర్టుకు హాజరవుతానని ట్రంప్ వెల్లడించారు.

మేం బీసీలం కాదు..!

» సర్వేకు ఇన్ఫోసిస్ నారాయణమూర్తి దంపతులు దూరం

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి, ఆయన భార్య ఎంపీ సుధామూర్తి కర్ణాటక ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల సర్వేలో పాల్గొనడానికి నిరాకరించారు. బెంగళూరు నగరపాలక సంస్థ(బీబీఎంపీ) అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు.. కొద్దిరోజుల క్రితం ఎన్యూమరేటర్లు నారాయణమూర్తి నివాసానికి వెళ్లారు. వారికి ఆ దంపతులిద్దరూ 'మా ఇంటిలో ఎటువంటి సర్వే అవసరం లేదు' అని స్పష్టం చేశారు. కర్ణాటక వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహిస్తున్న సామాజిక, విద్యా సర్వే 2025లో నిర్దేశించిన స్వీయ ధ్రువీకరణ పత్రంలో ఆమేరకు సంతకం చేశారు. ఆ అధికారిక నమూనా దరఖాస్తులో... 'కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల కర్ణాటక వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహిస్తున్న సర్వేకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వడానికి నిరాకరిస్తున్నాను' అని రాసి ఉంది. దానికితోడు సుధామూర్తి కన్నడంలో 'మేం ఏ బీసీ కులానికీ చెందము. కాబట్టి బీసీ కులాల కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలో మేం పాల్గొనం' అని రాశారని తెలిసింది. అయితే దీనిని నిర్ధారించుకోవడానికి సుధామూర్తి, ఆమె వ్యక్తిగత సహాయకులు, ఇన్ఫోసిస్ అధికారులకు ఫోన్ చేయగా వారు స్పందించలేదు.

బీజేపీ ఉపముఖ్యమంత్రి పోస్టు ఆఫర్ చేసింది

» వద్దంటే జైలుకు పంపుతామన్నారు: డీకే శివకుమార్

బెంగళూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లక్రితం కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, బీజేపీ సీనియర్ నేత ఒకరు తనకు ఉపముఖ్యమంత్రి ఆఫర్ ఇచ్చారని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. దీనికి అంగీకరించకపోతే జైలుకు పంపుతామని బెదిరించారని, తాను పదవికి ఆశపడకుండా జైలుకే వెళ్లానని అన్నారు. స్థానిక ఎఫ్‌కేసీసీఐ ఆడిటోరియంలో కేఎం రఘు రచించిన 'ఏ సింబల్ ఆఫ్ లాయల్టీ.. డీకే శివకుమార్' అనే పుస్తకాన్ని బుధవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్‌కు విధేయుడనని పేర్కొన్నారు. ఒకవేళ ఆనాడు తాను ఉప ముఖ్యమంత్రి పదవికి ఆశపడి ఉంటే రాష్ట్ర రాజకీయ చిత్రమే సంపూర్ణంగా మారిపోయి ఉండేదన్నారు.

వైమానిక దళ ర్యాంకుల్లో భారత్ సత్తా

» చైనాను అధిగమించి మూడో స్థానంలోకి

» నాలుగో స్థానానికి పరిమితమైన డ్రాగన్ దేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 16: వైమానిక దళం ర్యాంకుల్లో చైనాను భారత్ అధిగమించింది. ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన దేశంగా అవతరించింది. సుదీర్ఘ కాలం నుంచి ఆసియాలో ప్రధాన వైమానిక శక్తిగా పేరొందిన చైనా ఇప్పుడు నాలుగో స్థానానికి పరిమితమైంది. ఈ జాబితాలో అమెరికా టాప్‌లో ఉండగా రెండో స్థానంలో రష్యా నిలిచింది. 103 దేశాలకు చెందిన 120 రకాల వైమానిక సేవలకు సంబంధించిన ర్యాంకులను వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడ్రన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ (డబ్ల్యూడీఎంఎంఏ) తాజాగా విడుదల చేసింది. దీని ప్రకారం 242.9 ట్రూ వాల్ రేటింగ్ (టీవీఆర్)తో అమెరికా వాయుసేన మొదటి స్థానంలో ఉంది. రష్యా (114.24) రెండో స్థానంలో నిలవగా భారత్ (69.4), చైనా (63.8), జపాన్ (58.1), ఇజ్రాయెల్ (56.3), ఫ్రాన్స్ (55.3) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. 46.3 రేటింగ్‌తో పాకిస్థాన్ 18వ స్థానానికి పరిమితమైంది.

డిజిటల్ అరెస్ట్ పేరుతో రూ.58 కోట్ల దోపిడీ

» ముంబై వ్యాపారవేత్త నుంచి దోచేసిన సైబర్ నేరగాళ్లు

ముంబై, అక్టోబరు 16: డిజిటల్ అరెస్ట్ మోసాలు పెరుగుతూనే ఉన్నాయి. తాజాగా డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ మోసగాళ్లు ముంబైకి చెందిన ఓ వ్యాపారవేత్త (72) నుంచి ఏకంగా రూ.58 కోట్లు దోచేసిన ఘటన వెలుగు చూసింది. ఈడీ, సీబీఐ అధికారులమని చెప్పి వాట్సాప్ వీడియో కాల్స్ చేసిన ఆ మోసగాళ్లు.. నకిలీ పత్రాలు చూపి మనీలాండరింగ్ విచారణ పేరుతో భయపెట్టి వ్యాపారవేత్త దంపతులిద్దరినీ డిజిటల్ అరెస్ట్‌లో ఉంచారు. మనీలాండరింగ్ కేసు నుంచి బయటపడటానికిగాను డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో ఆ వ్యాపారి ఆగస్టు నుంచి రెండు నెలల వ్యవధిలో మోసగాళ్లు చెప్పిన పలు బ్యాంకు ఖాతాలకు రూ.58.13 కోట్లు బదిలీ చేశారు. అయితే ఆ తర్వాత తాను మోసపోయినట్టుగా తెలుసుకున్న ఆ వ్యాపారి పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో అబ్దుల్ ఖుల్లి (47), అర్జున్ కద్వసార (55), అతని సోదరుడు జేఠారామ్ కద్వసార (35)లను పోలీసులు అరెస్ట్ చేశారు.

విమాన ప్రమాదంపై విచారణ జరిపించాలి

» సుప్రీంకోర్టులో పైలట్ తండ్రి పిటిషన్

న్యూఢిల్లీ, అక్టోబరు 16: అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ దుర్ఘటనలో మరణించిన పైలట్ కెప్టెన్ సుమీత్ సభర్వాల్ తండ్రి 91 ఏళ్ల పుష్కరాజ్ సభర్వాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జూన్ 12న ఎయిర్ ఇండియా ఏఐ171 విమానం కూలడంతో 260 మంది మరణించిన దుర్ఘటనపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ కూడా పిటిషన్ దాఖలు చేసింది. ఇప్పటికే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డు (ఏఏఐబీ) దర్యాప్తు చేసి, ఇచ్చిన ప్రాథమిక నివేదికలో లోపాలు ఉన్నాయని తెలిపారు. ఆ ప్రమాదంలో మరణించిన పైలట్ సుమీత్ సభర్వాల్, కో-పైలట్ క్లైవ్ కుందర్‌లదే తప్పు అన్నట్టుగా నివేదిక ఉందని, అందువల్ల నిష్పక్షపాతంగా దర్యాప్తు జరపించాలని కోరారు.

గుజరాత్ మంత్రుల సామూహిక రాజీనామా

» నేడు కొత్త మంత్రివర్గ ప్రమాణ స్వీకారం

అహ్మదాబాద్, అక్టోబరు 16: గుజరాత్‌లో గురువారం అనూహ్య రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. సీఎం భూపేంద్ర పటేల్ మినహా మొత్తం 16 మంది మంత్రులు రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో కూర్పు సజావుగా సాగేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నూతన మంత్రివర్గం ఏర్పాటు కానుంది. ప్రస్తుతం మంత్రివర్గంలో 16 మంది ఉండగా, ఆ సంఖ్యను 26కు పెంచే అవకాశం ఉంది.

రష్యా చమురుపై

మళ్లీ మంటలు!



కొనుగోళ్లు ఆపేస్తామని మోదీ హామీ ఇచ్చారు

» ఉక్రెయిన్ యుద్ధం ముగింపు వైపు ఇదొక గొప్ప ముందడుగు: ట్రంప్

» ట్రంప్ వ్యాఖ్యలను తప్పుబట్టిన భారత్

» ఆయనతో మోదీ మాట్లాడలేదని ప్రకటన

వాషింగ్టన్/న్యూఢిల్లీ, అక్టోబరు 16: రష్యా చమురు కొనుగోళ్ల అంశం మరోసారి మంటలు రేపుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేస్తానని మోదీ తనకు హామీ ఇచ్చారంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొనగా.. మోదీ ట్రంప్‌కు భయపడి, చెప్పినట్టు వింటున్నారని ప్రతిపక్ష కాంగ్రెస్ విరుచుకుపడింది. మరోవైపు అసలు బుధవారం ట్రంప్, మోదీ మాట్లాడుకోనే లేదని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. చమురు కొనుగోళ్ల విషయంలో భారత్ తన జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేసింది.

మోదీ నా స్నేహితుడు: ట్రంప్

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఆపేస్తామని భారత ప్రధాని మోదీ తనకు హామీ ఇచ్చారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని ఆపేదిశగా ఇదొక గొప్ప ముందడుగు అని వ్యాఖ్యానించారు. బుధవారం (అమెరికా కాలమానం ప్రకారం) ఆయన అధ్యక్ష కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. "మోదీ నా స్నేహితుడు. మా మధ్య గొప్ప బంధం ఉంది. కానీ రష్యా నుంచి భారత్ చమురుకొనుగోలు చేయడం ఏమీ బాగోలేదు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధాన్ని కొనసాగించడానికి అది తోడ్పడుతోంది. అయితే రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేస్తామని మోదీ నాకు హామీ ఇచ్చారు. ఇప్పటికిప్పుడు చమురు కొనుగోళ్లను ఆపేయలేరు. దానికి కొంత సమయం పడుతుంది. ఆ ప్రక్రియ ఇప్పుడు మొదలైంది" అని ట్రంప్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధం ఆపాక రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేసుకోవచ్చన్నారు. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అని, ఆయనకు తానంటే చాలా ఇష్టమని పేర్కొన్నారు. మోదీ రాజకీయ భవిష్యత్తును దెబ్బతీయాలని తాను కోరుకోవడం లేదని పేర్కొన్నారు. భారత్‌కు ఒకప్పుడు తరచూ నేతలు మారిపోయేవారని.. కానీ మోదీ సుదీర్ఘకాలం కొనసాగుతున్నారని చెప్పారు.

మా ప్రయోజనాలకు అనుగుణంగా చమురు కొనుగోళ్లు: భారత్

రష్యా చమురు కొనుగోలు నిలిపివేస్తామని మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ తప్పుబట్టింది. బుధవారం మోదీ, ట్రంప్ మాట్లాడుకోనే లేదని స్పష్టం చేసింది. భారత్ చమురు కోసం దిగుమతులపైనే ఆధారపడి ఉందని.. అలాంటప్పుడు జాతీయ ప్రయోజనాలు, మార్కెట్ స్థితిగతులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విభిన్న మార్గాల్లో చమురు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. అమెరికా నుంచి చమురు కొనుగోళ్లు పెంచేందుకూ చర్యలు చేపడుతున్నామని, దానిపై చర్చలు కూడా జరుగుతున్నాయని తెలిపారు. కాగా, భారత్-రష్యా మధ్య వాణిజ్య బంధం మరింత బలోపేతం అవుతోందని, భారత జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగానే చమురు కొనుగోలు చేస్తోందని భారత్‌లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ పేర్కొన్నారు. మరోవైపు రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేస్తున్న భారత్.. తమకు కొంత మేర చైనా కరెన్సీ యువాన్లలో చెల్లింపు చేస్తోందని రష్యా ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ తెలిపారు. ఇది స్వల్పమేనని, చాలా వరకు నేరుగా రష్యా కరెన్సీలోనే చెల్లింపులు జరుగుతున్నాయని వివరించారు.

ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారు: రాహుల్

రష్యా కొనుగోళ్లు ఆపేస్తామని మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో.. ప్రధాని మోదీపై కాంగ్రెస్ విరుచుకుపడింది. భారత విదేశాంగ విధానం పూర్తిగా కుప్పకూలిపోయిందని ఆరోపించింది. కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ట్రంప్‌కు ప్రధాని మోదీ భయపడుతున్నారని, అమెరికా చెప్పినట్టుగా నడుచుకుంటున్నట్టు కనిపిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యానించారు. "ట్రంప్ తరచూ భారత్ పరువు తీస్తుంటే.. మోదీ మాత్రం ప్రశంసలు కురిపిస్తూ సందేశాలు పెడతారు. అమెరికాలో భారత ఆర్థిక మంత్రి పర్యటనను రద్దు చేశారు. గాజా శాంతి ఒప్పందానికి వెళ్లలేదు. భారత్-పాక్ యుద్ధం తానే ఆపానని ట్రంప్ ఎన్నిసార్లు చెబుతున్నా.. మోదీ నేరుగా ఖండించడం లేదు.." అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. టారిఫ్‌లు వేస్తానని బెదిరించి భారత్-పాక్ యుద్ధాన్ని ఆపానని ట్రంప్ చెబుతూ ఉంటే.. ప్రధాని 56 అంగుళాల ఛాతీ ఏమైపోయిందని సీనియర్ నేత జైరాం రమేష్ ప్రశ్నించారు.

ఎస్ఐఆర్.. అత్యంత కచ్చితం

» దురుద్దేశంతోనే పార్టీలు, ఎన్జీవోలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయ్.. సుప్రీంకోర్టులో ఈసీ వాదనలు

న్యూఢిల్లీ, అక్టోబరు 16: బిహార్‌లో చేపట్టిన ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) అత్యంత కచ్చితంగా జరిగిందని ఎన్నికల సంఘం (ఈసీ) సుప్రీంకోర్టుకు తెలిపింది. ఆ ప్రక్రియను అప్రతిష్ఠపాలు చేయాలనే దురుద్దేశంతోనే కొన్ని రాజకీయపార్టీలు, స్వచ్ఛంద సంస్థలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని పేర్కొంది. ఓటర్ల తుది జాబితాను ప్రకటించిన తర్వాత.. తొలగింపునకు గురైన పేర్లను సవాల్ చేస్తూ ఒక్క ఓటరు కూడా ఇప్పటి వరకూ అప్పీల్ దాఖలు చేయలేదని వెల్లడించింది. ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్ల మీద విచారణను సుప్రీంకోర్టు గురువారం కొనసాగించింది. ఈ సందర్భంగా ఈసీ ధర్మాసనానికి అఫిడవిట్ సమర్పించింది. ఎస్ఐఆర్ నిర్వహణకు 90 వేల మందికి పైగా బూత్ స్థాయి అధికారులను నియమించామని, ఒక్కో ఇంటిని ఒకటికన్నా ఎక్కువసార్లు సిబ్బంది సందర్శించి వివరాలు సేకరించారని ఆ అఫిడవిట్‌లో ఈసీ పేర్కొంది. తుది జాబితాలో 3.66 లక్షల పేర్లు తొలగించామని, అయినప్పటికీ, ఒక్క ఓటరు కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదని, కాబట్టి, మొత్తం ప్రక్రియ అత్యంత కచ్చితంగా జరిగినట్లు భావించవచ్చని తెలిపింది. తొలగించిన పేర్లలో 34% ముస్లింలవేనని అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్, యోగేంద్రయాదవ్ (ఈ కేసులో పిటిషనర్లు) చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని పేర్కొంది. బిహార్‌లో ఎన్నికల నేపథ్యంలో రాజకీయపార్టీల ప్రతినిధులు విచారణకు హాజరు కాకపోవటాన్ని ప్రస్తావిస్తూ.. ధర్మాసనం తదుపరి విచారణను నవంబరు 4వ తేదీకి వాయిదా వేసింది. కాగా, ముఖంపై కొంగు కప్పుకున్న, బుర్ఖా ధరించిన మహిళా ఓటర్ల గుర్తింపును పోలింగ్‌బూత్‌లలో తనిఖీ చేయాల్సిందేనన్న తన ఆదేశాలను ఈసీ సమర్థించుకుంది. ఈ ఆదేశాలపై కొన్ని రాజకీయపార్టీలు అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈసీ గురువారం స్పందించింది.

లోకం తీరు



చాట్‌జీపీటీలో శృంగార కంటెంట్


డిసెంబరు నుంచి ..

18 ఏళ్లు నిండినవారికి అందుబాటులోకి

వాషింగ్టన్, అక్టోబరు 16: నీలి చిత్రాలు, అశ్లీల చిత్రాలు చూడ్డానికి ప్రస్తుతం ప్రత్యేక వెబ్‌సైట్లు ఉన్నాయి! త్వరలో 'ఆ' తరహా కంటెంట్ చాట్‌జీపీటీ ద్వారా కూడా అందుబాటులోకి రానుంది!! అంటే.. యూజర్లు ఇచ్చిన ప్రాంప్ట్‌ల ఆధారంగా చాట్‌జీపీటీ అశ్లీల కంటెంట్‌ను అందిస్తుందన్నమాట!! 18 ఏళ్లు నిండినవారికి.. కథలు, యానిమేషన్ చిత్రాలు, వీడియోలు.. ఇలా ఏ రూపంలో కావాలంటే ఆ రూపం లో ఎరోటిక్ కంటెంట్‌ను అందిస్తామని చాట్‌జీపీటీని తయారుచేసిన 'ఓపెన్ ఏఐ' చీఫ్ శామ్‌ఆల్ట్‌మన్ స్వయంగా ప్రకటించారు. "'అడల్ట్‌ను (18 ఏళ్లు నిండినావరిని) అడల్ట్‌లాగానే చూస్తాం' అనేది తమ సిద్ధాంతమని, అందులో భాగంగానే డిసెంబరు నుంచి 'పెద్దలకు' ఎరోటిక్ (శృంగారపరమైన) కంటెంట్‌ను అందిస్తాం" అని ఆయన గొప్పగా చెప్పుకొన్నారు. అయితే, చాట్‌జీపీటీలో వచ్చే ఆ తరహా కంటెంట్‌లో అసలైన వ్యక్తులెవరూ ఉండరు. అంతా ఏఐ జనితమే! కృత్రిమ శృంగారమే!! కాగా.. టెస్లా చీఫ్ ఈలన్ మస్క్‌కు చెందిన 'ఎక్స్ ఏఐ' అభివృద్ధి చేసిన గ్రోక్ చాట్‌బాట్‌లో త్రీడీ యానిమేటెడ్ కంపానియన్స్ ద్వారా ఈ తరహా కంటెంట్ వినియోగదారులకు అందుబాటులో ఉంది. సదరు చాట్‌బాట్ గర్ల్‌ఫ్రెండ్స్.. వినియోగదారులతో శృంగార సంభాషణలు చేస్తుంటాయి. గ్రోక్ ఇమాజిన్ అనే టూల్ ద్వారా చిన్న చిన్న వీడియోలు కూడా తయారుచేయొచ్చు. నిజానికి.. శృంగారపరమైన కంటెంట్‌కు ఓపెన్‌ఏఐ మొదట్నుంచీ కావాలనే దూరంగా ఉంది. కానీ, గ్రోక్‌తో పోటీలో వెనకబడిపోతున్నందునే ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకుందని పలువురు విమర్శిస్తున్నారు.

2 రోజుల్లో 258 మంది నక్సల్స్ లొంగిపోయారు

» మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి: అమిత్ షా



న్యూఢిల్లీ, అక్టోబరు 16: గడచిన రెండు రోజుల్లో 258 మంది మావోయిస్టులు లొంగిపోయారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో గురువారం 170 మంది, అంతకు ముందు రోజు 27 మంది, మహారాష్ట్రలో 61 మంది మావోయిస్టులు ఆయుధాలు అప్పగించి లొంగిపోయారని తెలిపారు. నక్సలిజంపై పోరులో ఇది భారీ విజయమన్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు సహా భారీ సంఖ్యలో నక్సలైట్లు లొంగిపోతున్న నేపథ్యంలో షా ఎక్స్‌లో పోస్ట్ పెట్టి తాజా పరిస్థితులను వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్, ఉత్తర బస్తర్ ప్రాంతాలు మావోయిస్టుల నుంచి విముక్తి పొందాయని ప్రకటించేందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం మావోయిస్టుల ప్రభావం దక్షిణ బస్తర్‌కు మాత్రమే పరిమితమైందని, వారిని భద్రతా బలగాలు త్వరలోనే తుదముట్టిస్తాయని చెప్పారు. మోదీ ప్రభుత్వ విధానం స్పష్టంగా ఉందని, లొంగిపోయే వారికి స్వాగతం పలుకుతామని, అలా కాకుండా ఆయుధాలు వదిలిపెట్టబోమంటే వారిని భద్రతా బలగాలు తుడిచిపెట్టేస్తాయన్నారు.

ముందు మనల్ని మనం కాపాడుకోవాలి: ఆశన్న

» లొంగిపోవాలని ఇతర మావోయిస్టులకు పిలుపు

» 62671 38163 నంబరుకు ఫోన్ చేయవచ్చని సూచన

జగదల్‌పూర్, అక్టోబరు 16: సాయుధ పోరు చేస్తున్న మావోయిస్టులు ముందుగా ఆయుధాలు అప్పగించి ప్రాణాలు కాపాడుకోవాలని ప్రభుత్వానికి లొంగిపోయిన ఆ పార్టీ అగ్రనేత ఆశన్న పిలుపునిచ్చారు. లొంగిపోవాలనుకుంటున్న మావోయిస్టులు తనను సంప్రదించవచ్చంటూ తన ఫోన్ నంబరును వెల్లడించారు. ప్రభుత్వానికి లొంగిపోయేందుకు వెళుతున్న సమయంలో గురువారం జగదల్‌పూర్‌లో మీడియా ప్రతినిధులతో ఆశన్న మాట్లాడారు. "సాయుధ పోరు చేస్తున్న సహచరులారా.. నేను ఈ నిర్ణయం తీసుకోవాల్సి రావడం కొందరికి అభ్యంతరకరంగా ఉంది. అయితే, ఏ పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందో అర్థం చేసుకోవాలని కోరుతున్నాను. మీరు కూడా ఆలోచించాలి. మీ భద్రతపై ఆందోళనగా ఉంది. ముందుగా మనల్ని మనం కాపాడుకోవాలి. ఆ తర్వాత ఏం చేయాలనేది ఆలోచించుకోవచ్చు. అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చు. లొంగిపోవాలనుకునే మావోయిస్టులు నన్ను సంప్రదించేందుకు నా నంబరు ఇస్తున్నా. మీ ఆలోచనలు చెప్పవచ్చు" అని వ్యాఖ్యానించారు. తన ఫోన్ నంబరును 62671 38163గా తెలిపారు.

భారీగా లొంగుబాట్లు!



లొంగిపోవడానికి వస్తున్న మావోయిస్టులు

చర్ల, మంచిర్యాల, చింతూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ దెబ్బకు మావోయిస్టులు భారీ ఎత్తున లొంగుబాట పడుతున్నారు. మొన్న అగ్రనేత మల్లోజుల వేణుగోపాల రావు అలియాస్ అభయ్‌తో పాటు 61 మంది మావోయిస్టులు లొంగిపోగా.. గురువారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ పోలీసుల ఎదుట 50 మంది, బీజాపూర్ జిల్లాలో మరో 140 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో కేంద్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ముఖ్య నాయకుడు తక్కెళ్లపల్లి వాసుదేవ రావు అలియాస్ ఆశన్న కూడా ఉన్నారు. ఆయన వెంట దండకారణ్య కమిటీలో ముఖ్య నాయకులుగా వ్యవహరించిన రాజమల్లు, రనిత కూడా ఉన్నారు. తొలుత, వీరంతా ఉప్పారి ఘాట్ వద్ద సమావేశమయ్యారు. అనంతరం బోట్లపై ఇంద్రావతి నదిని దాటి బీజాపూర్ చేరుకున్నారు. అక్కడి నుంచి వారిని ప్రత్యేక బస్సుల్లో బీజాపూర్ జిల్లా భైరంగఢ్ పోలీస్ క్యాంపునకు తరలించారు. అక్కడి నుంచి జగ్‌దల్‌పూర్‌కు తీసుకెళ్లారు. వీరు తమ వెంట 70 తుపాకులు, పేలుడు సామగ్రిని తీసుకెళ్లారు. కాంకేర్‌లో లొంగిపోయిన 50 మందిని కూడా జగ్‌దల్‌పూర్‌కు తరలించారు. శుక్రవారం ఉదయం ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సమక్షంలో వీరంతా తుపాకులు వీడనున్నారు. ఆశన్న లొంగుబాటును కూడా శుక్రవారమే అధికారికంగా ప్రకటించనున్నారు. కాగా.. మావోయిస్టులు ఇంత పెద్ద మొత్తంలో లొంగిపోవడం ఇదే మొదటిసారి.



ఇంద్రావతి నది దాటి వస్తున్న మావోయిస్టులు

మాడ్ ఏరియా కమిటీ ఖాళీ

కేంద్ర కమిటీ సభ్యుడు ఆశన్నతోపాటు మాడ్ ఏరియా కమిటీ సభ్యులంతా శుక్రవారం లొంగిపోనున్నారు. వీరిలో 10 మందికిపైగా డీవీసీఎం సభ్యులున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టు పార్టీకి మాడ్ ఏరియా చాలా కీలకమైన ప్రాంతం. అక్కడి నుంచే మావోయిస్టులు పార్టీని నడిపించేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలోని మావోయిస్టులంతా పూర్తిగా లొంగిపోయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే అబూజ్‌మడ్ ప్రాంతం ఖాళీ కాగా తాజాగా మాడ్ ప్రాంతమూ ఖాళీ అయినట్లు అవుతోంది. ఒకప్పుడు 16 రాష్ట్రాల్లోని 336 జిల్లాలకు విస్తరించిన మావోయిస్టుల ప్రభావం.. ప్రస్తుతం 3 జిల్లాలకే పరిమితమైంది. పలు రాష్ట్రాల్లో సమాంతర ప్రభుత్వం నడిపిన అన్నలు.. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం, మావోయిస్టు పార్టీలో నెలకొన్న విభేదాలను అంచనా వేయలేకపోయారు. దీంతో, ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ చతికిలపడింది. అడవుల్లో ప్రస్తుతం మావోయిస్టుల సంఖ్య కేవలం 200 వరకు ఉండొచ్చని పోలీసులు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో హిడ్మా, పాపారావు, తిప్పిరి తిరుపతి టార్గెట్‌గా కేంద్ర బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. మావోయిస్టులు అందరూ లొంగిపోవాలని ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ శర్మ ప్రకటన చేశారు. లొంగుబాటు కార్యక్రమానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా రావడం లేదని తెలిపారు.

రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్ కూడా!?


మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీ సభ్యుడు, సింగరేణి కార్మిక సమాఖ్య (సికాస) కార్యదర్శి బండి ప్రకాశ్ అలియాస్ ప్రభాత్ అలియాస్ అశోక్ కూడా హైదరాబాద్‌లో పోలీసు అధికారుల ఎదుట లొంగిపోవడానికి నిర్ణయించుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బండి ప్రకాశ్ మంచిర్యాల జిల్లా మందమర్రివాసి. బండి రామారావు, అమృతమ్మ దంపతుల నలుగురు బిడ్డల్లో రెండో సంతానం. 40 ఏళ్ల కిందట మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై అడవి బాట పట్టారు. మందమర్రి సీపీఐ నేత వీటి అబ్రహం హత్య కేసులో ప్రకాశ్ కీలక పాత్ర పోషించినట్లు చెబుతుంటారు. అప్పట్లో ఆ కేసులో అరెస్టయిన ఆయనను ఆదిలాబాద్ జైలుకు తరలించారు. అక్కడి నుంచే మావోయిస్టు నేతలు నల్ల ఆదిరెడ్డి, ముంజం రత్నయ్య, హుస్సేన్‌తోపాటు బండి ప్రకాశ్ కూడా 1988లో తప్పించుకున్నారు. నల్ల ఆదిరెడ్డి ఆ సమయంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు. కాగా, ఆయనను తప్పించడంలో ప్రకాశ్ కీలక పాత్ర పోషించినట్లు చెబుతారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో చర్చల సందర్భంగా అడవిని వదిలి బయటకు వచ్చిన ప్రకాశ్.. చర్చలు విఫలమైన తర్వాత తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ప్రకాశ్ సికాస కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కోల్‌బెల్ట్ ఏరియాలో సికాస పటిష్ఠానికి ఆయన తనవంతు కృషి చేశారనే పేరుంది. అలాగే, ప్రభాత్ పేరుతో ఆయన ప్రెస్ నోట్లు, కరపత్రాలు విడుదల చేసేవారు. ఆయన లొంగుబాటుతో సికాస బాధ్యతలు చూసేవారు కరువయ్యారనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. కాగా, పోలీసుల రికార్డుల ప్రకారం.. ప్రకాశ్ తలపై రూ.20 లక్షల రివార్డు ఉంది.



చంద్రబాబుపై దాడిలో ఆశన్న కీలకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కీలక మావోయిస్టు దాడుల్లో తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న కీలక పాత్ర పోషించారు. ఆయన స్వస్థలం ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని నర్సింగాపూర్. గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి భిక్షపతిరావు, సరోజన దంపతుల పెద్ద కుమారుడు ఆయన. ఐటీఐ పాలిటెక్నిక్ చదివిన ఆయన.. చిన్నతనంలోనే మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై 1990లో అడవి బాట పట్టాడు. 2010 ప్రాంతంలో సీపీఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీలో చేరారు. దాడుల వ్యూహాలను రూపొందించడంలో, బాంబుల తయారీలో చేయి తిరిగిన ఆశన్న.. ఐపీఎస్ ఉమేష్‌చంద్ర, మాజీ హోం మంత్రి మాధవరెడ్డిపై జరిగిన దాడుల్లో కీలక పాత్ర పోషించారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడిపై 2003 అక్టోబరు 1న అలిపిరిలో జరిగిన దాడిలో కీలక పాత్ర ఆశన్నదే. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దన్ రెడ్డి హత్యకు 2003, 2007లో రెండు సార్లు దాడి చేశారని చెబుతారు. అలాగే, గడ్చిరోలిలో 2019లో జరిగిన ఐఈడీ పేలుడు ఘటనలో 15 మంది మహారాష్ట్ర పోలీసులు చనిపోయిన సంగతి తెలిసిందే. ఆ ఘటనకు కీలక సూత్రధారి ఆశన్న. పార్టీలో అత్యంత ప్రమాదకరమైన మావోయిస్టుల్లో ఆశన్న ఒకరు. మూడు దశాబ్దాలుగా ఆయనను పట్టుకోవడానికి పోలీసులు విఫల యత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆయన లొంగుబాటు మావోయిస్టు పార్టీకి గట్టి దెబ్బే!

శ్రీకాకుళం జిల్లాలో
209 కిలోల గంజాయి స్వాధీనం



శ్రీకాకుళం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో భారీస్థాయిలో గంజాయిని పోలీసుల ఆధ్వర్యంలో ఈగల్ టీమ్ స్వాధీనం చేసుకుంది. ఎస్పీ మహేశ్వరరెడ్డి కథనం మేరకు.. ఉత్తరప్రదేశ్‌లోని ఘజయాబాద్‌కు చెందిన సునీల్, మేరఠ్‌కు చెందిన విశాల్.. ఒడిశా రాష్ట్రంలో 209 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దానిని ప్యాకెట్ల రూపంలో కారులో ఉత్తరప్రదేశ్‌కు రవాణా చేస్తుండగా.. శ్రీకాకుళం జిల్లా పొందూరు-చిలకపాలెం మధ్య పోలీసులకు పట్టుబడ్డారు. వారిద్దరినీ అరెస్టు చేసి.. గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు.

ఆంధ్రా నుంచి చెన్నైకి లారీలో..

- రూ.2 కోట్ల విలువైన గంజాయి పట్టివేత

చెన్నై, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి ఓ లారీలో తీసుకొచ్చిన రూ.2 కోట్ల విలువైన గంజాయిని చెన్నై శివారు ప్రాంతమైన రెడ్‌హిల్స్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం కార్నోడై తనిఖీ కేంద్రం వద్దకు వచ్చిన లారీని పోలీసులు తనిఖీ చేయగా, వెనుకవైపు కిందిభాగంలో కొయ్యలతో ఏర్పాటు చేసిన పెట్టెలాంటి భాగం బయల్పడింది. చిన్నపాటి గదిని తలపించేలా ఉన్న ఆ పెట్టెలో తనిఖీ చేయగా 150 బండిళ్లలో 320 కిలోల గంజాయి బయల్పడింది. దీనిని పోలీసులు స్వాధీనం చేసుకుని, లారీ డ్రైవర్‌ను అరెస్టు చేసిన పోలీసులు లారీ యజమాని కోసం గాలిస్తున్నారు. కాగా ఆ లారీ నెంబరు నకిలీదని పోలీసుల విచారణలో తెలిసింది.

ఉగ్ర లింకులున్న మరో ఇద్దరి అరెస్టు

- యూపీ, మహారాష్ట్రలో అదుపులోకి తీసుకున్న ధర్మవరం పోలీసులు

ధర్మవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తున్న మరో ఇద్దరిని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో వారిని అదుపులోకి తీసుకుని జిల్లాకు తీసుకువచ్చారు. పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థల వాట్సాప్ గ్రూపుల్లో క్రియాశీలకంగా ఉన్న ధర్మవరం పట్టణానికి చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్‌ను ఈ ఏడాది ఆగస్టులో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అతను ఇచ్చిన సమాచారం ఆధారంగా ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, ముదిగుబ్బ సీఐ శివరాముడు ఆధ్వర్యంలో రెండు బృందాలు యూపీ, మహారాష్ట్రకు వెళ్లాయి.



ఆలయ చైర్మన్ బొర్రా గాంధీ, ఈవో శీనానాయక్‌కు ఆభరణాలు అందజేస్తున్న సురాజ్ శాంతకుమార్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు





దుర్గమ్మకు కానుకగా సమర్పించిన మంగళ సూత్రాలు, ముక్కు పుడక, బులాకీ బొట్టు, సూర్యుడు, చంద్రుడు, ఇతర ఆభరణాలు

దుర్గమ్మకు కానుకగా విశేష వజ్రాభరణాలు

531 గ్రాముల ఆభరణాలు అందించిన కీర్తిలాల్ కుటుంబం

విజయవాడ (ఇంద్రకీలాద్రి), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వర్ణ, వజ్రాభరణాల విక్ర య సంస్థ కీర్తిలాల్ జ్యువెల్లర్స్ నిర్వాహకులు వజ్రా లు పొదిగిన 531 గ్రాముల బంగారంతో కూడిన సూర్యుడు, చంద్రుడు, ముక్కు పుడక, బులాకీ, బొట్టు, మంగళ సూత్రాలు, గొలుసు బంగారు ఆభరాణాలను కనకదుర్గ అమ్మవారికి అందజేశారు. తమిళనాడు గవర్నర్ సతీమణి లక్ష్మీ రవి, మాజీ ఎంపీలు గోకరాజు గంగరాజు, కనుమూరి బాపిరాజు, కీర్తిలాల్ కాళిదాస్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ తదితరులు గురువారం రాత్రి ఇంద్రకీలాద్రిపై ఆలయ చైర్మన్ బొర్రా గాంధీ, ఈవో శీనానాయక్‌కు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో సురాజ్ శాంతకుమార్, తల్లిదండ్రులకు, వారి వెంట వచ్చిన వారికి వేద ఆశీస్సులు అందించారు. అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

క్వాంటమ్, గూగుల్ వచ్చిన వేళ..
తెరపైకి 'జగన్ చేపల మార్కెట్'

పులివెందులకు ఫిష్ మార్కెట్‌పై నాటి మాటలతో జగన్ నవ్వులపాలు

- నాడు అభివృద్ధి అంటే మాంసం కొట్లు.. పచ్చళ్ల తయారీ
- మామిడి తాండ్ర, అప్పడాల తయారీ సంస్థలవే పెట్టుబడులు
- సోషల్‌మీడియాలో విపరీతంగా ట్రోల్

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతికి ఐబీఎం క్వాంటమ్ కంప్యూటింగ్‌ను, విశాఖకు అది పెద్ద గూగుల్ డేటా సెంటరును తెచ్చారు. ఏపీ బ్రాండ్‌ను అనతికాలంలోనే పునరుద్ధరించారు. పెట్టుబడుల గమ్యస్థానంగా రాష్ట్రాన్ని మార్చి.. టీసీఎస్, కాగ్నిజెంట్, మిట్టల్ స్టీల్ ప్లాంటును ఏపీకి తెచ్చారు. ఇదం తా ఏడాదిన్నరలోనే సాధించారు. మరి.. ఐదేళ్లు పాలించిన జగన్ పెట్టుబడుల రంగంలో సాధించింది ఏమిటని అడుగుతుంటే వైసీపీ నేతలు ఇబ్బంది పడిపోతున్నారు. జగన్ అధికారంలో ఉండగా జరిగిన అభివృద్ధి అంతా చేపల మార్కెట్లు, మాంసం కొట్లు, పచ్చళ్ల తయారీ, మామిడి తాండ్ర, అప్పడాల తయారీ సంస్థల్లోనే కనిపించేది. పులివెందులలో అట్టహాసంగా ఆనాడు భారీ బహిరంగ సభను జగన్ ఏర్పాటుచేశారు. "పులివెందులకు ఫిష్ మార్కెట్ వస్తుందని ఎప్పుడైనా ఊహించామా?" అంటూ ఆ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్‌మీడియాలో ట్రోల్ అవుతున్నాయి. పులివెందులలో చేపల మార్కెట్‌ను తీసుకురావడమే ఘనమన్నట్టు కన్ను ఆర్పకుండా .. గర్వంగా జగన్ చెప్పుకొనేవారు. పులివెందుల ఉదంతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో .. వైసీపీ ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడిపోయింది.

'కోడి గుడ్డు పెడుతుంది.. పిల్లను పెట్టదు'

జగన్ జమానాలో గుడివాడ అమర్నాథ్ పరిశ్రమల మంత్రిగా పనిచేశారు. పెట్టుబడుల రంగం గురించి ఆయన అసెంబ్లీలోనూ.. పెట్టుబడుల సదస్సుల్లోనూ నాడు 'ఆణిముత్యాల'వంటి మాటలు సెలవిచ్చారు. 'కోడి గుడ్డు పెడుతుంది. పిల్లను పెట్టదుకదా? పిల్లలను పొదిగేందుకు సమయం పడుతుంది" అని తెలిపారు. అప్పడాల తయారీ, మామిడితాండ్ర తయారీ, మసాలా తయారీ పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ఒప్పందాలను చేసుకున్నామంటూ అమర్నాథ్ అసెంబ్లీలో గొప్పగా ప్రకటించిన వీడియోలు సోషల్ మీడియాలో ఇప్పుడు ట్రోల్‌కు గురవుతున్నాయి.

ఇక్కడి కంపెనీలతో అక్కడ ఒప్పందాలు

జగన్ బృందం ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు 2022 మే నెలలో దావోస్ వెళ్లింది. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి జగన్ తీసుకువచ్చిన పెట్టుబడులను చూస్తే, అంతర్జాతీయ స్థాయి పెట్టుబడు లేవీ రాలేదు. దేశీయంగా అదానీ, షిర్డిసాయి వంటి సంస్థలతో పునరుద్పాదక విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుపై అవగాహన ఒప్పందాలను చేసుకుని వెనుదిరిగారు. 2023లో విశాఖలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు జరిగింది. విశాఖ, విజయనగరం జిల్లాల్లో తయారయ్యే మామిడితాండ్ర, అప్పడాలు, మసాలా దినుసుల తయారీ ఒప్పందాలు చేసుకున్నారు. వైసీపీ సోషల్‌మీడియా కార్యకర్తలు సూట్లు, బూట్లు వేసుకుని పారిశ్రామికవేత్తల్లా ఆ సదస్సులో హడావుడి చేయడం మరోసారి ఇప్పుడు తెరపైకి వస్తోంది.

ఇదీ అదానీ కథ!

విశాఖలో డేటా సెంటర్ పెడతామంటూ 2014-19 మధ్య గౌతమ్ అదానీ ప్రతిపాదించగా, అప్పటి సీఎం చంద్రబాబు ఆమోదించారు. సెంటరు కోసం శంకుస్థాపన కూడా జరిగింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. చంద్రబాబు ప్రభుత్వం చేసిన భూ కేటాయింపులు, పరిశ్రమలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేసింది. ఇందులో అదానీ డేటా సెంటర్ కూడా ఒకటి. గంగవరం పోర్టును అదానీ పరం చేస్తున్న తరుణంలో, జగన్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా డేటా సెంటర్ అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. సోలార్ విద్యుత్ కొనుగోళ్ల కోసమే జగన్‌ను అదానీ కలిశారంటూ అప్పట్లో విమర్శలు వచ్చారు. దీనిపై అదానీ స్పందిస్తూ... గంగవరం పోర్టు, విశాఖ డేటా సెంటర్ అంశాలపై జగన్‌తో చర్చించానని ట్వీట్ చేశారు. ఇప్పుడు ఈ ట్వీట్.. వరదలో కొట్టుకుపోతున్నవాడికి గడ్డిపరక చేతికి అందినట్లుగా వైసీపీ చేతికి అందింది. తమ హయాంలోనే అదానీ డేటా సెంటరు వచ్చిందని ప్రచారం మొదలుపెట్టారు. కానీ, నాడు విశాఖలో రెండోసారి అదానీ డేటా సెంటర్‌కు జగన్ టెంకాయి మాత్రమే కొట్టారు. సెంటరు నిర్మాణ పనులేవీ ముందుకెళ్లలేదు.

సత్యసాయి జయంతి ఉత్సవాలకు రాష్ట్రపతికి ఆహ్వానం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును సత్య సాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ఆహ్వానించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతిని గురువారం ఆయన కలిసి, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నవంబరులో జరిగే సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొనాలని విన్నవించారు. వేడుకలకు హాజరవుతానని రాష్ట్రపతి తెలిపారని ట్రస్టు వర్గాలు వెల్లడించాయి.

'సంభావన' పథకానికి టీటీడీ నిధులు

- ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయ శాఖ

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ వేదపండితులకు టీటీడీ ద్వారా సంభావన పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు దేవదాయ శాఖ ఎక్స్ ఆఫీషియో కార్యదర్శి హరిజవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 600 మంది వేదపండితులకు సంభావన కింద ఈ శాఖ నెలకు రూ.3 వేలు అందిస్తుంది. ఇందుకోసం ప్రతినెలా రూ.2.16 కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ నిధులను రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల నుంచి సమకూర్చస్తోంది. ఇది కొంచెం భారం కావడంతో ఈ పథకానికి టీటీడీ నిధులు కేటాయించాలని దేవదాయ శాఖ కమిషనర్ కోరారు. ఈ ప్రతిపాదనను టీటీడీ బోర్డు ఆమోదించింది. దీంతో ఇకనుంచి నిరుద్యోగ వేదపండితులకు సంభావన పథకం కింద ఇచ్చే మొత్తం టీటీడీ ద్వారా అందనుంది. ఈ నిధులను వారికి పంపిణీ చేసే బాధ్యత కమిషనర్‌కు అప్పగించడంతో పాటు ఎప్పటికప్పుడు నివేదికలను టీటీడీ ఈవోకి పంపించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రధాని పర్యటనపైనా వైసీపీ ఫేక్ ప్రచారం!

- దీనిపై కేంద్ర నిఘా వర్గాల ఆరా..?

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని పర్యటనను సైతం వైసీపీ తన ఫేక్ ప్రచారానికి వాడుకుంటోంది. ప్రధాని నరేంద్ర మోదీ కర్నూలు పర్యటన సందర్భంగా తాము ఆయనకు పలు అంశాలపై వినతిపత్రాలు ఇచ్చినట్లు వాటిపై ప్రధాని సానుకూలంగా స్పందించినట్లు వైసీపీ నాయకులు తమ సోషల్ మీడియా యాక్టివిస్టుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఎటువంటి వినతి పత్రం ఇవ్వకుండానే వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని వైసీపీ తరఫున వినతి పత్రం ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటున్నారు. అధికారంలో ఉన్న 5 ఏళ్లలో వైసీపీ ఏనాడూ ప్రధాని పర్యటనకు ప్రొటోకాల్ ప్రకారం ప్రతిపక్ష పార్టీని ఆహ్వానించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ప్రకారం వైసీపీ ప్రజాప్రతినిధులను సైతం ఆహ్వానిస్తుంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన గౌరవాన్ని కూడా వైసీపీ ప్రజా ప్రతినిధులు నిలబెట్టుకోవటం లేదు. ప్రధాని కార్యక్రమాన్ని సైతం వైసీపీ తమ ఫేక్ ప్రచారాలకు వాడుకోవడంపై కేంద్ర నిఘా వర్గాలు ఆరా తీసినట్లు సమాచారం.

బనకచర్ల పీఎఫ్ఆర్‌ను పరిశీలించండి

- కేంద్ర జలసంఘానికి కేఆర్ఎంబీ వినతి

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సమర్పించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను పరిశీలించాలని కేంద్ర జల సంఘాన్ని కృష్ణా నదీ యాజమాన్య సంస్థ (కేఆర్ఎంబీ) కోరింది. పీఎఫ్ఆర్ ప్రతిని గురువారం దానికి పంపింది. వాస్తవానికి.. ఆంధ్రప్రదేశ్ ఈ పీఎఫ్ఆర్‌ను జూన్‌లోనే సమర్పించగా.. జల సంఘం కొన్ని వివరణలు కోరింది. ప్రాజెక్టును గట్టిగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ.. ఇటీవల డీపీఆర్ తయారీకి ఏపీ టెండర్లు పిలవడంపై తాజాగా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కృష్ణా బోర్డు బనకచర్ల పీఎఫ్ఆర్‌ను జలసంఘానికి పంపడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఏపీలో పుడ్డే కాదు... పెట్టుబడులూ స్పైసీనే

- కర్ణాటక మంత్రి వ్యాఖ్యలకు లోకేశ్ కౌంటర్

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడంపై కర్ణాటక ఐటీ మంత్రి చేసిన వ్యాఖ్యలపై ఏపీ ఐటీ మంత్రి లోకేశ్ పరోక్షంగా స్పందించారు. ఎక్స్‌లో ఈమేరకు ఆయన పోస్టు చేశారు. 'చాలా మంది ఆంధ్ర ఫుడ్ స్పైసీగా ఉంటుందని అంటారు. అలాగే ఆంధ్రకు వచ్చే పెట్టుబడులు కూడా అంతే స్పైసీగా ఉంటాయి. ఈ స్పైసీనెస్ కారణంగా కొందరికి అప్పుడే మంటలు పుట్టడం మొదలైంది' అని లోకేశ్ పోస్టు పెట్టారు.

త్వరలో కౌలు రైతులకూ విశిష్ట గుర్తింపు సంఖ్య

అమరావతి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): భూములున్న రైతులకు మాదిరిగానే పంట సాగుదారు హక్కుపత్రం(సీసీఆర్సీ) ఉన్న కౌలు రైతులకూ విశిష్ట గుర్తింపు సంఖ్య(ఐడీ) కేటాయించేందుకు విధివిధానాలు రూపొందిస్తున్నట్లు వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో కేంద్ర, రాష్ట్ర అధికారులతో కౌలు రైతులకు ఐడీ కేటాయింపు విధివిధానాల ఖరారుకు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ.. 'కౌలు రైతులకు ఐడీ కేటాయింపుపై సాంకేతికంగా పరీక్షించిన తర్వాత పూర్తి స్థాయిలో అమలు చేస్తాం. దీని వల్ల కౌలు రైతులు కూడా భూములున్న రైతులతో సమానంగా ప్రభుత్వం ద్వారా అన్ని ప్రయోజనాలనూ పొందగలుగుతారు' అని చెప్పారు. అగ్రిస్టాక్ అధికారి రాజీవ్ చావ్లా, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సలహాదారు సమర్థరామ్, సీసీఎల్ఏ జయలక్ష్మి, వ్యవసాయ, ఉద్యానశాఖ డైరెక్టర్లు మనజీర్ జిలానీ, శ్రీనివాసులు, సాయిల్ సర్వే అధికారులు పాల్గొన్నారు. కాగా వ్యవసాయ విస్తరణాధికారుల సమస్యలపై త్వరలో సమావేశం నిర్వహిస్తామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలానీ హామీ ఇచ్చినట్లు రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘ అధ్యక్షుడు వేణు మాధవరావు తెలిపారు.

ఏఎస్‌వో ఫలితాలు విడుదల

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. 2024లో జారీ చేసిన పోస్టుల భర్తీ ప్రక్రియ తాజాగా ముగిసింది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఇంటర్‌లో క్రమబద్ధీకరణ స్కామ్!?

కాంట్రాక్టు జేఎల్స్ రెగ్యులరైజేషన్ పేరుతో వసూళ్లు

- ఒక్కో జూనియర్ లెక్చరర్ నుంచి రూ.లక్షన్నర
- వసూళ్లలో కీలకంగా ఇద్దరు జూనియర్ లెక్చరర్లు
- వారిలో ఒకరు ఓ మంత్రికి సన్నిహితుడు
- క్రమబద్ధీకరణకు మరో మంత్రి మాటిచ్చారని ప్రచారం
- ఇప్పటికే దాదాపు రూ.20 కోట్లు వసూలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియట్ విద్యలో మరో భారీ స్కామ్‌కు తెరలేచింది. ఎప్పుడో వైసీపీ ప్రభుత్వ హయాంలో మధ్యలోనే ఆగిపోయిన కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ పేరుతో కొందరు అక్రమార్కులు కోట్లలో వసూళ్లకు దిగారు. తమకు ప్రభుత్వంలో పలుకుబడి ఉందని.. ఓ మంత్రి కచ్చితంగా పనిచేయిస్తానని మాటిచ్చారని ప్రచారం చేసుకుంటూ ఒక్కో జూనియర్ లెక్చరర్ నుంచి రూ.1.5 లక్షలు చొప్పున ఇప్పటికే దాదాపు రూ.20 కోట్లు వసూలు చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారం ఇప్పుడు ఇంటర్ విద్యాశాఖలో చర్చనీయాంశంగా మారింది.

ఆ ఇద్దరు జూనియర్ లెక్చరర్లే

శ్రీకాకుళానికి చెందిన ఓ కాంట్రాక్టు జేఎల్, చిత్తూరుకు చెందిన ఓ కాంట్రాక్టు జేఎల్ ఇందులో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వారికి తూర్పుగోదావరి, గుంటూరు, నెల్లూరులో ముగ్గురు జేఎల్స్ సహకరిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై మధ్యలో ఆగిపోయిన కాంట్రాక్టు జేఎల్స్ క్రమబద్ధీకరణ ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉంది. కొంతకాలంగా ఈ ఇద్దరు జేఎల్స్ మాత్రం త్వరలోనే క్రమబద్ధీకరణ జరుగుతుందని ప్రచారం చేస్తూ వస్తున్నారు. దీని గురించి ఓ మంత్రితో మాట్లాడామని, క్రమబద్ధీకరణ చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారని చెబుతున్నారు. క్రమబద్ధీకరణ కావాలంటే ఒక్కొక్కరూ లక్షన్నర ఇవ్వాల్సి ఉంటుందని.. అదికూడా అపాయింట్‌మెంట్ ఆర్డర్ వచ్చాకే ఇవ్వాలని మొదట చెప్పారు. కానీ.. నెల రోజుల నుంచి అడ్వాన్స్‌గానే ఇవ్వాలంటూ వసూళ్ల పర్వానికి తెరలేపారు. రాష్ట్రంలో 3,572 మంది కాంట్రాక్టు జేఎల్స్ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తుండగా.. వారిలో ఇప్పటికే సగం మందికిపైగా ముడుపులు సమర్పించారని తెలిసింది.

కాలేజీల వారీగా సమీకరణ

మొదట కాలేజీల వారీగా ఆ కాలేజీలోని అందరు కాంట్రాక్టు జేఎల్స్ తరఫున ఒకరు వసూలు చేశారు. వాటిని జిల్లా స్థాయిలో ఒక ప్రతినిధికి చేరవేశారు. ఇలా ఇప్పటివరకు వసూలు చేసిన సుమారు రూ.20 కోట్లలో.. ఓ మంత్రికి ఇవ్వాలంటూ.. రూ.10 కోట్లు విజయవాడలో పెట్టినట్లు తెలిసింది. అయితే ఆ నగదును నిజంగా మంత్రికి ఇచ్చారా? లేక మంత్రి పేరుతో మధ్యవర్తులుగా ఉన్న జేఎల్స్ కాజేశారా..? అనేది తేలాలి. శ్రీకాకుళానికి చెందిన జేఎల్ ఓ మంత్రికి అత్యంత సన్నిహితుడు. బంధువు అనే ప్రచారం కూడా ఉంది. దీంతో క్రమబద్ధీకరణ జరిగిపోతుందని నమ్మిన వారు అడిగిన మేరకు ముడుపులు ఇచ్చేశారు.

ఆర్థిక శాఖ వద్దే ఫైలు

గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చింది. ఎన్నికలకు ముందు హడావిడిగా క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభించింది. మిగిలిన శాఖల్లో ఈ ప్రక్రియ ముందుకెళ్లినా ఇంటర్ విద్యలో మాత్రం మధ్యలోనే ఆగిపోయింది. కాంట్రాక్టు జేఎల్స్ క్రమబద్ధీకరణలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు, కాంట్రాక్టు జేఎల్‌గా చేరినప్పుడు అక్కడ మంజూరైన పోస్టు ఉందా?, వయస్సు, విద్యార్హత, ఒకేషనల్ కాంట్రాక్టు జేఎల్స్ ఏ పోస్టుల కింద విధుల్లో చేరారు? ఇలా.. ఐదు కారణాలతో దీన్ని నిలిపివేసిన అప్పటి ప్రభుత్వం న్యాయ సలహా కోరింది. సుమారు 1,600 మంది క్రమబద్ధీకరణకు అర్హులు కారని అప్పట్లో అంచనా వేశారు. వారి క్రమబద్ధీకరణపై న్యాయ సలహా కూడా ప్రతికూలంగానే వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆర్థిక శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న ఆ ఫైలును సీఎం వద్దకు తీసుకెళ్లేలా చేస్తామంటూ ముడుపులు వసూళ్లు చేస్తున్నవారు చెబుతున్నారు.

డబ్బులివ్వకపోతే కష్టమని బ్లాక్‌మెయిల్

మధ్యవర్తుల మాటలపై నమ్మకం లేక కొందరు ముడుపులు ఇవ్వట్లేదు. కొందరు అసలు తాము లంచాల జోలికే రాబోమని తేల్చేశారు. అలాంటి వారు రెగ్యులరైజ్ కారని, డబ్బులిచ్చిన వారు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు పొందుతారని మధ్యవర్తులు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. గత ప్రభుత్వంలో క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రారంభమైనప్పుడు కొందరు కాంట్రాక్టు జేఎల్స్ నుంచి రూ.50వేలు చొప్పున వసూలు చేశారు. ఆ డబ్బు తిరిగి ఇవ్వలేదు. మళ్లీ ఇప్పుడు రూ.లక్షన్నర అంటే తామెక్కడి నుంచి తేవాలని కాంట్రాక్టు జేఎల్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా... అనేక మంది ప్రభుత్వ ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పులు చేసైనా ముడుపులు చెల్లిస్తున్నారు.

ఏపీలో పాలియేటివ్ కేర్ కోర్సు

- హోమీ బాబా ఆస్పత్రిలో సీట్లకు అనుమతి: మంత్రి సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారికి ఉపశమనం కలిగించేలా ప్రత్యేక చికిత్స అందించే పాలియేటివ్ కేర్ విభాగంలో పీజీ కోర్సుకు అనుమతించినట్టు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం తెలిపారు. ఈ చికిత్సకు సంబంధించి పీజీ డిగ్రీ కోర్సును ప్రవేశపెట్టడానికి విశాఖపట్నంలోని హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి ముందుకు రావడంతో చికిత్సా కేంద్రానికి ఆమోదం తెలిపామని చెప్పారు. దీతో రాష్ట్రంలో తొలిసారిగా పాలియేటివ్ కేర్ (ఉపశమన కోర్సు లేదా సహాయక సంరక్షణ కోర్సు) పీజీ కోర్సు ప్రారంభంకానుందని పేర్కొన్నారు. నాలుగు పీజీ సీట్లతో ప్రవేశాలు జరుగుతాయన్నారు. క్యాన్సర్, పక్షవాతం, గుండెజబ్బుల వంటి దీర్ఘకాలిక రోగాలతో బాధపడే రోగులకు తీవ్రమైన నొప్పి నుంచి ఉపశమనం కలిగించే చికిత్స విధానాన్ని పాలియేటివ్ కేర్ అంటారు. దీని ద్వారా తగిన మందులు, మనోధైర్యం కోల్పోకుండా సలహాలు, సూచనలు, ఫిజియోథెరపీ అందిస్తూ.. రోగిని సంరక్షిస్తారు.


మాతృ సంస్థకు శాప్ చీఫ్ ఇంజనీర్ సిద్ధయ్య

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ ఇంజనీర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించిన, 'ఆడుదాం ఆంధ్రా'లో కీలకంగా వ్యవహరించిన ఎం.సిద్ధయ్యను ప్రభుత్వం ఎట్టకేలకు విడుదల చేసింది. కొన్నేళ్లుగా శాప్‌లో కీలకంగా వ్యవహరించిన ఆయనకు ఈ ఏడాది ఆగస్టు 5తోనే డిప్యుటేషన్ గడువు ముగిసింది. అయినా ఆయనను మరో ఏడాది కొనసాగించేందుకు క్రీడాశాఖ అధికారులు సిద్ధమయ్యారు. అయితే దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం రావడంతో ప్రభుత్వం ఆయన డిప్యుటేషన్‌ను నిలిపివేసింది. ఆయనను మాతృ సంస్థకు పంపిస్తున్నట్లు క్రీడా శాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఆర్ అండ్ బీలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హోదాలో ఉన్న ఆయన వైసీపీ ప్రభుత్వ హయాంలో శాప్‌లోకి వచ్చారు. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడలను దగ్గరుండి నిర్వహించారు. ఆ సమయంలో ఆయనపై కూడా కొన్ని ఆరోపణలు వచ్చాయి.

ఉన్నత విద్యను అందరికీ చేరువ చేస్తాం

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ విజయభాస్కర్ రావు

అమరావతి/ఏలూరు అర్బన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్‌గా ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర్ రావు గురువారం మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన ఓపెన్ యూనివర్సిటీ ద్వారా యువతకు ఉపయుక్తమైన కోర్సులు అందుబాటులోకి తెస్తామన్నారు. దూరవిద్య ద్వారా ఉన్నత విద్యను చేరువ చేస్తామని చెప్పారు. విశ్వవిద్యాలయం కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను రెండ్రోజుల్లోగా అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు. విద్యార్థులు నష్టపోకుండా డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకు కొన్ని రోజుల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తామని, నవంబర్ నుంచే విద్యా సంవత్సరం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండలి వైస్ చైర్‌పర్సన్-2 రత్నశీల మణి, కార్యదర్శి బి.తిరుపతిరావు, జాయింట్ సెక్రటరీ కృష్ణమూర్తి, ఓపెన్ యూనివర్సిటీ ఓఎస్డీ వెలగ జోషి పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ విజయభాస్కరరావు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి ఆశలు!

ఈజిప్ట్ షర్మ్ అల్ షేక్‌లో ఎంతో ఆర్భాటంగా జరిగిన శిఖరాగ్ర శాంతి సదస్సుకు భారత ప్రధానమంత్రి ఎందుకు వెళ్ళలేదు? తనతో పాటు, పాకిస్థాన్ ప్రధాని షరీఫ్‌ను కూడా అమెరికా అధ్యక్షుడు ఆహ్వానించడం మోదీకీ నచ్చలేదా? ఇజ్రాయెల్–హమాస్ మధ్య ట్రంప్ బలవంతంగా కుదిర్చిన శాంతి ఒప్పందాన్ని అమెరికా ఆప్తమిత్రదేశాల అధినేతల కంటే ఘనంగా కీర్తించిన నరేంద్రమోదీ ఆ కార్యక్రమానికి వెళ్ళివుంటే భారత్–అమెరికా మధ్య ప్రస్తుతం నెలకొనివున్న వేడి కాస్తంత చల్లారేదని కొందరి భావన. ఒప్పందంలో కీలకపాత్ర పోషించిన టర్కీ, ఖతార్, అమెరికా, ఈజిప్ట్ వినా మిగతా దేశాధినేతలు, రాజులూ యువరాజులదంతా అక్కడ ప్రేక్షకపాత్రే. అయితే, కార్యక్రమానికి అతిథ్యం ఇచ్చిన ఈజిప్ట్ అధ్యక్షుడి ప్రసంగం మినహా, మాట్లాడమంటూ ట్రంప్ స్వయంగా ముందుకు తోసిన ఏకైకవ్యక్తి పాకిస్థాన్ ప్రధాని షరీఫ్. దీంతో ఉబ్బితబ్బిబ్బయిన పాక్ ప్రధాని ఈ వేదికగా మరోమారు తన విశ్వాస ప్రకటన చేశారు. ట్రంప్‌ను మహాద్భుతమైన అరుదైన వ్యక్తిగా కీర్తిస్తూ, ఈ శాంతి ప్రేమికుడిని తాను మళ్ళీ నోబెల్‌కు నామినేట్ చేస్తాననీ, ఇది కేవలం గాజాలో శాంతి సాధించినందుకు కాక, దక్షిణాసియాలోనే లక్షలాదిమంది ప్రాణాలను కాపాడినందుకని చిన్న షరీఫ్ ప్రకటించారు. మే నెలలో భారత్–పాక్ మధ్య ఘర్షణలను నిలువరించి, రెండు అణ్వాయుధ దేశాల మధ్య ఒక మహాయుద్ధం జరగకుండా ట్రంప్ చేశారని ఈ వ్యాఖ్యల అర్థం. ట్రంప్ తనను తెరముందుకు తెచ్చినందుకు కృతజ్ఞతగా ఈ మారు నేరుగా భారత్ పేరు ప్రస్తావించకుండానే ఆయనను కీర్తించి షరీఫ్ మంచి మార్కులు కొట్టేశారు. తాను కోరుకుంటున్నదే షరీఫ్ నోట వినబడుతుందని ట్రంప్‌కూ తెలుసు. అదిమాత్రమే కాక, గాజా శాంతి ఒప్పందం మరుసటి దశల అమలులో పాకిస్థాన్ ప్రముఖ పాత్ర పోషించబోతున్నదన్న సందేశం కూడా ఇందులో ఉన్నదని కొందరి వాదన.

పశ్చిమాసియా పరిస్థితులను ప్రముఖంగా మార్చివేసే ఈ ఘట్టానికి, భారత ప్రధాని దూరంగా ఉండిపోవడం సరికాదని, ఇజ్రాయెల్ నుంచి ఇరాన్ వరకూ, అరబ్ దేశాలన్నింటితోనూ సత్సంబంధాలున్న మనం, అంతటి పెద్ద వేదిక మీద కనిపించివుంటే బాగుండేదన్న అభిప్రాయం కొట్టిపారేయలేనిది. వందిమాగధులంతా ట్రంప్‌కు జేజేలు పలికే ఈ కార్యక్రమానికి వెడితే తానూ ఏమి చేయాల్సివస్తుందో తెలుసు కనుకనే దూతను మాత్రమే పంపి మోదీ సరిపెట్టివుండవచ్చు. ఎట్టకేలకు ఈ శాంతి ఒప్పందం కుదిరినందుకు ప్రపంచమంతా సంతోషిస్తున్నా, కేవలం తొలి అడుగుపడి, ఇంకా అనేక కీలకదశలు దాటాల్సి ఉన్న తరుణంలో అపనమ్మకాలూ లేకపోలేదు. హమాస్ చెరలో ఉండిపోయిన ఇజ్రాయెలీ పౌరులు, ఇజ్రాయెల్ జైళ్ళలో మగ్గుతున్న పాలస్తీనా పౌరుల్లో ఏదోవంతు మంది బయటకు వచ్చిన ఆ దృశ్యాలు ఎంతో ఉపశమనం కలిగించాయి. ఇజ్రాయెల్ సైన్యాలు వెనక్కు తగ్గడం, ఎక్కడెక్కడో తలదాచుకున్న గాజా పౌరులు తిరిగి రావడం వంటి పరిణామాలు బాగున్నాయి. అయితే, ఒప్పందాలూ అవగాహనలను ఉల్లంఘించడం ఇజ్రాయెల్‌కు అలవాటే కనుక, అమెరికా అధ్యక్షుడు హితవుపలికినట్టు శాంతిని కడవరకూ కాపాడాల్సిన బాధ్యత ప్రధానంగా ఇజ్రాయెల్‌పైనే ఉంది. రెండేళ్ళ యుద్ధంలో పూర్తిగా నేలమట్టమైపోయిన గాజా భవితవ్యం గురించి కానీ, స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటు ఊసు గానీ ఈ ఒప్పందంలో లేవు. హమాస్ చేతుల్లో నుంచి జీవించివున్న బందీలంతా విడుదలైనప్పటికీ, మిగతావారి మృతదేహాల అప్పగింత విషయంలో వివాదం సాగుతూనే ఉంది. నెతన్యాహూ చెబుతున్న లెక్కలకు, హమాస్ అప్పగింతలకు లెక్కసరిపోవడం లేదు. ఇరవై మృతదేహాలను తన దగ్గరే పెట్టుకొని హమాస్ కొత్త నాటకానికి తెరదీసిందని ఇజ్రాయెల్ ఆరోపణ. గాజాలో సామాన్యుల ప్రాణాలు తీస్తూ ఇజ్రాయెల్ ఈ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్న ఘటనలు కూడా వెలుగుచూస్తున్నాయి. నోబెల్ శాంతికోసం అల్లాడిపోతున్న ట్రంప్ మళ్ళీ హమాస్‌ను తప్పుబట్టడం ఆరంభించారు. బందీలంతా క్షేమంగా తిరిగి వచ్చేశారు కనుక, మృతదేహాల పేరిట ఇజ్రాయెల్ తిరిగి కయ్యానికి కాలుదువ్వే ప్రమాదం కనిపిస్తోంది. కట్టుదాటితే ఏ మాత్రం క్షమించేది లేదని ఇజ్రాయెల్‌ను ట్రంప్ ఘాటుగా హెచ్చరించినప్పుడే, ఈ ఒప్పందం నిలుస్తుంది.

తలను వదిలి తోక దగ్గర విన్యాసం!

'వారెక్కడ.. వీరెక్కడ?' శీర్షికతో అక్టోబరు 5న ఆంధ్రజ్యోతిలో దుగ్గరాజు శ్రీనివాసరావు రాసిన వ్యాసంలో– 2024 జనవరిలో విజయవాడలో జరిగిన విప్లవ రచయితల సంఘం 29వ మహాసభలు; తొలితరం కమ్యూనిస్టు నాయకుడు చండ్ర రాజేశ్వరరావులకు సంబంధించి ప్రస్తావనలు చేశారు. ఇంతకుమించి ఆయన వ్యాసంలో ఎంత వెతికినా పరిగణించదగ్గ మూడో అంశం కనిపించలేదు. ఆరెస్సెస్‌తో పాటే వందేళ్ల క్రితం ప్రయాణం మొదలుపెట్టిన కమ్యూనిస్టుల శిబిరంలో ఇప్పుడు నిరాశానిస్పృహలు ఆవరించాయని చెప్పడం ఆయన ఉద్దేశం.

కమ్యూనిస్టు రాజకీయాలు, భావజాల విఫలత గురించి చెబుతూ విరసం 29వ మహాసభల ప్రస్తావన తెచ్చారు. ఆ సభల్లో మా సభ్యుడు సంఘ్ భావజాల వ్యాప్తి పట్ల ఒకింత దిగ్భ్రాంతిని, విప్లవ భావజాల స్థితి పట్ల కొంత నైరాశ్యాన్ని కనపరిచినట్టు ఆయన చెప్పుకొచ్చారు. అయితే, ఇక్కడ దుగ్గరాజు సంవాద మర్యాదను పాటించలేదు. ఒకరి వ్యాఖ్యలను విశ్లేషణకు స్వీకరించినప్పుడు ముందుగా ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉటంకించాలి. అలా కాకుండా మా సభ్యుని మొత్తం ప్రసంగంలో తనకు అనుకూలంగా ఉన్న కొద్ది భాగం తీసుకుని ఈకలు పీకే పని చేశారు.



భిన్నాభిప్రాయాన్ని కమ్యూనిస్టులు సహించబోరనేది దుగ్గరాజు నిరూపించాలనుకున్న మరో అంశం. ఇందుకు కూడా విరసం 29వ మహాసభలనే ఆయన ఎంచుకున్నారు. మా భావజాలానికి భిన్నంగా నర్మద అనే మహిళ సభా వేదికపై మాట్లాడబోతే మేం మైక్ కట్ చేశామట! అయితే, ఆ పేరు కలిగినవారు ఎవరూ వేదిక మీద మాట్లాడలేదు. మరే మహిళా కార్యకర్త కూడా ఆయన చెబుతున్న మాటలు వేదికపై మాట్లాడలేదు. అనారోగ్యంతో చనిపోయిన మావోయిస్టు నాయకురాలు, విప్లవ రచయిత్రి నర్మద పేరిట ఆ సభల్లో మేం పోడియం ఏర్పాటుచేశాం. దుగ్గరాజు వ్యాసం చాలా భాగం ఇలాంటి గందరగోళాలతోనే నిండి ఉంది.

ఒక భావజాల సంస్థ భిన్నాభిప్రాయాలను ఆహ్వానించకుండా మనుగడ సాగించలేదు. నిజానికి, ఆయన ప్రస్తావించిన రెండు రోజుల మహాసభల్లో రాజ్యాంగవాదంపై క్రిటికల్ అవగాహనను మేం అందించాం. అదే సభల్లో మా అవగాహనతో విభేదిస్తూ, అనుకూలిస్తూ పలువురు వేర్వేరు సెషన్లలో స్పందించారు. అందులో కొందరు మహిళా కార్యకర్తలు కూడా ఉన్నారు. వారిలో ఎవరి మైక్‌ను కూడా మేం కట్ చేయలేదు. ఆయన అన్నట్టు రాజ్యాంగబద్ధ పోరాటాల గురించి ఎవరూ వేదికపై మాట్లాడలేదు అనేది అబద్ధం. రాజ్యాంగబద్ధంగా పోరాటాలు నిర్వహిస్తున్న ఆదివాసీలు మొదటిసారి విజయవాడ వచ్చి, వారి ప్రాంతాలలో జరుగుతున్న రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ అతిక్రమణ, ఫారెస్ట్ యాక్ట్ అమలుకాకపోవడం గురించి మాట్లాడారు. రాజ్యాంగవాద చర్చలో భాగంగా వచ్చిన అన్ని అభిప్రాయాలనూ మహాసభల ప్రత్యేక సంచికలో యథాతథంగా ప్రచురించాం.

తొలితరం కమ్యూనిస్టు నాయకులు ఎందరో ఉన్నారు. అయినా, చండ్ర రాజేశ్వరరావు ప్రస్తావననే దుగ్గరాజు ఎందుకు తెచ్చారు? తిరోగమన శక్తుల ఆధిక్యతను రాజేశ్వరరావు అంగీకరించారని చెప్పడానికి ఆయనవి అని చెబుతున్న వాక్యాలను, ఆయన కుమారుడి మాటలను మాత్రమే ఎందుకు తీసుకున్నారు? ఇది అర్థం కావాలంటే తెలుగు సమాజంలో జరిగిన ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమాల చరిత్ర కొంతైనా మనకు తెలియాలి. అప్పుడే దుగ్గరాజు ఉద్దేశం మనకు తెలుస్తుంది. 1940ల్లో చండ్ర రాజేశ్వరరావు నాయకత్వంలో కమ్యూనిస్టు కార్యకర్తలు కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆరెస్సెస్ విస్తరణ ప్రయత్నాలను నిలువరించారు. బెజవాడ వీధుల్లో సంఘ్ తలపెట్టిన సాయుధ ప్రదర్శనను వీరోచితంగా ఎదుర్కొని భగ్నం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఆరెస్సెస్ నిజస్వరూపం అనే పుస్తకం కూడా రాశారు. అలాంటి రాజేశ్వరరావే కమ్యూనిస్టుల విఫలతను, ఆరెస్సెస్ ఆధిక్యతను గుర్తించారని చెప్పడానికి దుగ్గరాజు తన వ్యాసంలో తెగ తాపత్రయపడిపోయారు. చండ్ర రాజేశ్వరరావుకు సంబంధించి ఆయన కుమారుడు ఇచ్చినట్టు చెబుతున్న నోట్‌బుక్ మా దృష్టిలో లేదు. ఈ బుక్‌ను బట్టి చివరి రోజుల్లో రాజేశ్వరరావు అవగాహన అలా ఉందని మాత్రమే తెలుసుకోగలం. ఎన్నేళ్లు గడిచినా తన సైద్ధాంతిక, రాజకీయ ప్రత్యర్థిని ఏమరుపాటున కూడా విరుద్ధ భావజాలశక్తులు మరిచిపోబోవనేది మాత్రం రాజేశ్వరరావు సందర్భంలో సుస్పష్టమైంది. ఆ క్రమంలోనే విప్లవ శిబిరంపైనా, ప్రత్యేకించి విరసంపైనా కుతూహలం కొద్దీ దాడికి దుగ్గరాజు ప్రయత్నించారు. అయితే, కనీసం తన వాదనను కూడా చెప్పుకోలేక కిందా మీద అయి.. చివరకు గందరగోళంగానే తన వ్యాసం ముగించారు.


● **అరసవిల్లి కృష్ణ**, అధ్యక్షుడు
రివేరా, కార్యదర్శి
విప్లవ రచయితల సంఘం

తరాల మార్పుతోనే జాతికి నవోదయం

దేశ రాజకీయాలలో మార్పులు ఎలా సాధ్యమవుతాయి? తరాల మార్పుతోనే జాతి ప్రస్థానంలో మేలు మలుపులు సంభవిస్తాయని అసంఖ్యాకులు సునిశ్చితంగా విశ్వసిస్తున్నారు. మరి అటువంటి మార్పుల ఆగమన సూచనలు ఏమైనా కనిపిస్తున్నాయా? దేశ పాలనా వ్యవహారాలను నిర్దేశిస్తున్న నాయకత్వంలో తరం మార్పును మనం చూడగలమా? 1960వ దశకం తొలి నాళ్లలో దేశ నాయకత్వంలో ఒక కొత్త తరం రానున్నదని చాలా మంది భావించారు. ఆ భావనతోనే 'నెహ్రూ తరువాత ఎవరు?' అనే విషయమై మథనపడ్డారు. దేశానికి కొత్త నాయకత్వం ప్రభవించనున్నదన్న ఆశ, ప్రభవించాలన్న ఆకాంక్షలే ఆ మథనంలో అంతర్లీనంగా ఉన్నాయి. 'కామరాజ్ ప్రణాళిక' (1963) అటువంటి ఆశాభావానికి ఆలంబన అయింది. ఎస్‌కె పాటిల్, అతుల్య ఘోష్, నిజలింగప్ప, నీలం సంజీవరెడ్డి మొదలైన పాత కాంగ్రెస్ యోధుల నిష్క్రమణతో దేశ నాయకత్వంలో తరం మార్పు సంభవిస్తుందనే నిండు నమ్మకం ప్రజల్లో నెలకొన్నది. అయితే ఆ నమ్మకం వమ్ముకావడానికి ఎంతో కాలం పట్టలేదు. 'మరలి వచ్చిన ఎర్ర గులాబీ'గా కీర్తిహారతి నందుకున్న నెహ్రూ తనయ ఇందిరాగాంధీ పార్టీలోనూ ప్రభుత్వంలోనూ తన నాయకత్వాన్ని పటిష్ఠం చేసుకుని అధిష్ఠానవర్గ సంస్కృతిని కొనసాగించారు. ఈ యువ నాయకురాలు దేశానికి కొత్త ప్రజాస్వామిక నాయకత్వ వెలుగులను ఇవ్వలేకపోయారు.

దేశ పాలనా వ్యవహారాలు, ఎన్నికల రాజకీయాలలో ధోరణులను నేను చాలా కాలంగా విశ్లేషిస్తూ వస్తున్నాను. 1964లో జవహర్‌లాల్ నెహ్రూ కీర్తిశేషుడు అయిన నాటి నుంచి ప్రస్తుత దశకం దాకా దేశ నాయకత్వంలో తరాల మార్పుకు మంచి అవకాశాలు మూడుసార్లు తప్పిపోయాయని నా విశ్లేషణల్లో అవగతమయింది. ఐదేళ్ల వ్యవధిలో తరం మార్పు జరగడమనేది అసంభవం. అయితే ఒక దశాబ్ద కాలంలో అటువంటి మార్పుకు కనీసం సూచనలు తప్పక కనిపిస్తాయి. 1967 నుంచి 1987 మధ్య కాలంలో తరం మార్పుకు మొదటి మంచి అవకాశం తప్పిపోయింది. ప్రస్తావిత రెండు దశాబ్దాల కాలంలో కనీసం మూడుసార్లు తరం మారనున్నదనే సూచనలు మెరిశాయి. యువజనులు ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులు మున్నెన్నడూ లేని విధంగా దేశ వ్యవహారాలలో తమ ఉనికిని బలంగా చాటారు. 1967లోనే 29 ఏళ్ల యువకుడు ఒకరు ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ఎటువంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోగా మైనారిటీ మత వర్గానికి చెందిన ఆ యువకుడు మొత్తం మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి ఎమ్‌ఓహెచ్ ఫరూఖ్ (1937–2012) గురించి నేను ప్రస్తావిస్తున్నాను. 1970వ దశకం తొలినాళ్లలో గుజరాత్ విద్యార్థులు ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి వల్ల తమకు జరుగుతున్న అన్యాయాలపై తిరుగుబాటు చేశారు. నవ నిర్మాణ్ సమితిగా సంఘటితమయ్యారు. ఆ విద్యార్థి ఉద్యమం బిహార్‌కు వ్యాపించింది. ఆ రాష్ట్రంలో అది లోక్ నాయక్ జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ విప్లవం ఉద్యమానికి భూమిక అయింది. ఈ ఉద్యమం నుంచి ప్రభవించిన పలువురు యువ నేతలు ఆ తరువాత దేశ ప్రధాన స్రవంతి రాజకీయాలలో అంతర్భాగమయ్యారు. 1977లో జాతీయ స్థాయిలో నాయకత్వం మార్పుకు అవకాశం వచ్చినప్పుడు ఆ యువ నాయకులలో ఏ ఒక్కరికీ అధికార అందలాలు దక్కలేదు. ఎనిమిది దశాబ్దాలకు పైగా వయసున్న ఒక వృద్ధనేత ప్రధానమంత్రి అయ్యారు. అయితే పట్టుమని రెండున్నర సంవత్సరాలు కూడా ఆయన ఆ పదవిలో కొనసాగలేకపోయారు. 1985లో ఈశాన్య భారతదేశంలో ఒక విద్యార్థి నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అదృష్టవశాత్తునో లేదా యాదృచ్ఛికంగానో ఆయనకు ఆ పదవి లభించలేదు. ఒక చరిత్రాత్మక విద్యార్థి ఉద్యమం కారణంగానే ఆ యువ నేతకు ఆ ఉన్నతి లభించింది. ఇదే కాలంలో, ఆ తరువాత ఎంతో మంది యువ నేతలకు స్ఫూర్తిగా వెలుగొందిన ఒక యువ నాయకురాలు దేశంలో ప్రప్రథమంగా అత్యంత చిన్న వయసులో రాష్ట్ర కేబినెట్ మంత్రి అయ్యారు. 25 సంవత్సరాల వయసులోనే మంత్రి అయిన సుష్మాస్వరాజ్ గురించి నేను ప్రస్తావిస్తున్నాను. అప్పట్లో ఆమె పార్టీకి లోక్‌సభలో కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే ఉండేవారు. యువతరాన్ని తమ పార్టీ వైపు ఆకర్షించడంలో ఆ యువ నాయకురాలు విశేషంగా కృషి చేశారు. ఈ సందర్భాలు అన్నీ దేశ నాయకత్వంలో తరం మార్పుకు దోహదం చేసి ఉండాల్సింది. కానీ అలా జరగలేదు. దేశానికి అవసరమైన తరం మార్పుకు మంచి అవకాశాలు వ్యర్థమైపోయాయి. 1992–2004 సంవత్సరాల మధ్య కాలంలో కూడా తరాల మార్పుకు మరో అవకాశం తప్పిపోయింది. కేంద్రంలో అనిశ్చితి నెలకొని వున్న కాలమది. ఆ కాలంలో దీక్షాదక్షతలు ఉన్న ఒక యువ ముఖ్యమంత్రి రెండుసార్లు ప్రధానమంత్రి పదవికి యోగ్యులైన నేతలను ఎంపిక చేయడంలో కీలక పాత్ర వహించారు. అయితే ఆ యువ ముఖ్యమంత్రి జాతీయ స్థాయిలో కీలక స్థానానికి రాలేకపోయారు. అలా జరిగి ఉన్నట్టయితే తరాల మార్పుకు అది ఆరంభమయి ఉండేది. తరాల మార్పునకు దోహదం చేయగల శక్తి సామర్థ్యాలు ఉన్న ఒక వ్యక్తి ఇప్పుడు దేశ పాలనకు సారథ్యం వహిస్తున్నారు. మార్పు కోసం ప్రజలు, స్థానిక సమాజాల నుంచి ఉద్యమం అనేది ఏదీ లేకుండా తరం మార్పుకు ఆస్కారమున్న అరుదైన అవకాశం ఇది. ఆ శక్తిమంతమైన వ్యక్తి సంకల్పాలు, నిర్ణయాలు ఎటువంటి మౌలిక మార్పులకు దారితీస్తాయో పార్లమెంటుకు కొత్త భవన నిర్మాణం, దేశ రాజధాని రూపురేఖల నవీకరణే తిరుగులేని నిదర్శనాలు.

> **చట్టసభలలో 'ప్రాతినిధ్య స్వభావాన్ని' మెరుగుపరిచేందుకు తక్షణమే తగు చర్యలు చేపట్టాలి. తరం మార్పును సాధించే విధంగా ఆ చర్యలు ఉండి తీరాలి. తొలుత శాసనసభలు, పార్లమెంటులో యువజనుల, మహిళల ప్రాతినిధ్యాన్ని మరింతగా పెంపొందించాలి. అవినీతి ఆరోపణల నెదుర్కొంటున్నవారికి ఎన్నికలలో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వకూడదు. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఈ ప్రక్షాళన ప్రక్రియ అమలు కాకపోతే స్వాతంత్ర్య శతాబ్ది నాటికి దేశ రాజకీయ నాయకత్వంలో తరాల మార్పు సంభవించదు.**



దేశ నాయకత్వం తరం మార్పులో ఉందని ఎప్పుడు చెప్పగలుగుతాము? ఈ పరివర్తన ప్రక్రియకు నాలుగు అంశాలు దోహదం చేస్తాయి. అత్యున్నత పదవులలో ఉన్న వారి వయసు, విద్యార్హతలు దేశ పాలనా ప్రాథమ్యాలు, అభివృద్ధి అజెండాను నిర్ణయించడంలో కీలక పాత్ర వహిస్తాయి. అలాగే వారి కుటుంబ నేపథ్యం, జట్టు స్ఫూర్తి అనేవి కూడా తరం మార్పు ప్రక్రియను విశేషంగా ప్రభావితం చేస్తాయి. కొత్తతరం ప్రజాప్రతినిధులు, నాయకులు ఉమ్మడి చైతన్యంతో కలిసికట్టుగా దేశ సమస్యల పరిష్కారానికి కృషి చేయవలసి ఉన్నది.

ఓటుహక్కుకు అర్హత పొందే వయసును 21 నుంచి 18 సంవత్సరాలకు తగ్గించినప్పుడు చట్టసభలలో యువజనులకు మరింత ప్రాతినిధ్యం తప్పక పెరుగుతుందని అందరూ భావించారు. అయితే మూడు దశాబ్దాలు గడిచిపోయి, ఆరు సార్వత్రిక ఎన్నికల అనంతరం కూడా ఆ మెరుగుదల పెద్దగా కనిపించడం లేదు. ప్రజాప్రతినిధుల, మంత్రుల విద్యార్హతల స్థాయి కూడా అసంతృప్తికి తావిచ్చేవిగానే ఉన్నాయి. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల కేబినెట్ మంత్రులలో 15 నుంచి 48 శాతం వారి విద్యార్హతలు ఉన్నత పాఠశాల స్థాయికి మించి లేవు. 'జెన్ జడ్' ఉద్యమం కారణంగా నేపాల్ గత నెలలో ఓటుహక్కు వయసును 18 నుంచి 16 సంవత్సరాలకు తగ్గించింది.

ప్రజాప్రతినిధులు, మంత్రులలో చాలా మంది ఆస్తిపరులు, రాజకీయ కుటుంబ నేపథ్యాల నుంచి వచ్చినవారే కావడం గమనార్హం. డబ్బు, పలుకుబడితోనే వారు పదవులు పొందగలుగుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం పంచాయతీరాజ్ వ్యవస్థల్లో మహిళలకు తప్పనిసరిగా మరింత ప్రాతినిధ్యం కల్పిస్తూ రాజ్యాంగ సవరణ జరిగింది. అయినప్పటికీ చట్టసభలలో మహిళా ప్రాతినిధ్యం ఏమంతగా పెరగనే లేదు. 75 సంవత్సరాల వయసు పైబడినా ప్రజా జీవితం నుంచి స్వచ్ఛందంగా వైదొలుగుతున్న నాయకులు సైతం చాలా అరుదుగా మాత్రమే ఉన్నారు. ఈ సందర్భంగా నానాజీ దేశ్‌ముఖ్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించాలి. మూడు దశాబ్దాల క్రితం ఆయన అన్ని పదవులనూ త్యజించి రాజకీయ జీవితం నుంచి సన్యాస్రాశ్రమంలోకి వెళ్లారు. సాంఘిక సేవా కార్యక్రమాలకే పూర్తిగా అంకితమయ్యారు.

చట్టసభలలో 'ప్రాతినిధ్య స్వభావాన్ని' మెరుగుపరిచేందుకు తక్షణమే తగు చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. తరం మార్పును సాధించే విధంగా ఆ చర్యలు ఉండి తీరాలి. తొలుత శాసనసభలు, పార్లమెంటులో యువజనుల, మహిళల ప్రాతినిధ్యాన్ని మరింతగా పెంపొందించేందుకు సంకల్పించాలి. అవినీతి ఆరోపణల నెదుర్కొంటున్నవారికి ఎన్నికలలో పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వబోమని అన్ని రాజకీయ పార్టీల నాయకులు బహిరంగంగా ప్రకటించి ఆ మాటకు నిబద్ధమై ఉండాలి. మన చట్టసభలలో క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నవారు వందల సంఖ్యలో ఉన్నారన్నది పచ్చి నిజం. కోర్టు కేసుల నెదుర్కొంటున్నవారు ఎన్నికలలో మరోసారి పోటీ చేయకుండా ఆంక్షలు విధించాలి. 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి ఈ ప్రక్షాళన ప్రక్రియ పూర్తిస్థాయిలో అమలు కావాలి. అలా జరగని పక్షంలో స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి దేశ రాజకీయ నాయకత్వంలో తరం మార్పు సంభవించడం జరగదు. అది ఎప్పటికీ సాకారమవ్వని స్వప్నంగానే మిగిలిపోతుంది.

■ **నాగులాపల్లి భాస్కరరావు**
సీఎంఎస్ అధినేత, సామాజిక విధాన పరిశోధకుడు

సర్వనామం



స్థలం మారొచ్చు, కాలం మారొచ్చు
ఆఖరికి మనమంతా మలిగిపోనూ వచ్చు
కానీ, కన్నీటి గమ్యమెప్పుడూ పిడికిలే
ఎందుకంటే
మీరెప్పుడూ సర్వనామమే

ముక్కలేనిదే ముద్ద దిగనివాడూ,
బొజ్జనింపుకుని బ్రేవ్‌మని త్రేన్చేవాడూ
నవ్వు గురించి నాలుగు విధాలా వాపోతాడు

బ్రాండెడ్ బట్టల్లేకపోతే బయటకిరానివాడూ
కారు లేకుండా కాలు కదపనివాడూ
విరామంలోనో, విరాళాలతోనో
విదేశీ పర్యటనలు చేసేవాడూ
ఏసీల్లో పడుకుని వెచ్చని కలలుకనే
ఎర్రవన్నె మేధావులు
గతితర్కం గమకాలు ఆలపిస్తారు

వాళ్లందంతా పస్త్రేషనని తెలియదూ?
ప్రజాకోర్టులో కాసింత ఆత్మసాక్షిని ప్రసాదిద్దాం.

మీరు భౌతికమైనా, మీరిచ్చిన స్ఫూర్తి అభౌతికం
అది అలీనంకాని అడవులకు
కొత్త వసంతాలను స్వాగతిస్తూనే వుంటుంది
మనుగడ వున్నంతవరకూ
మనుషులు ఎదురుపడుతూనే వుంటారు
ఒకరికొకరు సర్వనామాలై.
భూమి గుండ్రంగా వున్నప్పుడు
చరిత్ర బల్లపరుపుగా ఎలా వుంటుంది?

– దేశరాజు

అయిపోయింది

అయిపోయింది మిత్రమా
అడవిని కడిగి
కళ్ళాపు జల్లేశారు...
రండి రండి
ముగ్గేసి పెగ్గేసుకుందాం...
ఎన్ని యుద్ధాలు
ఎన్ని త్యాగాలు
ఎన్ని ఆశలు, ఎన్ని ఆశయాలు
ఎన్ని వ్యూహాలు, ఎన్ని ఆత్మార్పణలు
ఎంత యువత
ఎన్ని వెలిగి మలిగిన దీపాలు...
చిందు వేయటానికి
చీకటి బాగుందనుకునే వారికి
వెన్నెల ఎందుకు? వేకువ ఎందుకు?
చివరికి ఆయుధానికి
అడవి సాగిలపడింది
వెక్కిరిస్తున్న కాగితపు ముల్లెల ముందు
పట్టపగలు
ఆలోచన ఆత్మహత్య చేసుకుంది

– శైలకుమార్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఆధునిక ముసుగుల్లో కులం!



■ యోగేంద్ర యాదవ్

> **సీజేఐ గవాయ్ రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించినా, సామాజిక వ్యవస్థలో ఆయన స్థానం మారలేదని బూటు దాడి ఘటన గుర్తుచేస్తోంది. పూరన్ కుమార్ చివరి లేఖ అతని ఒంటరితనం, అణచివేతల సత్యాన్ని చెబుతోంది. కేవలం ధిక్కారం, భిన్నస్వరం అయినందువల్లనే అతడు ఈ ఒంటరితనం ఎదుర్కొన్నాడా లేక అందులో సామాజిక వెలి కూడా ఉందా? 'కులరహిత అధికారస్వామ్యం ఒక మిథ్య' అని పూరన్ ఆత్మహత్య సంఘటన మరోమారు నిరూపిస్తోంది.**



ఇటీవలి మూడు సంఘటనలు నాకు పాతికేళ్ళ క్రితం విన్న 'గుడ్‌చనా' (పల్లీబెల్లం) కథనాన్ని గుర్తుచేశాయి. నాకు పరిచయం ఉన్న ఒక ఉత్సాహవంతుడైన దళిత విద్యార్థి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణుడై అధికారిగా చేరాడు. అతని వివాహం తర్వాత కొంతకాలానికి అతన్ని నేను కలుసుకున్నాను. అతని భార్య సాపేక్షంగా ఉన్నత కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి. 'ఎస్సీ' ట్యాగ్ వదిలేసి అధికారుల సాధారణ సమాజంలో కలిసిపోవాలని ఆమె ఆసక్తి చూపింది. అతనూ బహుశా అలాగే అనుకొని ఉండవచ్చు. నేను అతని మారిన స్వభావంపై వ్యాఖ్యానించే ముందే, అతను సిగ్గుపడుతూ "అడ్జస్ట్‌మెంట్ చేసుకున్నాను సార్" అన్నాడు. ఈ మాట పైకి సాధారణంగా కనిపించినా – ఇది సర్దుబాటు, అనుసరణ, లొంగిపోవడం వరకు దేనినైనా కవర్ చేస్తుంది.

రెండేళ్ళ తరువాత అతని ఇంటికి మళ్ళీ వెళ్ళాను. డ్రాయింగ్ రూమ్‌లో అంబేడ్కర్ చిత్రపటం చూసి ఆశ్చర్యపోయాను. నా కళ్లలోని ప్రశ్నను గమనించి, నేను అడగకముందే అతను ఆ పల్లీచెక్క కథ చెప్పాడు. వారి మొదటి బిడ్డ నడవడం మొదలుపెట్టిన రోజు అధికారుల కాలనీలోనివారితో అతనూ, అతని భార్యా తమ సంతోషాన్ని పంచుకున్నారు. వారి ఆచారం ప్రకారం ఆ తీపిపదార్థాన్ని పంచారు. సాయంత్రం నడకకు వెళ్లినప్పుడు, ఒకరిద్దరు పొరుగువారు వీరు ఇచ్చిన 'గుడ్‌చనా'ను బయట చెత్తకుప్ప మీద పడేసినట్టు గమనించారు. ఎవరూ ఏమీ అనలేదు, ఏ కుల దూషణా లేదు. అయినా, ఒక్క క్షణంలో ఈ దంపతులకు సామాజిక సత్యం తెలిసిపోయింది. వదిలించుకోవాలనుకున్నా ఆ ట్యాగ్ వారిని వదలదు. కాబట్టి, వారు దాన్ని మళ్ళీ ఆలింగనం చేసుకున్నారు. ఈ ఘటన మూడు విషయాలు స్పష్టం చేస్తున్నది. మొదటిది, కులం మన గతం మాత్రమే కాదు; అది మన ప్రస్తుత జీవిత వాస్తవికత. అంతేకాదు, భవిష్యత్తులో కూడా భాగమయ్యేది. రెండవది, ఇది గ్రామీణ లేదా 'వెనుకబడిన' ప్రాంతాలకు మాత్రమే పరిమితం కాదు; ఆధునిక సమాజంలో కులం కొత్త ముసుగులు ధరిస్తోంది. కుల ఆధారిత వివక్ష, అణచివేత అనేక పొరల్లో చుట్టబడి వస్తున్నది. మూడవది, కులం అంటి పెట్టుకొని ఉంటుంది, దాని ప్రభావాలను తొలగించడం అంత సులభం కాదు. కుల అసమానతలను ఎదుర్కోవడానికి విద్య, ఉద్యోగాలు అవసరమే కానీ, అవి మాత్రమే సరిపోవు.

ఈ మూడు పాఠాలూ ఇటీవలి మూడు ఘటనల తర్వాత నాకు మళ్లీ గుర్తొచ్చాయి. రాయ్‌బరేలీలో హరిఓమ్ వాల్మీకి హత్య, చండీగఢ్‌లో ఐపీఎస్ అధికారి వై. పూరన్ కుమార్ ఆత్మహత్య, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్. గవాయ్ మీద బూటు విసిరే ప్రయత్నం. ఈ మూడూ భిన్నమైన సంఘటనలు, ఈ ముగ్గురు వ్యక్తులూ చాలా భిన్నస్థాయిల్లో ఉన్నవారు... వారందరూ దళితులు అనేది తప్ప. అయితే, బాధితులు దళితులు అనే వాస్తవం ఒక్కటే ఈ మూడు వేర్వేరు ఘట్టాలను 'కుల ఆధారిత అణచివేత' కేటగిరీలోకి తేలేదు. హరిఓమ్‌ను దళితుడు అని కాక, దొంగగా అతడిని అనుమానించిన గుంపునకు సరిగ్గా సమాధానాలు చెప్పలేకపోయాడు కాబట్టి చంపేశారు. గవాయ్ మీద దాడి చేసినవాడు కూడా ఎదుటివారి కులాన్ని ప్రస్తావించలేదు, కానీ హిందూత్వానికి అవమానం అని అన్నాడు. అధికారవర్గం గుసగుసల ప్రకారం, ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ అతను తన ఆత్మహత్య లేఖలో పేర్కొన్న కుల వివక్ష కంటే, వృత్తిగత, అంతర్గత పోటీకి ఎక్కువగా బలైపోయాడు. ఇదీ, ప్రధాన, ప్రాబల్య ఆలోచనాధోరణి మనల్ని నమ్మమని చెబుతున్నది.

ఈ మోసపు పొరను తొలగించాలంటే మనం ఒక కాల్పనిక ప్రశ్న వేయాలి. ఈ వ్యక్తులు దళితులు కాకపోతే వారు అదే గతిని పొందేవారా? తనను దొంగ అని అనుమానించిన గుంపు మధ్యలో హరిఓమ్ నిలబడి, నేను ఠాకూర్‌ని అని అరిచాడనుకుందాం. అవమానం, దెబ్బలనుంచి అతను తప్పించుకోలేకపోవచ్చు కానీ, ఏకంగా చంపేస్తారా? ఎవరూ రక్షించడానికి ముందుకురాని స్థితి ఉంటుందా? అతని శరీరం మరుసటి రోజు పోలీసులు వచ్చేవరకూ రోడ్డుమీద పడివుంటుందా? పోలీసులు అంత ఆలస్యంగా చర్య తీసుకుంటారా? హరిఓమ్‌కు ఈ దుర్గతి పట్టడానికి అతడు ఓ దొంగ అన్న అనుమానం కాదు, అతడు వాల్మీకి కాబట్టి.

చీఫ్ జస్టిస్ గవాయ్ సంఘటనను తీసుకోండి. జడ్జి సామాజిక నేపథ్యం ఏదైనప్పటికీ, ఒక పిచ్చివాడు ఏ కోర్టులోనైనా ఇలాంటి పనిచేయవచ్చునన్నది వాస్తవం. కానీ, మానసికస్థితి సరిగా ఉన్న ఒక లాయర్ సీజేఐ కోర్టులో ఇలా చేస్తాడా? సీజేఐ స్థాయిని తగ్గించే ఇతరత్రా ప్రాతిపదికలేమీ లేకపోతే ఈ ఘటన జరుగుతుందా? సదరు లాయర్ చెబుతున్న 'సనాతనానికి అవమానం' కేవలం మత సంప్రదాయానికి మాత్రమేనా, లేదా కుల హిందూ ఆధిపత్యం ఉపసందేశం కూడా అందులో ఉందా? మరోవిధంగా చెప్పుకోవాలంటే, సదరు న్యాయవాది ఎదుటివ్యక్తి మాటలకు మాత్రమే ప్రతిస్పందించాడా, లేదా ఎవరు అన్న దానిని బట్టి కూడా ప్రతిస్పందించాడా? ఈ 'కులవాద ద్వేషం ఉపరితల ప్రదర్శన' మన కాలంలో సాధారణమైపోయింది.

ఈ సంఘటన డి.వై. చంద్రచూడ్ కోర్టులో జరిగి, దాడి చేసినవాడు ముస్లిం అయితే మొత్తం దేశం ఇప్పటిలాగానే నిశ్శబ్దంగా ఉంటుందా? హోమ్, జాతీయ భద్రతా వ్యవస్థలు ఇలాగే ప్రతిస్పందిస్తాయా? టీవీ చానెల్స్ రోజుల తరబడి దానిపై విందు చేసుకోవూ? దాడి చేసినవాడు వరుస ఇంటర్వ్యూలతో సులువుగా తప్పించుకోగలడా? సోషల్ మీడియాలో అతన్ని సపోర్ట్ చేసే క్యాంపెయిన్లు ఊహించగలమా, ఈ ఘటనలో జరిగినట్టుగా..?. గవాయ్ రాజ్యాంగ వ్యవస్థలో అత్యున్నతస్థానాన్ని ఆక్రమించినా, సామాజిక వ్యవస్థలో ఆయన స్థానం మారలేదని ఈ ఘటన గుర్తుచేస్తోంది. పూరన్ కుమార్ దళితుడు కాకపోతే ఏమవుతుంది? అధికారుల మధ్య పోటీ, తమకు గిట్టని గొంతుకల అణచివేత ఆ వ్యవస్థలో అరుదైనదేమీ కాదు. కానీ కుమార్ చివరి లేఖ అతని ఒంటరితనం, పై అధికారుల వరుస అణచివేతల సత్యాన్ని చెబుతోంది. కేవలం ధిక్కారం, భిన్నస్వరం అయినందువల్లనే అతడు ఈ ఒంటరితనం ఎదుర్కొన్నాడా లేక అందులో సామాజిక వెలి కూడా ఉందా? తన సామాజికవర్గానికే చెందిన అధికారుల నెట్‌వర్క్ చుట్టూ ఉండి వుంటే అతను ఇదే పరిస్థితి ఎదుర్కొనేవాడా? ఈ ఘటనపై విస్తృత ఆందోళన, మీడియా కవరేజ్ జరిగింది. ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్ల నుంచి కాస్తంత ఆలస్యంగానే అయినా మద్దతు కూడా ఉంది. కానీ, ఈ ఘటనలో కులం కోణంపై అంగీకారం, చర్చ లేవు. 'కులరహిత అధికారస్వామ్యం ఒక మిథ్య' అని ఈ సంఘటన మరోమారు నిరూపిస్తోంది. నేను చెప్పిన 'పల్లీ బెల్లం' ఘటన సదరు యువ అధికారి ఇంట్లో బాబాసాహెబ్ చిత్రపటం పునఃస్థాపనకు దారితీసింది. మరి, ఈ మూడు ఘటనలు కులనిర్మూలన కోసం బాబాసాహెబ్ సంకల్పాన్ని తిరిగి అందుకొనేలా చేస్తాయా?

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)





స్ట్రాం వాటర్ డ్రెయిన్ పనులు

నగరంలో మౌలిక సదుపాయాల విస్తరణకు అడుగులు పడుతున్నాయి. ముఖ్యమైన మంచినీటి సరఫరా, స్ట్రాం వాటర్ డ్రెయిన్లు, యూజీడీ కోసం కొత్త మాస్టర్ ప్లాన్లు శరవేగంగా సిద్ధమవుతున్నాయి. పట్టణ మౌలిక సదుపాయాల కల్పన కింద కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లను అందుకునేందుకే ఈ మౌలిక సదుపాయాల డీపీఆర్‌లకు కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది.



యూజీడీ నెట్‌వర్క్ విస్తరణకు శ్రీకారం

నగరంలో భూగర్భ మురుగునీటి పథకం (యూజీడీ) పూర్తిస్థాయిలో లేదు. ఇంకా 30 శాతం మేర ఏర్పాటు చేయాల్సి ఉంది. రెండు దశాబ్దాల కిందట ఏర్పాటుచేసిన ఈ వ్యవస్థ ప్రస్తుత అవసరాలను తట్టుకోవట్లేదు. విస్తరించిన ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని పైపులైన్లను మార్చాల్సి ఉంది. నగరంలో వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పెరిగాయి. కల్యాణ మండపాలు, హాస్టళ్లు, మెస్‌లు కూడా పెరిగాయి. సరైన యూజీడీ లేకపోవటం వల్ల డ్రెయిన్లపై ప్రభావం పడుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని యూజీడీ నెట్‌వర్క్‌ను విస్తరించాలని కార్పొరేషన్ నిర్ణయించింది. త్వరలోనే డీపీఆర్ తయారీకి కన్సల్టెంట్‌ను పిలవనున్నారు.

నగరానికి నగిషీ

మౌలిక సదుపాయాల మాస్టర్ ప్లాన్‌కు కార్పొరేషన్ శ్రీకారం

- మంచినీటి సరఫరా, యూజీడీ, స్ట్రాం వాటర్ డ్రెయిన్ల విస్తరణ
- సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు సిద్ధం
- కొండపైన మంచినీటి రిజర్వాయర్లు, కొండ కింద పైపులైన్లు
- నీరు కలుషితం కాకుండా నూతన పైపులైన్ నెట్‌వర్క్
- వర్షం వచ్చినా ఇబ్బంది లేకుండా స్ట్రాం వాటర్ డ్రెయినేజీ
- నూరుశాతం యూజీడీ నెట్‌వర్క్ దిశగా అడుగులు
- డీపీఆర్‌ల అనంతరం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు

అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద నిధులు రాబట్టే యోచన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎప్పుడో 30 ఏళ్ల కిందట.. నగరవాసుల తక్షణ మౌలిక సదుపాయాలైన మంచినీటి పైపులైన్లు, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు, యూజీడీ పైపులైన్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. మూడు దశాబ్దాలుగా నగరం ఎంతో విస్తరించింది. జనాభా పెరిగింది. ఈ పరిస్థితుల్లో మౌలిక సదుపాయాలను విస్తరించటంతో పాటు నెట్‌వర్క్‌ను బలోపేతం చేసుకోవటం కోసం విజయవాడ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్‌లోకి దిగింది. కొత్త మౌలిక సదుపాయాల మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టింది. నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లను విస్తరించటంపై దృష్టి సారించింది. అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను అందిపుచ్చుకునేందుకు ఈ మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు కమిషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారు. చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్ నేతృత్వంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఈ డీపీఆర్‌లు తయారుచేసే పనిలో పడ్డారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపుతారు.

● కొండ ప్రాంతాలకు, కింద ప్రాంతాలకు వేర్వేరుగా మంచినీటి లైన్లు

ప్రస్తుతం కన్సల్టెన్సీ సంస్థ మంచినీటి సరఫరా నెట్‌వర్క్‌కు సంబంధించిన డీపీఆర్ రూపొందిస్తోంది. 24 గంటలూ నీటిని సరఫరా చేసేందుకు మార్పులకు శ్రీకారం చుట్టారు. కొండ ప్రాంతాలకు, కొండ కింద ఉన్న ప్రాంతాలకు వేర్వేరుగా ఈ లైన్లు ఉంటాయి. కొండ ప్రాంతాల ప్రజలు మోటార్లతో నీటిని లాగటం వల్ల దిగువన ఉన్న ప్రాంతాలకు నీరు సరిపోని పరిస్థితి ఏర్పడుతోంది. అందుకే వేర్వేరుగా లైన్లు వేయాలని యోచిస్తున్నారు. కొండ ప్రాంతాలపై ఓవర్ హెడ్ రిజర్వాయర్లు నిర్మించాలని కార్పొరేషన్ ఇంజనీరింగ్ మిగతా 6లో..

అభివృద్ధికి నిధులు

15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం కేటాయింపు

- మొత్తం రూ.86 కోట్లు విడుదల
- తాగునీరు, పారిశుధ్యం, గాలి కాలుష్య సమస్యలకు చెక్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : విజయవాడ నగరాభివృద్ధికి కేంద్రం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. తాగునీరు, పారిశుధ్యం, వాతావరణంలో గాలి నాణ్యత పెంచే పనులను చేపట్టేందుకు రూ.86 కోట్లు మంజూరు చేసింది. గత అంచనాల్లో కొన్ని మిగులు, తగులు వ్యత్యాసాలను క్రోడీకరించి తాజా నిధులు సమకూర్చింది. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంజనీరింగ్ విభాగం కొన్ని అంచనాలను ప్రభుత్వానికి అందజేసింది. తాగునీరు, పారిశుధ్య పనులకు సంబంధించి రూ.62 కోట్లు, వాతావరణంలో గాలి నాణ్యత పెంచేందుకు రూ.24 కోట్లు కావాలని నివేదిక ఇచ్చింది. ఈ జాబితాలను పరిశీలించిన కేంద్రం ఆ పనులకు అప్పట్లోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్థానిక సంస్థల కోటాలో ఇప్పటికి 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది.

కేటాయింపులు ఇలా..

నగరంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సాలిడ్ వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ పనులకు రూ.31 కోట్లు, పారిశుధ్య నిర్వహణకు రూ.31 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో మిగతా 6లో..

చిన్న వయస్సు.. పెద్దకష్టం..

● 13 ఏళ్ల బాలుడు బలవన్మరణం

- ఏడేళ్ల కిందట విడిపోయిన తల్లిదండ్రులు
- తల్లికి కేన్సర్, చెల్లి దివ్యాంగురాలు
- అంతంతమాత్రంగా ఆర్థిక పరిస్థితి
- మానసికంగా ఒత్తిడితో ఆత్మహత్య



యశ్వంత్ (ఫైల్)

ఊహ తెలియని వయసులోనే తల్లిదండ్రులు విడిపోయారు.. తండ్రి నుంచి దూరమై సరిగ్గా ఏడేళ్లు.. ఆలనాపాలన చూసుకునే తల్లి కేన్సర్‌తో మంచాన పడింది. ఉన్న ఒక్క తోబుట్టువు దివ్యాంగురాలు.. ఇంట్లో అంతా నిశ్శబ్ద వాతావరణం.. ఈ పరిస్థితులన్నీ ఆ బాలుడిని నైరాశ్యంలోకి నెట్టేశాయి. రోజూ పాఠశాలకు వెళ్తున్నా ఎక్కడో వెలితి. ఏం చేయాలో తెలియని వయసు. జీవితాన్ని చాలించాలనుకున్నాడు. ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అజిత్‌సింగ్‌నగర్‌లో గురువారం చోటుచేసుకున్న బాలుడి ఆత్మహత్య ఘటన స్థానికులను కలచివేసింది.

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : అజిత్‌సింగ్‌నగర్‌లోని వడ్డెర కాలనీకి చెందిన రాజ్యలక్ష్మి ఏడేళ్ల కిందట భర్త శ్రీనివాసులుతో విడిపోయింది. యశ్వంత్ (13) ఓ ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. కుమార్తె (11) దివ్యాంగురాలు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. యశ్వంత్ తల్లి కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతోంది. దీంతో యశ్వంత్ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ఆసుపత్రికి తీసుకొచ్చి తీసుకువెళ్లే క్రమంలో పాఠశాలకు సెలవులు పెట్టే పరిస్థితి. ఆర్థికస్థితి అంతంతమాత్రమే. బుధవారం రాత్రి భోజనానంతరం ఇంట్లో ముగ్గురూ నిద్రించారు. తల్లి తెల్లవారుజామున లేచి చూసేసరికి యశ్వంత్ నిద్రిస్తున్న గది తలుపులు గడియ పెట్టి ఉన్నాయి. ఎంత తట్టినా తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా, యశ్వంత్ తలుపు హ్యాండిల్‌కు టవల్‌తో ఉరేసుకుని కనిపించాడు. ఇంటి యజమానిని పిలిచి బలవంతంగా తలుపులు తెరవగా, అప్పటికే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. కుటుంబ పరిస్థితులే బాలుడు మృతికి కారణమై ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. తనకు, తన కూతురికి కొండంత అండగా ఉంటాడనుకున్న కొడుకు మృతిచెందడంతో తల్లి తల్లడిల్లిపోయింది.

సీడ్.. స్పీడ్‌గా..

సీడ్ యాక్సెస్ రోడ్డుకు లైన్‌క్లియర్

- 14 ఎకరాలను ఇచ్చిన 22 మంది రాజధాని రైతులు
- సీఆర్‌డీఏ కమిషనర్‌కు అంగీకారపత్రాల అందజేత
- రెండో దశ పనులకు శ్రీకారం



అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రైతుల సానుకూలతతో సీడ్ యాక్సెస్ రోడ్డుకు లైన్‌క్లియర్ అవుతోంది. ఈ రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టిన సీఆర్‌డీఏకు రాజధాని రైతులు శుభ సంకేతాలు ఇస్తున్నారు. ఉండవల్లిలో సీడ్ యాక్సిస్ రోడ్డు పరిధిలో భూములు కలిగిన 22 మంది రైతులు తమ 14 ఎకరాలను ఇవ్వటానికి అంగీ కారం తెలిపారు. ఈ రోడ్డుకు సంబంధించి ఇప్పటికే 25 వరకు కోర్టు కేసులున్నాయి. దీంతో మొదటి దశలోనే రోడ్డు నిర్మాణం మిగిలిపోయింది.

రెండోదశ విస్తరణలో సానుకూల సంకేతాలు

రెండోదశ విస్తరణ పనుల్లో భాగంగా ఉండవల్లి నుంచి పనులు చేపట్టేందుకు సీఆర్‌డీఏ అధికారులు సన్నాహాలు చేపట్టారు. మంగళగిరిలోని సుందరయ్య కాలనీ మీదుగా ఎలివేటెడ్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తూ ఎన్‌హెచ్-16కు ఈ రోడ్డును అనుసంధానించాల్సి ఉంటుంది. ఈ ఎలివేటెడ్ కారిడార్‌కు కూడా సీఆర్‌డీఏ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇదే సమయంలో సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ఈ-11, 13 రోడ్లను కూడా సమాంతరంగా ఎన్‌హెచ్-16 వరకు విస్తరించటానికి ఇప్పటికే సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. వీటి పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయి. ఈ క్రమంలో సీడ్ యాక్సెస్ రోడ్డును ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ ప్రణాళికలు రూపొందించింది. ఇంతకుముందు మంత్రి నారాయణ పిలుపు మేరకు పలువురు రైతులు సీడ్ యాక్సెస్ రోడ్డుకు భూములిచ్చారు. తమ స్వాధీనంలో ఉన్న భూముల్లో పనులు ప్రారంభించాలన్న ఉద్దేశంతో సీఆర్‌డీఏ అధికారులు ముందడుగు వేశారు. ప్రస్తుతం రెండోదశలో ఎర్త్‌వర్క్ మిగతా 6లో..

మద్యాంతరంగా..

నకిలీ మద్యం ఉదంతంతో ఎక్సైజ్ కొత్త నిబంధనలు

అన్నమయ్య జిల్లా ములకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగులోకి వచ్చిన నకిలీ మద్యం ప్రభావం కొత్త విధానాలను తీసుకొస్తోంది. ఇప్పటికే మద్యం అమ్మకాల్లో పారదర్శకత కోసంప్రభుత్వం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించింది. తాజాగా నో క్రాసింగ్ విధానాన్ని అమలు చేస్తోంది.

- జిల్లాలో ఎక్కడి మద్యం అమ్మకాలు అక్కడే
- మరెక్కడికీ తరలించకూడదని ఆదేశాలు
- వ్యాపారులకు ఎక్సైజ్ శాఖ స్పష్టీకరణ

ఆంధ్రజ్యోతి-విజయవాడ : బార్, మద్యం దుకాణం ఒకే వ్యక్తి చేతిలో ఉన్నప్పుడు ఒకచోట సరుకును మరోచోటకు మార్చుకుంటారు. ఇక నుంచి ఆ విధానానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని అధికారుల నుంచి వ్యాపారులకు ఆదేశాలు అందాయి. దీనికి సంబంధించి అన్ని మద్యం దుకాణాలు, బార్‌లకు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ)ని సిద్ధం చేశారు. అదేవిధంగా ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో 183 బార్‌లకు నోటిఫికేషన్ ఇవ్వగా, 118 బార్‌లను కేటాయించారు. ఇవికాకుండా 261 మద్యం దుకాణాలు ఉన్నాయి. వాటిలో కొంతమంది వ్యాపారులు భాగస్వాములుగా ఏర్పడి సంయుక్తంగా మద్యం దుకాణాలు, బార్‌లను దక్కించుకున్నారు.

ఇప్పటివరకు జరిగింది ఇది..

వ్యాపారులు సిండికేట్లుగా ఏర్పడి మద్యం దుకాణాలను, బార్‌లను దక్కించుకోవడం ఎప్పటినుంచో జరుగుతోంది. జిల్లాను యూనిట్‌గా తీసుకుని వివిధ ప్రాంతాల్లో బార్‌లు, మద్యం దుకాణాలను సిండికేట్‌లో ఉన్న సభ్యులు తీసుకుంటారు. బార్ ఒకరి పేరున ఉంటే, మద్యం దుకాణం మరొకరి పేరున ఉంటుంది. లైసెన్స్ ఒకరి పేరుతో ఉన్నప్పటికీ సిండికేట్‌లో ఉన్నవారంతా వాటికి యజమానులుగా ఉంటారు. బార్, మద్యం షాపులకు అవసరమైన సరుకును డిపోల నుంచి కొంటారు. దీనికయ్యే ఖర్చును భాగస్వాములంతా సమానంగా భరిస్తారు. వచ్చిన లాభాలను పెట్టుబడిని బట్టి పంచుకుంటారు. బార్, మద్యం దుకాణం ఒకే వ్యక్తి పేరుతో ఉన్నప్పుడు రెండింటికీ ఒకరే యజమానిగా ఉంటారు. మద్యం దుకాణంలో సరుకు నిండుకుంటే ఆ బ్రాండ్‌లను బార్ నుంచి రప్పించుకుని విక్రయించుకుంటున్నారు. ఈ సరుకును మొత్తం కొన్న వ్యాపారి ఒకరే కాబట్టి ఒకచోట సరుకును మరోచోటకు తరలించుకుంటారు. తనిఖీల సమయంలో ప్రశ్నించినా ఇదే విషయం చెప్పేవారు.



ఇక అలా కుదరదు

ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం వ్యవహారం వెలుగులోకి రావడంతో ఈవిధంగా ఒకచోట సరుకును మరోచోటకు తరలించడం నిలుపుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ విధానంలోనూ అక్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. వాస్తవానికి 2014-19 వరకు మద్యం సరుకుపై నిఘా, ట్రాకింగ్ ఉండేది. ఇదంతా ఆన్‌లైన్‌లో అధికారులకు తెలిసిపోయేది. మద్యం దుకాణం, బార్‌లో రోజుకు ఎంతెంత అమ్మకాలు జరుగుతున్నాయి, ఏ సమయంలో ఎంతెంత మద్యం అమ్ముతున్నారు.. అనే వివరాలు స్పష్టంగా ఉండేవి. వైసీపీ అధికారంలోకి వచ్చాక నిఘా నిద్దరపోయింది. ట్రాకింగ్‌కు ట్రాక్ లేకుండాపోయింది. అద్దేపల్లి జనార్దనరావు నకిలీ మద్యం తయారీకి పూనుకోవడానికి ఈవిధానం ఒక కారణంగా అధికారులు భావిస్తున్నారు. మద్యం షాపు, బార్ ఒకరి ఆధ్వర్యంలోనే నడుస్తున్నా సరకు మార్పిడికి మాత్రం అనుమతి లేదని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఈవిధంగా జరిగితే సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేయాలని ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

నిమ్మలూరులో బెల్ కంపెనీ ప్రారంభం

వర్చువల్‌గా ఆరంభించిన ప్రధాని మోదీ




మచిలీపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలోని నిమ్మలూరులో నూతనంగా నిర్మించిన బెల్ కంపెనీని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. నిమ్మలూరు గ్రామం వద్ద రూ.362 కోట్లతో బెల్ కంపెనీని గతంలో నిర్మించారు. కర్నూలు జిల్లా నన్నూరు వద్ద గురువారం జరిగిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో పాల్గొన్న మోదీ జిల్లాలోని నిమ్మలూరు బెల్ కంపెనీలో అడ్వాన్స్‌డ్ నైట్‌విజన్ ప్రొడక్ట్ ఫ్యాక్టరీని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో ప్రత్యర్థి దేశం ప్రయోగించిన డ్రోన్‌లను ఇక్కడ తయారుచేసిన పరికరాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయన్నారు. దీంతో మన దేశరక్షణ వ్యవస్థ ఎంత పటిష్టవంతంగా ఉందో ప్రపంచదేశాలకు తెలిసి వచ్చిందని వివరించారు.

ఏఎన్నార్ బార్‌లో ఎక్సైజ్ సోదాలు

విజయవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం గాజుల బజార్‌లో ఉన్న అద్దేపల్లి జనార్దనరావుకు చెందిన ఏఎన్నార్ బార్‌లో ఎక్సైజ్ పోలీసులు గురువారం రాత్రి సోదాలు చేశారు. నకిలీ మద్యం తయారీ వ్యవహారం వెలుగులోకి వచ్చాక ఈ బార్‌ను అధికారులు సీజ్ చేశారు. ఎక్సైజ్ ఈఎస్ టాస్క్‌ఫోర్స్ ఏసీ రామ్‌శివ ఆధ్వర్యంలో ఈ సోదాలు జరిగాయి. బార్‌లో ఉన్న మద్యం సరుకు లెక్కలను పరిశీలించారు. కొన్ని మద్యం సీసాల్లోని సరుకు నమూనాలు సేకరించినట్టు తెలుస్తోంది.

ఏసీబీ వలలో మరో లంచావతారం

కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగిని పట్టుకున్న అధికారులు



ఏసీబీ అధికారుల వద్ద కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగి శ్రీనివాసరావు

వన్‌టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏసీబీ వలకు కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగి చిక్కాడు. వన్‌టౌన్‌లోని ఓ ఎలక్ట్రికల్ వ్యాపారికి చెందిన సరుకు రిలీజ్ చేయటానికి డబ్బు డిమాండ్ చేసి, తీసుకున్న కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగి కొండపల్లి శ్రీనివాసరావును గురువారం రాత్రి ఏసీబీ అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. గవర్నరుపేట కమర్షియల్ ట్యాక్స్ విభాగంలో కొండపల్లి శ్రీనివాసరావు సబార్డినేట్‌గా పనిచేస్తున్నాడు. అతనితో పాటు మరికొందరు ఉద్యోగులు గురువారం రాత్రి వన్‌టౌన్ జెండాచెట్టు ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్న జోగారావు చౌదరి సరుకును కమర్షియల్ ట్యాక్స్ ఉద్యోగులు ఆపి బిల్లులు మిగతా 6లో..

జీఎస్టీ సంస్కరణలతో సుస్థిర ఆర్థిక ప్రగతి

● సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సులో కలెక్టర్ లక్ష్మీశ 6లో

కంచికచర్ల పంచాయతీలో గోల్‌మాల్

● విచారణకు ఆదేశించిన డీపీవో.. ఇద్దరు ఉద్యోగులకు నోటీసులు



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్











నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో గురువారం జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)



సభలో ఉప్పొంగిన దేశభక్తి



శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ



సభలో టీడీపీ మహిళా నేతలు







పొలాల వెంబడి పరుగులు

దుర్గగుడిలో కార్తీక, మార్గశిర మాసోత్సవాలు

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మల్లేశ్వరస్వామికి అభిషేకాలు, సహస్ర లింగార్చనలు, బిల్వార్చనలు, త్రికాల పూజలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. అలాగే భవానీ దీక్షల స్వీకరణ, విరమణ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఇంద్రకీలాద్రిపై జరిగిన విలేకరుల సమావేశంలో ఈవో వీకే శీనానాయక్, పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులు పాల్గొని ఉత్సవ వివరాలను వెల్లడించారు. ఈనెల 19న ఆదివారం ఉదయం 8 గంటలకు రుద్రహోమం, మహాలక్ష్మీయాగాన్ని నిర్వహిస్తారు. సోమవారం దీపావళి సందర్భంగా అమ్మవారి ప్రధాన ఆలయంలో ధనలక్ష్మీపూజ, దీపాలంకరణ, బాణాసంచా కాల్చటం, సాయంత్రం 7 గంటల నుంచి అమ్మవారి ప్రధాన ఆలయం, ఉపాలయాలను కవాటబంధనం చేసి మూసివేస్తారు. 22 నుంచి నవంబరు 20 వరకు కార్తీకమాసం సందర్భంగా నెలరోజుల పాటు విశేష అభిషేక, అర్చనలు నిర్వహిస్తారు. 21న మంగళవారం ప్రదోషకాలంలో మల్లేశ్వరాలయం, శివకామ సుందరీ సమేత నటరాజస్వామి ఆలయంలో ఆకాశదీపాలను ప్రారంభిస్తారు. మల్లేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం 3.30 నుంచి 7 గంటల వరకు సహస్రలింగార్చన, ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు కారకపారాయణలు, శివ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పంచాక్షరీ, లక్ష్మీగణపతి జపాలు జరుగుతాయి. 23న అమ్మవారికి గాజుల ఉత్సవం, 25న నాగుల చవితి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఉదయం 4 గంటలకు అభిషేకం నిర్వహిస్తారు. నవంబరు 5న కార్తీక పౌర్ణమి సందర్భంగా కోటి దీపోత్సవం, మల్లేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం నిర్వహిస్తారు. నవంబరు 18న మాస శివరాత్రిని పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు మల్లేశ్వరస్వామికి విశేష అన్నాభిషేకం నిర్వహిస్తారు. నవంబరు 21తో కార్తీక మాస ఉత్సవాలను ముగిస్తారు. మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రదోహ హారతుల అనంతరం ప్రత్యేక రోజుల్లో 2,500 మందికి అన్నప్రసాద సంతర్పణ చేస్తారు. ఈ సందర్భంగా 2026 దేవస్థానం క్యాలెండర్‌ను ఈవో, చైర్మన్, పాలకమండలి సభ్యులు ఆవిష్కరించారు. పాలకమండలి ప్రత్యేక ఆహ్వానితుడు వెలగపూడి శంకర్ బాబు, సభ్యులు సుకాసి సరిత, రామకుమార్ పాల్గొన్నారు.

భవానీదీక్షలు

నవంబరు 1 నుంచి 5 వరకు భవానీ మండల దీక్షల స్వీకరణ, 21న అర్ధమండల దీక్షల స్వీకరణ జరుగుతాయి. డిసెంబరు 4న రాత్రి కలశజ్యోతి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. డిసెంబరు 11నుంచి 15వరకు భవానీ దీక్షల విరమణల జరుగుతాయి. డిసెంబరు 11న ఉదయం 6.30 గంటలకు హోమగుండాల్లో అగ్ని ప్రతిష్ఠాపన చేస్తారు. 15న ఉదయం 10గంటలకు మహాపూర్ణాహుతితో దీక్షల విరమణ పూర్తవుతాయి. డిసెంబరు 11నుంచి 15వరకు దేవస్థానంలో జరిగే ప్రత్యక్ష, పరోక్ష ఆర్జిత సేవలు రద్దు చేస్తారు.

సభ్యురాలి భర్త అనధికార ప్రవేశం



దుర్గగుడి పాలకమండలి సమావేశంలో సభ్యురాలి భర్త అనధికారికంగా పాల్గొన్నారు. సభ్యుల మధ్య కూర్చుని ఉండగా పాలకమండలి సభ్యులు కానివారు వెళ్లిపోవాలని సూచించినా అక్కడే ఉన్నాడు. పాలకమండలి సభ్యురాలు పద్మావతి ఠాకూర్ కొన్ని కారణాలతో ప్రమాణస్వీకారం చేయలేకపోయారు. ఆమె భర్త అజయ్‌వర్మ ఠాకూర్ ఈవో, చైర్మన్ విలేకరుల సమావేశంతో పాటు, క్యాలెండర్ ఆవిష్కరణలో సభ్యుల మధ్యలో కూర్చున్నాడు. విషయం తెలుసుకున్న చైర్మన్ బొర్రా గాంధీ సభ్యులు కానివారు వెళ్లిపోవాలని సూచించినా అజయ్ వర్మ పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెతుతున్నాయి. చైర్మన్, ఈవోలను వివరణ కోరగా, అజయ్ వర్మను వెళ్లిపోవాలని సూచించినా వెళ్లలేదన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో సుస్థిర ఆర్థిక ప్రగతి: కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో దేశవ్యాప్తంగా 99శాతం వస్తువులు, సేవలు పన్ను రహితం కావడం లేదా సున్నా శాతం, 5 శాతం, లేదా 18 శాతం జీఎస్టీ పరిధిలోకి వచ్చాయని, ఈ సంస్కరణలు సుస్థిర ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సులో భాగంగా గురువారం రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం, ది కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఆటోలు, సరుకుల రవాణా వంటి వివిధ పనులకు ఉపయోగించే చిన్న వాహనాల ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియా, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్ ప్రశాంత్‌కుమార్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఏ మోహన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఆర్టీఓలు ఆర్ ప్రవీణ్, కే వెంకటేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్లు పై నాగేశ్వరరావు, వీ పద్మాకర్, అలీ, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జీ ప్రియదర్శిని, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్, విజయవాడ టాక్సీ ఓనర్ల అసోసియేషన్ ఎన్ఏఎంటీఏ అసోసియేషన్, టీఎన్‌టీయూసీ అసోసియేషన్ ప్రతినిధులతో పాటు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బాబూ నాయక్ పాల్గొన్నారు.



వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

బాలికలకు బాసటగా నిలుద్దాం

బాలికలకు సమాన అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్య సేవలందించడంతోపాటు అన్ని విధాలా అభివృద్ధి చెందేందుకు సమష్టిగా కృషి చేద్దామని, వారి బంగారు భవితకు బాసటగా నిలుద్దామని కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించగా విజేతలుగా నిలిచిన వారికి గురువారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో కలిసి పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. బాలికలకు శుభాకాంక్షలు తెలియజేసి, బాగా చదువుకొని కెరీర్‌లో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, జిల్లా శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీఈవో యూవీ సుబ్బారావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ రజనీ కుమారి, డాక్టర్ జే ఇందుమతి, డాక్టర్ మాధవి, గైడ్ టీచర్స్, విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తుళ్లూరులో గ్రీవెన్స్

ప్రజా రాజధాని అమరావతిలో రైతులు, రైతు కూలీల సమస్యల పరిష్కారానికి తుళ్లూరులోని సీఆర్‌డీఏ కార్యాలయంలో నేడు శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ఏ భార్గవ్‌తేజ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే గ్రీవెన్స్ డేను రైతులు, అమరావతి ప్రాంతవాసులు వినియోగించుకోవాలని కోరారు.



ఆన్‌లైన్‌లో విద్యార్థుల బ్యాంక్ ఖాతాలకు స్కాలర్‌షిప్ డబ్బులను విడుదల చేస్తున్న లక్ష్మణరావు

రూ. 2.96కోట్లు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

- ఎస్ఏజీటీఈ కార్యదర్శి లక్ష్మణరావు

కానూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యార్థులకు సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎస్ఏజీటీఈ) ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పీ లక్ష్మణరావు చెప్పారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ వర్సిటీలో గురువారం 2025-26 విద్యా సంవత్సరంలో బీటెక్ చదివే 624 మంది విద్యార్థులకు రూ.2.96 కోట్ల స్కాలర్‌షిప్ డబ్బులను లక్ష్మణరావు ఆన్‌లైన్ ద్వారా విద్యార్థుల ఖాతాలకు పంపే ప్రక్రియ అయిన మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డు ప్రదానోత్సవాన్ని ప్రారంభించారు. వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీసీ వెంకటేశ్వరరావు, ప్రో వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం రవిచంద్, విద్యార్థి వ్యవహారాలు, అడ్మిషన్స్ డీన్ డాక్టర్ జీఎన్ స్వామి, ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ బీ నీలాంబం పాల్గొన్నారు.

పండుగలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి, ఛత్ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను వివిధ ప్రాంతాల్లో నడుపుతున్నట్లు పీఆర్వో నుస్రత్ ఎం మండ్రూపకర్ వివరాలను వెల్లడించారు. 07497 తిరుపతి-సికింద్రాబాద్ ఈనెల17న శుక్రవారం బయలుదేరుతుంది. 07498 సికింద్రాబాద్ - తిరుపతి ఈనెల 18న శనివారం నడుస్తుంది. 07213 విజయవాడ - సికింద్రాబాద్ ఈనెల 17, 18 శుక్ర, శనివారాల్లో నడుస్తుంది. 07214 సికింద్రాబాద్ - విజయవాడ ఈనెల 17, 18 శుక్ర, శనివారాలలో నడుస్తుంది. 07165 హైదరాబాద్-కొత్త భువనేశ్వర్ మంగళవారాల్లో బయలుదేరుతుంది, నవంబర్ 4 నుంచి 25 వరకు 4 సర్వీసులు నడుస్తుంది. 07166 కొత్త భువనేశ్వర్-హైదరాబాద్ బుధవారాల్లో నడుస్తుంది. నవంబర్ 5 నుంచి 26 వరకు నాలుగు సర్వీసులు నడుస్తుంది. 01438 ధర్మవరం-షోలాపూర్ ఈనెల 18న శనివారం బయలుదేరుతుంది. 06095 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - సంత్రాగచి శుక్రవారం ఈనెల 17న బయలుదేరుతుంది. 06096 సంత్రాగచి - ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఈనెల 18 శనివారం బయలుదేరుతుంది. 05541 దర్భంగ-యశ్వంత్‌పూర్ సోమవారాల్లో బయలుదేరుతుంది. 20 నుంచి నవంబరు 17 వరకు ఐదు సర్వీసులు నడుస్తుంది. 05542 యశ్వంత్‌పూర్-దర్భంగ గురువారాల్లో నడుస్తుంది. ఈనెల 23 నుంచి నవంబరు 20 వరకు 5 సర్వీసులు నడుస్తుంది.

డివిజన్లో టికెట్ తనిఖీలు.. రూ.1.22 కోట్ల జరిమానా

విజయవాడ రైల్వే డివిజన్‌లో ఈనెల 13, 14, 15న నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ టికెట్ చెకింగ్ డ్రైవ్‌లో అత్యధిక ఆదాయాన్ని నమోదు చేసింది. 17,017 కేసులు నమోదుచేసి రూ.1.22కోట్ల మేరకు జరిమానా వసూలు చేసింది. 13న రూ.37.03 లక్షలు, 14న రూ.40.26 లక్షలు, 15న గరిష్ఠంగా రూ.45.03 లక్షలు జరిమానాగా వసూలు చేశారు. ఇందుకోసం ప్రతిరోజూ 716 మంది టికెట్ చెకింగ్ సిబ్బందిని మోహరించారు. డీఆర్ఎం మోహిత్ సోనాకియా బృందం అత్యుత్తమ పనితీరుకు అభినందనలు తెలిపారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బీ ప్రశాంత కుమార్, ప్రయాణికులు రైల్వే అధికారులతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కంచె చేను మేస్తే..!

- కంచికచర్ల మేజర్ పంచాయతీలో రూ.27 లక్షలు గోల్‌మాల్
- విచారణకు ఆదేశించిన డీపీఓ.. డీఎల్‌పీవో నోటీసులు

ఆంధ్రజ్యోతి, కంచికచర్ల: జిల్లాలోని మేజర్ పంచాయతీల్లో ఒకటైన కంచికచర్ల గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం వెలుగుచూసింది. కంచే చేను మేసిన చందాన ఉద్యోగులే ఈ 'ధన'కార్యానికి ఒడిగట్టినట్టు తెలుస్తోంది. రూ. 27 లక్షల మేర నిధులు దుర్వినియోగమైనట్టు తెలుస్తోంది. అధికారులు రంగంలోకిదిగి బాధ్యులకు నోటీసులివ్వటం కలకలం రేపుతోంది. విచారణ పూర్తయితేగానీ నిధుల విలువెంత అన్నదానిపై స్పష్టత వస్తుంది.



గత ఆర్థిక సంవత్సరంలో వివిధ పద్దుల రూపేణా వసూలుచేసిన సొమ్ము పంచాయతీ ఖజానాకు జమకాలేదు. మొత్తం రూ.27 లక్షలకు పైగా నిధులను ఇద్దరు ఉద్యోగులు దుర్వినియోగం చేసినట్టుగా అధికారులు గుర్తించారు. దీనిపై విచారణకు డివిజనల్ పంచాయతీ అధికారి శుక్రవారం రానున్నారు. విచారణకు హాజరు కావాలని ఇద్దరు ఉద్యోగులకు నోటీసులిచ్చారు.

పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఎస్కే నాగులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో వివిధ పద్దుల కింద వసూలు చేసిన సొమ్ము రూ. 16,08,904లు ఖజానాకు జమ చేయలేదు. బిల్ కలెక్టర్‌గా పనిచేసిన జంగం వెంకట గుప్తా బిల్ కలెక్షన్ రిజిస్టరు (బీసీఆర్) దాఖలా వసూలు చేసిన సొమ్ము రూ.11,10,280లు ఖజానాకు జమ చేయలేదు. ఇద్దరూ పంచాయతీకి చెందిన మొత్తం సొమ్ము రూ.27,19,184 దుర్వినియోగం చేశారు. ప్రస్తుతం నాగులు జగ్గయ్యపేట మండలం గండ్రాయి పంచాయతీలో పనిచేస్తుండగా, వెంకట గుప్తా మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు పంచాయతీలో పనిచేస్తున్నాడు. సొమ్మును పంచాయతీకి జమ చేయాలని గత ఫిబ్రవరి 14న అప్పటి పంచాయతీ కార్యదర్శి నోటీసులిచ్చారు. ఇప్పటి వరకు పైసా జమచేయలేదు. తాము నిధులు దుర్వినియోగం చేయలేదని, పంచాయతీలో వివిధ పనుల నిమిత్తం ఖర్చు చేశామని, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఈ ఇద్దరు ఉద్యోగులు చెపుతున్నట్టు సమాచారం.



అమరావతిలో త్రీ వీలర్స్ ఎలక్ట్రిక్ వాహనాలు

- సీఆర్‌డీఏ, ఈటీవో మోటార్స్ ఎంఓయూ
- తొలిదశలో 300 త్రీవీలర్లు, 100 కార్లు, 20 బస్సులు

విజయవాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మహిళలు నడిపేందుకు వీలుగా ఎలక్ట్రిక్ త్రీవీలర్ వాహనాలను ప్రవేశపెట్టేందుకు సీఆర్‌డీఏ అధికారులు ఈటీవో మోటార్స్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నారు. సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఈటీవో మోటార్స్‌కు చెందిన ఎలక్ట్రిక్ త్రీవీలర్స్, బస్సులను సీఎం పరిశీలించారు. రాష్ట్రంలో మహిళలు ఆర్థిక స్వావలంబనుకు, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఇవి దోహదపడతాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఈటీవో మోటార్స్‌తో ఇటీవలే సీఆర్‌డీఏ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ త్రీ వీలర్లతో పాటు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రికల్ బస్సులు, క్యాబ్‌లు ప్రవేశపెడుతుంది. ఇటీవలే అధికారులు మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇచ్చారు. త్వరలోనే వీరికి ఈవీ త్రీవీలర్ వాహనాలు అందచేయనున్నారు. ప్రజారవాణా ద్వారా రాజధానిలో మౌలిక సదుపాయాలు, రవాణా కనెక్టివిటీ బలోపేతమౌతాయని సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అన్నారు. గన్నవరం విమానాశ్రయం, విజయవాడ, అమరావతి, గుంటూరు ప్రాంతాలను కలిపే మార్గం పరిశుభ్రమైన, సుస్థిర రవాణాకు ప్రతీకగా నిలుస్తుందన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు: జేసీ

విజయవాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 17న శుక్రవారం నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3.59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా వేశామన్నారు. దీనిలో 159 రైతు సేవాల కేంద్రాల ద్వారా 3.03 లక్షల మెట్రిక్ టన్ను ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామన్నారు. ఈ కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శాటిలైట్ ప్రయోగానికి కేఎల్ సిద్ధం

- కాలేజీ విద్యార్థులు రూపొందించిన మినీ శాటిలైట్



శాటిలైట్‌ను మోసుకెళ్లే రాకెట్

విజయవాడ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సొంత టెక్నాలజీతో ఎంతో ప్రతిష్టాత్మకంగా కేఎల్ డీమ్డ్ వర్సిటీ విద్యార్థులు రూపొందించి చిన్నతరహా ఉపగ్రహాన్ని ఈ నెల 18 ప్రయోగించబోతున్నట్టు వైస్ చాన్సలర్ డాక్టర్ జీ పార్థసారథివర్మ గురువారం కాలేజీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపారు. భూమి నుంచి 12-13 కిలోమీటర్ల ఎత్తులో 800 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ వాతావరణంలో వస్తున్న మార్పులను స్ట్రాటోస్పిరిక్, టెలిమెట్రీ పరీక్ష ఎప్పకప్పుడు పర్యవేక్షిస్తూ పరిశోధనలు చేయడానికి కేఎల్ శాట్ పేరుతో రూపొందించిన ఈ ఉపగ్రహానికి అన్ని అనుమతులు వచ్చాయన్నారు. లాంచ్ ప్యాడ్‌గా గ్రీన్‌ఫీల్డ్ క్యాంపస్‌లోని క్రికెట్ మైదానాన్ని ఉపయోగిస్తున్నట్టు తెలిపారు. ఈ మిషన్‌కు మాజీ డైరెక్టర్, చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్‌గా డాక్టర్ కే శరత్‌కుమార్ వ్యవహరిస్తున్నట్టు వెల్లడించారు. ఉపగ్రహానికి రూపకల్పన చేసిన బృందంలోని సభ్యులు, విద్యార్థులను వర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్ వెంకట్‌రామ్, డాక్టర్ రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కే సుబ్బారావు, పరిశోధన, అభివృద్ధి డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్ అభినందించారు.

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలు

విజయవాడ సిటీ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్టు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి షేక్ రుక్సానాసుల్తానాబేగం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అకౌంటెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డాక్టర్, చౌకీదారు, పార్ట్ టైం ఎడ్యుకేటర్, మ్యూజిక్ టీచర్, యోగా టీచర్, కుక్, హెల్పర్, హౌస్ కీపర్, నైట్ వాచ్ విమెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 18-42 ఏళ్ల వయసున్న మహిళలు ఈ పోస్టులకు అర్హులని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22 లోపు దరఖాస్తులు అందజేయాలని, దరఖాస్తు ఫారాలను ఎన్టీఆర్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దరఖాస్తునకు జత చేసే ధ్రువీకరణ పత్రాల నకళ్లను గెజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేయించి కానూరులోని కార్మెల్ చర్చి రోడ్డులోని జిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు.

మరో లంచావతారం

(5వ పేజీ తరువాయి)

పరిశీలించారు. ఆ బిల్లులను కొండపల్లి శ్రీనివాసరావు చింపేసి రూ.40 వేలు డిమాండ్ చేయగా జోగారావు రూ.16 వేలు ఇచ్చాడు. అనంతరం జోగారావు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఏసీబీ డీఎస్పీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సీఐ రంగారావు జెండాచెట్టు వద్దకు వెళ్లి మిగతా డబ్బు తీసుకుంటున్న కొండపల్లి శ్రీనివాసరావును పట్టుకున్నారు. అనంతరం అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరావు ప్రతినెలా పెద్ద మొత్తంలో డబ్బు డిమాండ్ చేసి వసూలు చేస్తున్నట్లు పలువురు వ్యాపారులు తెలిపారు.

సీడ్.. స్పీడ్‌గా..

(5వ పేజీ తరువాయి)

పనులు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మిగులు భూములకు సంబంధించి కూడా రాజధాని రైతులు ముందుకు వస్తుండటంతో సీడ్ యాక్సెస్ రోడ్డును త్వరలోనే పూర్తి చేయొచ్చని భావిస్తున్నారు.

మరికొంతమంది రైతుల అంగీకారం

మొదట్లో భూములు ఇవ్వటానికి ససేమిరా అన్న కొంతమంది రైతులు ఇప్పుడు ఓకే.. చెబుతున్నారు. భూ సమీకరణ కింద పెనుమాకలో 28.25 ఎకరాలు ఇవ్వడానికి 14 మంది రైతులు గురువారం అంగీకార పత్రాలు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అందించారు. అలాగే, ఉండవల్లిలో 22 మంది రైతులు 14 ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. ఈ భూముల కారణంగా కొండవీడు వాగు వరద నిర్వహణ పనులతో పాటు పలు అంతర్గత రహదారుల అనుసంధాన పనులు చేపట్టడానికి అవకాశం ఉంటుంది.

అభివృద్ధికి నిధులు

(5వ పేజీ తరువాయి)

మొత్తం 59 పనులు చేపట్టారు. వీటిలో ప్రధానంగా పశ్చిమ నియోజకవర్గంలోని 40వ డివిజన్‌లో 1,500 కిలోలీటర్ల సామర్థ్యం ఉన్న తాగునీటి పథకానికి రూ.రూ.3.30 కోట్లు, మొగల్రాజపురంలోని గంగిరెద్దులదిబ్బ నుంచి గుణదలలోని పడవలరేవు సెంటర్ వరకు 2.8 కిలోమీటర్ల పొడవునా నీటి సరఫరా నిమిత్తం రూ.3.29 కోట్లు, నందమూరి నగర్‌లో 1,500 కిలో లీటర్ల తాగునీటి పథకానికి రూ.3.61 కోట్లు, నందమూరినగర్ నుంచి 58వ డివిజన్ నీటి సరఫరాకు రూ.3.30 కోట్లు, ఒకటో డివిజన్‌లో 1,500 కిలోలీటర్ల తాగునీటి పథకానికి రూ.3.30 కోట్లు, 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో 1,500 కిలోలీటర్ల తాగునీటి పథకానికి రూ.4కోట్లు విడుదలయ్యాయి. గాలిలో ఆక్సిజన్ నాణ్యతను పెంచేందుకు 16 పనులకు రూ.24 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో 41వ డివిజన్‌లోని వెంకటేశ్వర ఫౌండ్రి రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.3.05 కోట్లు మంజూరయ్యాయి. ఈ జాబితాలోనే ఉన్న ఏపీఐఐసీ కాలనీ మసీదు నుంచి గురునానక్ కాలనీ వరకు హైటెన్షన్ లైన్ రోడ్డుకు రూ.72.41 లక్షలు మంజూరయ్యాయి.

నగరానికి నగిషీ

(5వ పేజీ తరువాయి)

విభాగం భావిస్తోంది. ఇలాచేస్తే కొండ ప్రాంతాల ప్రజలకు తేలిగ్గా నీటిని అందించవచ్చనేది అధికారుల ఆలోచన. రిజర్వాయర్ల వరకు నీటిని పంపిస్తే చాలని భావిస్తున్నారు. అలాగే, మంచినీటి కాలుష్యాన్ని నియంత్రించటానికి డీపీఆర్‌ను తయారు చేయిస్తున్నారు. ఇటీవల రాజరాజేశ్వరిపేటలో డయేరియా వ్యాప్తిచెందింది. కార్పొరేషన్ రక్షిత మంచినీటిని అందిస్తున్నా డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ డ్యామేజీల కారణంగా కలుషిత నీరు సరఫరా అయ్యే పరిస్థితి ఏర్పడింది. పూర్తిగా పాత పైపులైన్లు మార్చి కొత్తవి ఏర్పాటు చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు.

ఇక పూర్తిస్థాయిలో స్టామ్ వాటర్ డ్రెయిన్లు

నగరంలో తేలికపాటి వర్షం కురిసినా రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. మురుగు కాల్వలో ఉన్న నీరంతా వరద నీటిలో కలిసిపోతోంది. ఈ పరిస్థితులను మార్చాలంటే.. వరద నీటిని ఎత్తిపోసే వ్యవస్థ కావాలి. దీనికి స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లే దిక్కు. నగరంలో ఏయే ప్రాంతాల నుంచి నూతన స్ట్రామ్ వాటర్ డ్రెయిన్లు అవసరమన్న దానిపై సమగ్రంగా డీపీఆర్ తయారుచేస్తారు.

18, 19 తేదీల్లో జిల్లాస్థాయి జిమ్నాస్టిక్ టోర్నమెంట్

విజయవాడ స్పోర్ట్స్: జిల్లాస్థాయి జిమ్నాస్టిక్ టోర్నమెంట్ ఈ నెల 18. 19 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా జిమ్నాస్టిక్ అసోసియేషన్ కార్యదర్శి బి.బాబురావు తెలిపారు. మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్‌స్కూల్‌లోని జిమ్నాస్టిక్ హాల్‌లో మిని, సబ్‌జూనియర్, జూనియర్ విభాగాలలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన బాల, బాలికలు ఈనెల 18న మధ్యాహ్నం 3.30గంటలకు రిపోర్టు చేయాలని తెలిపారు. ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు.

జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా నైపుణ్యాలు

● కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా యువత నైపుణ్యాలు సముపార్జించాలని, అప్పుడే కెరీర్‌పరంగా ప్రపంచ వ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం అధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలను, సంస్థ కార్యకలాపాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ఎస్ఎస్‌డీసీ ద్వారా ఎప్పటికప్పుడు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలతో పాటు జాబ్‌మేళాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రష్యా, జర్మన్, ఖతార్ తదితర దేశాల్లో కూడా వివిధ ఉద్యోగావకాశాలు పొందేందుకు ఆయా భాషల్లో శిక్షణతో పాటు ఉద్యోగాలు పొందేందుకు చేయూతనందిస్తోం దన్నారు. ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సీపాన శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులున్నారు.



ఇగ్నైట్ సెల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించండి

లబ్బీపేట: కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సబ్కా ప్రతినిధులు గురువారం కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబ్కా సభ్యులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ల బిల్లులు అప్లోడ్, పేమెంట్స్‌పై ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ పాటించేలా ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్లు ఆదేశాలు ఇవ్వాలని, తక్షణమే బడ్జెట్ కేటాయింపులు జరిగేలా చూడాలని కోరినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని సబ్కా కృష్ణ కమిటీలతో జాయింట్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని తమ వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. సబ్కా స్టేట్ కమిటీ కో ఆర్డినేటర్ శివకుమార్, ట్రెజరర్ అప్పారావు, డిప్యూటీ కో ఆర్డినేటర్ కూచిపూడి శ్రీనివాసరావు, సబ్కా కృష్ణా ప్రెసిడెంట్ మండవ సాయి, సెక్రటరీ పాల్గొన్నారు.

చెత్తాచెదారంతో బిల్ కలెక్టర్ భవనం

● అధికారుల నిరక్ష్యం వల్ల నిరుపయోగంగా మారిన వైనం

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: స్థానిక 14వ డివిజన్ ఎన్ఎస్ఎం స్కూల్ రోడ్డులోని బిల్ కలెక్టర్ భవనం చెత్తా చెదారం వ్యర్థాలతో నిండి నిరుపయోగంగా మారింది. వెంకటేశ్వర స్వామి గుడి ఎదురుగా ఉండే ఈ భవనంలో నాలుగేళ్ల క్రితం బిల్ కలెక్టర్ విధులు నిర్వర్తించే వారని, ఆ తరువాత రోజుల్లో ఈ భవనం ఈ-సేవా కేంద్రంగా మారింది. భవనం చుట్టూ పేరుకుపోయిన చెత్తతో దుర్వాసన వెదజల్లు తోంది. ఫర్నీచర్ పూర్తిగా దెబ్బతింది. అధికారులు నిర్లక్ష్యంగా భవనాన్ని వదిలేయడంతోనే ఈ దుస్థితి దాపురించిందని స్థానికులు చెబుతున్నారు. నివాసాల మధ్యలో వ్యర్థాలతో నిండిన ఈ భవనం నుంచి వస్తున్న దుర్వాసన భరించ లేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిరుపయోగంగా మారిన బిల్ కలెక్టర్ భవనం



విరిగిన కుర్చీలు, పనికిరాని సామగ్రి

గాంధీ శిల్పబజార్‌కు విశేష స్పందన

బెంజిసర్కిల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏర్పాటు చేసిన గాంధీ శిల్ప బజార్‌కు విశేష స్పందన లభిస్తోందని లేపాక్షి వీసీ, ఎండీ ఎం.విశ్వ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన గాంధీ శిల్ప బజార్ ఈ నెల 19 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అఖిల భారత హస్తకళా వస్తువులు, కళాత్మక వస్త్ర ప్రదర్శన, విక్రయాల వేదిక గాంధీ శిల్ప బజార్‌ను కేంద్ర ప్రభుత్వ హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కమిషనర్ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలో కలంకారీ బ్లాక్ ప్రింటింగ్, లెదర్ వర్క్, కొండపల్లి బొమ్మలు, టెర్రకోట, ఇమిటేషన్ జ్యువలరీ, క్రొచెట్ లేస్, ఎంబ్రాయిడరీ, షాల్స్ వుడ్‌కార్వింగ్స్, తంజావూర్ పెయింటింగ్స్, కార్పెట్లు, రగ్గులు, తివాచీలు, బీద్రి వర్క్, కేన్ వస్తువులు, సహరాన్పూర్ ఫర్నిచర్, బెనారస్, చందేరీ పట్టు చీరలు తదితర వస్తువులు ఉన్నాయి. ప్రదర్శన ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎం.విశ్వ తెలిపారు.



ఇమిటేషన్ జ్యుయలరీని పరిశీలిస్తున్న మహిళలు

వృద్ధ దంపతులకు నిత్యావసరాలు పంపిణీ

కృష్ణలంక, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక 22వ డివిజన్ గంగానమ్మ గుడి ప్రాంతంలో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న సిద్దాబత్తుల గోవింద్ ఇంటికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వృద్ధ దంపతులు సోరగుడి వెంకటేశ్వరరావు - మల్లేశ్వరి దంపతులకు నిత్యావసర సరుకులు, చేతి ఖర్చుల నిమిత్తం రూ.1500 ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతికుమార్ అందచేశారు. టీడీపీ నాయకులు గోరిపర్తి నామేశ్వరరావు, కొర్రా అప్పన్న, తోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితులకు జైలు, జరిమానా

విజయవాడ లీగల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : మంచినీళ్ల పట్టుకొనే విషయంలో దాడిచేసి కొట్టిన నిందితులపై నేరం రుజువుకావడంతో ఆరు నెలల జైలుశిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ మొదటి అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం.ఎస్.కరీముల్లా గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం బాధితురాలు ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో నివసిస్తోంది. మంచినీళ్ల పట్టుకొనే సమయంలో ఏర్పడిన వివాదం దృష్ట్యా ఫిర్యాది ఆడబిడ్డ చిన్నమ్మ, తోడికోడలు పద్మ, మరిది ఏడుకొండలు కలిసి 2022 మార్చి 17న బాధితురాలిపై దాడిచేసి కొట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మాచవరం పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పరిశీలించిన న్యాయమూర్తి, నిందితులపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి కౌన్సెలింగ్ నేడు

భారతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐలలో 2025-26/27 విద్యా సంవత్సరానికి ఐదో విడత అడ్మిషన్స్ పొందడానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 17న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, ఆర్థికంగా బలహీనమైన విభాగం(ఈడబ్ల్యూఎస్ పత్రం), స్టడీ సర్టిఫికెట్స్‌లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ పొందిన అభ్యర్థులలో ఎస్సీ, ఎస్టీ మినహా మిగిలిన కేటగిరి అభ్యర్థులు రూ.60 కాషన్ డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. వివరాలకు 0866-2475575, 9490639639, 7780429468 నంబర్లను సంప్రదించాలని కోరారు.

చురుగ్గా ఎస్టీపీ ప్లాంట్ విస్తరణ పనులు

● డీఈ చంద్రశేఖర్



రామలింగేశ్వరనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక 15వ డివిజన్ రామలింగేశ్వనగర్ కృష్ణానది కరకట్ట వద్ద మురికి నీటిని శుద్ధికరణ(ఎస్టీపీ) ప్లాంట్ పనులు చురుగ్గా సాగుతున్నట్లు డీఈ చంద్రశేఖర్ తెలిపారు. ప్లాంట్ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం రూ.30 కోట్లతో ఈ పనులు చేపడుతున్నామన్నారు. 80 శాతం పనులు పూర్తయ్యాయని, మరో రెండు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పారు.

నిప్పు లేకుండా వంటలపై పోటీలు

మొగల్రాజపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరమాచనేని పద్దయ్య పబ్లిక్ స్కూల్‌లో గురువారం నిప్పులేకుండా వంట చేయడం అనే అంశంపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు కార్యక్రమం నిర్వహించారు. పోషకాలతో కూడిన అటుకులు, కొబ్బరి పాలతో బిరియానీ, కీరాతో న్యూడిల్స్ , మొలకలతో చాట్, డ్రైఫ్రూట్స్‌తో లడ్డూ, కిళ్లీ , వివిధ పండ్లతో ఆహార పానీయాలు తదితర పదార్థాలు తయారుచేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తయారు చేసిన పదార్థాలను ప్రినిపాల్ మేడా సీతారామయ్య పరిశీలించారు. వైస్ ప్రిన్సిపాల్ రోజీమేరీ, హెచ్ఎం సీహెచ్ విజయలక్ష్మి వంటకాలను రుచి చూసి ఉత్తమ వాటిని ఎంపిక చేశారు.



వంటలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య

జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను బెదిరించిన కేసులో ఇద్దరి అరెస్టు

విజయవాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి) : విజయవాడ ప్రభుత్వాసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ ఏవీ రావును బెదిరించిన కేసులో ఇద్దరు నిందితులను మాచవరం పోలీసులు గురువారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఆకలిరాజ్యం క్యాంటీన్‌కు అద్దె గడువును రెండేళ్లు పెంచనందుకు ఇద్దరు యువకులు రావు ఇంటికి వెళ్లి బెదిరించారని ఆయన మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై దర్యాప్తు సాగించిన మాచవరం పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. దీని ప్రకారం కంచికచర్లకు చెందిన రాహుల్, విజయవాడ పైపులరోడ్డుకు చెందిన హేమంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాహుల్ ప్రస్తుతం లబ్బీపేటలో అద్దెకు ఉంటున్నాడు. ఈ ఇద్దరు కలిసి ఆటోలో డాక్టర్ ఇంటికి వెళ్లి క్యాంటీన్ అద్దె గడువును అధికారులు రెండేళ్లకు పెంచాలనుకుంటే ఏడాదికి పెంచాలని ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. తమతో పెట్టుకోవద్దని హెచ్చరించారు. ఈ కేసులో రాహుల్, హేమంత్‌ను అరెస్టు చేశారు.

సర్వే స్థితిగతులపై సమీక్ష

కార్పొరేషన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనంలోని మీటింగ్ హాల్లో గురువారం డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన నగరంలో జరుగుతున్న సర్వే స్థితిగతులపై రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాలు, ఖాళీ స్థలాలుగానే ఉన్నాయా, వాటిలో ఇల్లు నిర్మాణం జరిగిందా, జరిగితే ఖాళీ స్థలాల పన్నును ఇంటి పన్నుకి మార్చాలన్నారు. ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఉందా, లేదా అడిగి తెలుసుకొని, ఒకవేళ అదనంగా గదులు నిర్మించినా, అంతస్తులకు పన్నును ఈ సర్వే ద్వారా మార్చాలని అన్నారు. అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్‌వెరిఫికేషన్ చేసి కచ్చితంగా సర్వేను పూర్తి చేయాలన్నారు. ప్రజలు కూడా సిబ్బందికి సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, ఏయూబి శర్మ, డి.శ్రీనివాస్, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్‌స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు .

సాహిత్య సాంస్కృతిక ఉత్సవాలకు సహకరించండి

● సాంస్కృతిక సారథి గోళ్ల నారాయణరావును కలిసిన కలిమిశ్రీ

విజయవాడ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నవంబరు 22, 23 తేదీల్లో జరగనున్న జాతీయ సాంస్కృతిక ఉత్సవాలకు ఆహ్వానించడం కోసం గురువారం విజయవాడలో సాంస్కృతిక సారథి, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గోళ్ల నారాయణరావుని ఉత్సవాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కలిమిశ్రీ కలిశారు. విజయవాడలో సాంస్కృతిక వికాసం కోసం తలపెట్టిన రెండు రోజుల యజ్ఞంలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా నారాయణరావుని కోరారు.ఈ మహోత్సవాలను విజయవంతం చేయడంలో పూర్తి సహకారాన్ని అందిస్తానని నారాయణరావు భరోసా ఇచ్చారు. ఈ కలయికలో పురప్రముఖులు మీసాల రాజేశ్వరరావు, గోరిపర్తి హనుమంతరావు, ఉత్సవాల కమిటీ బాధ్యులు చొప్పా రాఘవేంద్ర శేఖర్, పి.చిదంబరం, వై.డి.ఆనంద్ పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్

జాతీయ రెజ్లింగ్‌కు పీబీ సిద్ధార్థ విద్యార్థులు

మొగల్రాజపురం, అక్టోబరు 16 (ఆంధ్రజజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిందూపూర్‌లో జరిగిన 5వ రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్ పోటీలలో పీబీ సిద్ధార్థ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బి. చైతన్య నాగవర్ధన్‌రాజు, వై టాగోర్ సన్నీ, ఎం.రాణి, ఎస్‌కే జహీరుద్దీన్ బంగారుపతకం, వి.దేవిశ్రీ బంగారుపతకాలు, ఎస్. పవన్‌కుమార్ వెండిపతకం సాధించారని, వీరంతా జాతీయ రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విజేతలను సిద్ధార్థ అకాడమీ పాలకవర్గంతో పాటు డీన్ రాజేష్ జంపాల, డైరెక్టర్ వేమూరి బాబూరావు, క్రీడా విభాగాధిపతి డాక్టర్ టివి బాలకృష్ణారెడ్డి తదితరులు అభినందించారు.

యూజీడీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



యూజీడీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భూగర్భ డ్రెయినేజీ సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం తూర్పు పరిధి 12వ డివిజన్‌లోని అశోక్‌నగర్, వివేకానంద రోడ్డు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పర్యటించారు. స్థానికంగా ఉన్న డ్రెయినేజీ సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన యంత్రాలు లేకపోవడం, స్కిల్ వర్కర్స్ లేకపోవడం, డ్రెయినేజీలను సరిగా శుభ్రం చేయకపోవడం ఇలాంటి కారణాలతో సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈసమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. నెల రోజుల వ్యవధిలోనే డివిజన్‌లో భూగర్భ డ్రెయినేజీ సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్పొరేటర్లు పొట్లూరి సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, పార్టీ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీల్లో కేబీసీ విద్యార్థులకు పతకాలు

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సబ్ జూనియర్, జూనియర్ అంతర్ జిల్లాల సెపక్‌తక్రా పోటీలలో కేబీసీ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. ఈ నెల 11, 12తేదీల్లో చీరాలలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో పటమట జడ్పీ హెచ్ విద్యార్థులు అండర్-14 విభాగంలో బంగారు పతకాలు సాధించారు. అండర్-18 జూనియర్ విభాగంలో రెండు జట్లు బంగారు పతకాలు సాధించారు. సబ్‌జూనియర్, జూనియర్ విభాగాలలో 12మంది క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను కోచ్ రమేష్, స్కూల్ ప్రధానోపాధ్యాయులు వీవీఎస్ సత్యనారాయణ, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యలమంచిలి రవి, మెంబర్ కోనేరు రాజేష్, ఎస్ఎంసీ చైర్మన్ ఎండీ ఫైజున్నీస అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో స్కూల్ ప్రిన్సిపాల్ తదితరులు

ఘనంగా ప్రపంచ అనాటమీ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న మెడికల్ కాలేజీ విద్యార్థులు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ప్రపంచ అనాటమీ దినోత్సవం గురువారం ఘనంగా జరిగాయి. కళాశాల అనాటమీ విభాగం ఆధ్వర్యంలో జరిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఏడుకొండలు పాల్గొని అనాటమీ దినోత్సవ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. మానవ శరీర నిర్మాణ శాస్త్ర పితామహుడు ఆండ్రియాస్ వెసాలియస్ జ్ఞాపకార్థం ఈ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారని గుర్తు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని విద్యార్థులు కళాశాల ప్రాంగణాన్ని రంగోలితో అలంకరించారు. పోస్టర్ మేకింగ్, మోడల్ మేకింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చారు. చివరిగా మృతదేహాల బలిదానాలను గౌరవిస్తూ, వాటిని జీవితాంతం కృతజ్ఞతతో గుర్తుంచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

● ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.హరిబాబు

భారతీనగర్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈఈ పి.హరిబాబు హెచ్చరించారు. రింగ్ రోడ్డు సెక్షన్ పరిధిలో పలు గృహ, వాణిజ్య సర్వీసులను విద్యుత్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. రింగ్ రోడ్డు సెక్షన్‌లో 37బృందాలుగా ఏర్పడి 2947 గృహ సర్వీస్‌లు, 193 వాణిజ్య సర్వీసులను తనిఖీలు చేశారు. 87సర్వీసులకు రూ.3,90,000 అదనపు లోడ్ కింద జరిమానా విధించారు. ఈ సందర్భంగా డీఈఈ పి.హరిబాబు మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. పటమట సబ్ డివిజన్ డీఈఈ ఎం.శివకుమార్, విజిలెన్స్ డీఈఈ పి.నాగేశ్వరరావు, గుణదల డివిజన్‌లో ఉన్న డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో ఈఈ పి.హరిబాబు, డీఈఈ ఇంజనీర్ ఎం.శివకుమార్, తదితరులు



శ్రీశైలం ఆలయంలో దైవ దర్శనానికి వెళ్తున్న ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మల్లన్న సేవలో ప్రధాని

- భ్రమరాంబ, మల్లికార్జునలకు ప్రత్యేక పూజలు
- సీఎం, డిప్యూటీ సీఎంతో కలిసి శ్రీశైలంలో 3 గంటల పర్యటన
- పూర్ణకుంభంతో అర్చకుల స్వాగతం
- పూజల అనంతరం వేదాశీర్వచనాలు, తీర్థప్రసాదాలు
- స్వామివారి శేషవస్త్రాలు అందించిన చంద్రబాబు, పవన్
- స్వామి సన్నిధిలో 40 నిమిషాలు
- తర్వాత శివాజీ స్ఫూర్తి కేంద్రం సందర్శన
- 1,800 మంది పోలీసులతో భారీ బందోబస్తు

నంద్యాల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవిని ప్రధాని మోదీ గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ప్రధాని తొలుత కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. మోదీ, చంద్రబాబు, పవన్ ముగ్గురూ కలసి ఒకే హెలికాప్టర్లో శ్రీశైలంలోని సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నంద్యాల కలెక్టర్ రాజకుమారి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జేసీ విష్ణుచరణ్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 10 కిలోమీటర్లు ప్రయాణించి మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. ప్రధాన అర్చకుడు వీరన్న స్వామి నేతృత్వంలో ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగానికి ప్రధాని ఏకవార రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, పంచామృతాలతో అభిషేకం చేశారు. అదే విధంగా భ్రమరాంబికకు ఖడ్గమాల, కుంకమార్చన పూజలు చేశారు. తర్వాత మల్లిక గుండమ్మ దర్శనం చేసుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో ప్రధానికి వేద పండితులు వేదాశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం అర్చక స్వాములు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆయనకు స్వామివారి శేష వస్త్రాలు, స్వామి. అమ్మవార్ల చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు. శ్రీశైలంలో మొత్తంగా 3 గంటలు పర్యటించిన ప్రధాని.. 40 నిమిషాలు మల్లన్న సేవలో గడిపారు.

ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ

చంద్రబాబు, పవన్‌తో కలిసి ప్రధాని మధ్యాహ్నం 12:35 గంటలకు ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రానికి వెళ్లారు. ముందుగా శివాజీ దర్బార్, గోడలపై శివాజీ జీవిత చరిత్రపై శిల్పాలతో కూడిన చిత్ర మాలికలను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా శివాజీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం స్ఫూర్తి కేంద్రం నిర్వాహకులు టీజీ వెంకటేశ్, సుబ్బారెడ్డి తదితరులు ఆయనకు స్ఫూర్తి కేంద్రం జ్ఞాపికను అందజేశారు.



శ్రీశైలంలో ప్రధానిని చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

వేల మంది శివ సేవకులు

మోదీ రాక సందర్భంగా శ్రీశైలంలో భక్తులతో పాటు శివ సేవకులు కాషాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. నంది మండపం సర్కిల్ నుంచి గంగాధర మండపం వరకు మోదీ కాన్వాయ్ వెళ్తుండగా.. అటుగా ఉన్న భక్తులు, వేల సంఖ్యలో శివసేవకులు హరహర మహాదేవ నినాదంతో హోరెత్తించారు. మోదీ వాహనంలో నుంచే అభివాదం చేశారు. ఇంకోవైపు.. నల్లమల అటవీ ప్రాంతం కావడంతో సున్నిపెంట నుంచి శ్రీశైలం వరకు భారీ బందోబస్తు చేపట్టారు. 1,800 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. భద్రతా ఏర్పాట్లను నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్, ఈగల్ చీఫ్ రవికృష్ణ, ఐపీఎస్ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షించారు.

మోదీ సంస్కరణలు..

దేశానికే గేమ్ చేంజర్లు

21వ శతాబ్దం ఆయనదే: సీఎం

- సూపర్ సిక్స్, సూపర్ జీఎస్టీతో సూపర్‌గా పొదుపు
- ఒక్కో కుటుంబానికి రూ.15,000 ఆదా
- జీఎస్టీ బచత్ ఉత్సవ్.. భరోసా ఉత్సవ్
- డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ ప్రయోజనాలు
- కేంద్రం సహకారంతోనే అమరావతిని నిలబెట్టాం
- మోదీ విజయయాత్ర నిరంతరం సాగాలి
- బిహార్ ఎన్నికల్లో ఎన్‌డీయే గెలుపు తథ్యం
- కర్నూలు సభలో చంద్రబాబు విశ్వాసం



మోదీని సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, గవర్నర్ అబ్దుల్ నజీర్

కర్నూలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ తెచ్చిన సంస్కరణలు దేశానికే గేమ్ చేంజర్లుగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ఈ 21వ శతాబ్దం ఆయనదేనన్నారు. గురువారం కర్నూలులో నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. జీఎస్టీ సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నందుకు.. ముఖ్యమంత్రిగా, ప్రధానిగా పాతికేళ్లుగా ప్రభుత్వాధినేతగా కొనసాగుతున్నందుకు మోదీకి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సరైన సమయంలో సరైన చోట సరైన వ్యక్తి అయిన ప్రధాని మోదీ విశిష్ట వ్యక్తి అని ప్రశంసించారు. ప్రగతిశీల దేశంగా 2047 నాటికి భారత్ ప్రపంచానికి సూపర్ పవర్‌గా తయారవుతుందన్నారు. ఇంకా ఏమన్నారంటే..

మోదీ ఆల్‌టైమ్ రికార్డు..

దేశంలో 11 ఏళ్లలో 4 కోట్ల కుటుంబాలకు పక్కా ఇళ్లు.. 81 కోట్ల మందికి ఉచిత రేషన్, 144 వందే భారత్ రైళ్లు, 55 వేల కిలోమీటర్ల మేర కొత్త హైవేలు, 86 విమానాశ్రయాలు, 16 ఎయిమ్స్ ఆస్పత్రులు నిర్మించిన ఘనత మోదీదే. 7 ఐఐటీలు, 8 ఐఐఎంలను తీసుకువచ్చిన రికార్డు కూడా ఆయనదే. ఇది ఆల్‌టైమ్ రికార్డు. 11 ఏళ్ల క్రితం 11వ ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్.. ఆయన సంకల్పంతోనే నాలుగో స్థానానికి వచ్చింది. 2028 నాటికి మూడో అతిపెద్ద, 2038 నాటికి రెండో అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతుంది. ఆర్థికంగా మన బలమేంటో ఈ విజయాలు చెబితే.. సైనికంగా మన బలమేంటో ఆపరేషన్ సిందూర్ చాటింది.

ప్రతి కుటుంబానికీ ప్రయోజనకరం..

'ఒకే దేశం-ఒకే పన్ను-ఒకే మార్కెట్ విధానంతో తెచ్చిన జీఎస్టీ 2.0లో 99 శాతం వస్తువులు సున్నా, 5 శాతం శ్లాబుల పరిధిలోనే ఉన్నాయి. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసరాల వస్తువుల ధరలు తగ్గాయి. పేద, మధ్యతరగతి వర్గాలు, రైతులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు.. అన్ని వర్గాలకూ లబ్ధి కలిగింది. ఈ సంస్కరణల వల్ల ఏటా ఒక్కో కుటుంబానికి రూ.15,000 ఆదా అవుతోంది. డబుల్ ఇంజన్ సర్కారుతో డబుల్ ప్రయోజనాలు కలుగుతున్నాయి. సూపర్ సిక్స్ పథకాలు, సూపర్ జీఎస్టీతో ప్రజలకు సూపర్‌గా పొదుపు జరిగింది. ప్రపంచ మార్కెట్లను ప్రభావితం చేస్తున్న టారిఫ్‌లను ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ ఇచ్చిన 'గర్వ్ సే కహో.. యే స్వదేశీ హై' నినాదం బ్రహ్మాస్త్రంగా మారుతుంది. ఈ స్వదేశీ పిలుపును అందిపుచ్చుకుని సెమీ కండక్టర్ల నుంచి శాటిలైట్ల వరకూ చిప్‌ల నుంచి షిప్పుల వరకూ ఏపీలోనే ఉత్పత్తి చేసేలా కార్యాచరణ చేపట్టాం.

శంకుస్థాపనలు, ప్రారంభాలు..

విద్యుత్, రైల్వే, రోడ్డు, రక్షణ రంగాలకు చెందిన రూ.13,430 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని ఇవాళ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.4,922 కోట్ల విలువైన కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు శంకుస్థాపనలు చేశారు.

కేంద్రం సహకారంతోనే సూపర్ హిట్..

రాష్ట్రానికి 16 నెలలుగా ప్రధాని మోదీ అందిస్తున్న సాయం మరువలేనిది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మెగా డీఎస్సీ, పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, తల్లికి వందనం, దీపం-2.0, పెన్షన్ల పంపిణీ వంటి సంక్షేమ పథకాలను కేంద్రం సహకారంతోనే సూపర్ హిట్ చేశాం. కేంద్రం సహకారంతోనే అమరావతిని నిలబెట్టాం. పోలవరాన్ని గాడిన పెట్టాం. విశాఖ ఉక్కును బలోపేతం చేశాం. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అత్యధిక పెట్టుబడులు సాధిస్తోంది. ఉమ్మడి విశాఖలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పెడుతోంది. ఇప్పుడు విశాఖకు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా హబ్ వస్తోంది. నెల్లూరులో బీపీసీఎల్ రిఫైనరీ వస్తోంది. రాయలసీమకు త్వరలో హైకోర్టు బెంచ్ రాబోతోంది. సీమకు ఇంకా ఉక్కు, అంతరిక్షం, రక్షణ, ఏరోస్పేస్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ల తయారీ, హరిత ఇంధనం, ఆహారశుద్ధి, సిమెంట్ పరిశ్రమలు వస్తున్నాయి. వీటితో పాటు సెమీకండక్టర్ యూనిట్లు, క్వాంటమ్ వ్యాలీ రావడానికి కారణమైన ప్రధానికి ప్రత్యేక ధన్యవాదాలు.

> మోదీ 21వ శతాబ్దపు నేత. నేను ఎందరో ప్రధానులతో కలిసి పనిచేసినా ఆయనలాంటి వ్యక్తిని చూడలేదు. నిర్విరామంగా ప్రజాసేవలోనే ఉంటున్న అరుదైన నేత.
>
> దసరా నుంచి దీపావళి వరకు జీఎస్టీ సంస్కరణలను పండుగలా నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 98 వేల కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాం. జీఎస్టీ బచత్ ఉత్సవ్ కాస్తా ఇవాళ భరోసా ఉత్సవ్‌గా మారింది.
>
> - సీఎం చంద్రబాబు

ఆ శక్తి మోదీకివ్వాలి..

శక్తిపీఠం, జ్యోతిర్లింగం ఒకే చోట కొలువై ఉన్న దివ్యక్షేత్రం శ్రీశైలం. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పుట్టిన పౌరుషాల గడ్డపై జీఎస్టీ బచత్ ఉత్సవ్ సభకు ప్రధాని రావడం సంతోషదాయకం. దేశానికి ప్రగతి దిశగా నడిపే శక్తిని మోదీకివ్వాలని శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామిని ప్రార్థిస్తున్నాను. వికసిత భారత్ లక్ష్యంగా సాకారం కావాలని కోరుతున్నాను. మోదీ విజయయాత్ర నిరంతరం కొనసాగాలి. బిహార్ ఎన్నికల్లోనూ గెలుస్తుందని విశ్వసిస్తున్నాను.



శివాజీ స్ఫూర్తి కేంద్రంలో ధ్యానముద్రలో ఉన్న శివాజీ విగ్రహానికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ



శివాజీ స్ఫూర్తి కేంద్రంలో ప్రధానికి జ్ఞాపికను అందజేస్తున్న కమిటీ సభ్యులు. పక్కన చంద్రబాబు, పవన్

ఒక్క ఓటుతో..
అగ్రస్థానంలో ఆంధ్ర

- ఆ ఓటు రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేసింది
- లక్షల కోట్ల అభివృద్ధి, వేల కోట్ల సంక్షేమం తెచ్చింది
- పోలవరం, రాజధాని, విశాఖ ఉక్కు, రైల్వేజోన్, రోడ్లు, రైల్వే ప్రాజెక్టులకు నిధుల వరద: పయ్యావుల



కర్నూలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఒక్క చాన్స్ అంటూ వచ్చిన వారు రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తే.. 2024లో ఎన్‌డీఏకి ప్రజలు వేసిన ఆ ఒక్క ఓటే రాష్ట్ర భవిష్యత్‌ను మార్చిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఒక్క ఓటుతో ఆంధ్రను అగ్రస్థానంలో నిలిపారని అన్నారు. కర్నూలు సభలో ఆయన మాట్లాడారు. 'మీరు వేసిన ఒక్క ఓటే రూ.లక్షల కోట్ల అభివృద్ధి, రూ.వేల కోట్ల సంక్షేమం తీసుకొచ్చింది. ఒక్క ఓటు పోలవరానికి రూ.12,500 కోట్లు, అమరావతికి రూ.15 వేల కోట్లు, విశాఖ ఉక్కుకు రూ.11,400 కోట్లు, విశాఖకు రైల్వే జోన్, జాతీయ రహదారులకు రూ.70 వేల కోట్లు, రైల్వే ప్రాజెక్టులకు రూ.70 వేల కోట్లు, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కారిడార్, రూ.లక్ష కోట్ల బీపీసీఎల్ రిఫైనరీ, రూ.లక్ష కోట్ల ఆర్సెలార్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ వచ్చాయి. మెగా డీఎస్సీ-2024 నిర్వహించి 16 వేల మందిని టీచర్లను చేసింది. 65 లక్షల మంది అమ్మలకు తల్లికి వందనం కింద రూ.15 వేలు, రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు, అమ్మకు వందనం, స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచిత సిలిండర్లు, ఆటో డ్రైవర్లకు రూ.15 వేల సాయం.. ఇవన్నీ మీరు వేసిన ఒక్క ఓటుతోనే సాధ్యమయ్యాయి' అని ప్రజలనుద్దేశించి అన్నారు. సూపర్ జీఎస్టీతో నిత్యావసర సరుకులు, వస్తు, సేవల ధరలు తగ్గింపు, ప్రతి కుటుంబానికి రూ.20 వేలకు పైగా ఆదా అవుతోందని చెప్పారు. 'దీనిని ఇంటింటికీ తీసుకెళ్లడానికి సీఎం ఆదేశాలతో మంత్రి లోకేశ్ నేతృత్వంతో ఒక టీం పని చేసింది. 98 వేలకు పైగా కార్యక్రమాలు నిర్వహించాం' అని వివరించారు. మోదీ ఆశీస్సులు, చంద్రబాబు, లోకేశ్ ఆలోచనతో.. రాష్ట్ర భవిష్యత్‌ను మార్చేలా గూగుల్ సంస్థ విశాఖకు రూ.లక్ష కోట్లకు పైగా పెట్టుబడులతో వచ్చిందని తెలిపారు. 'మన పిల్లల భవిష్యత్ కోసం ఈ కూటమి కొనసాగాల్సిందే. ఈ కూటమితోనే రాష్ట్రానికి, మనకు భవిష్యత్' అని స్పష్టంచేశారు.

> *సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌తో దసరా, దీపావళి కలిపి ఒకేసారి వచ్చినట్లుగా ఉంది. అలాంటి సూపర్ పండుగను 140 కోట్ల ప్రజలకు ప్రధానమంత్రి అందించారు. పేద, మధ్య తరగతి ప్రజలపై పన్నుల భారం తగ్గించారు. దీంతో ఒక్కో పేద, మధ్య తరగతి కుటుంబానికి ఏటా రూ.15 వేలు మిగులుతాయి.*
>
> - మంత్రి లోకేశ్



కోరినవన్నీ తీరుస్తున్నారు!

- ఆంధ్రాపై మోదీకి అపార ప్రేమ: లోకేశ్
- 16 నెలల్లో నాలుగు సార్లు రాష్ట్రానికి వచ్చారు
- ఏపీ నంబర్ వన్ కావాలంటే.. ప్రభుత్వం కొనసాగడం అవసరం
- మాది డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు: లోకేశ్

కర్నూలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్ అన్నా, ఇక్కడి ప్రజలన్నా ప్రధాని మోదీకి అపారమైన ప్రేమ. 16 నెలల్లో నాలుగు సార్లు రాష్ట్రానికి వచ్చారు. మనం అడిగిన కోరికలన్నీ తీరుస్తున్నారు' అని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ కొనియాడారు. రాష్ట్రంలో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కార్ కాదు.. డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు అని పునరుద్ఘాటించారు. కర్నూలు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభలో గురువారం ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో రాష్ట్రం నంబర్ వన్ కావాలంటే ప్రభుత్వ కొనసాగింపు చాలా అవసరమన్నారు. స్థిరమైన అభివృద్ధి సాధించాలంటే సుస్థిర ప్రభుత్వం కొనసాగడం ముఖ్యమని తెలిపారు. దానివల్లే గుజరాత్ అభివృద్ధి చెందిందన్నారు. మోదీజీ వరుసగా 3సార్లు ప్రధాని కావడం వల్లే ప్రపంచంలో 10 నుంచి 4వ అతి పెద్ద ఎకానమీగా భారత్ అభివృద్ధి చెందిందని చెప్పారు. సభలో ఏమన్నారో ఆయన మాటల్లోనే..

దసరా, దీపావళి ఒకేసారి

సంక్షేమం- అభివృద్ధి ప్రజా ప్రభుత్వానికి జోడెద్దుల బండిలాంటివి. కూటమి ప్రభుత్వాన్ని కొనసాగిస్తే ఏపీ అన్ని రంగాల్లో నంబర్ వన్ కావడం గ్యారెంటీ. పవర్ ఫుల్ పీపుల్ మేక్స్ పేస్లేస్ పవర్‌ఫుల్. పౌరుషాల గడ్డ ఉమ్మడి కర్నూలు జిల్లా. బ్రిటిష్ వాళ్లను గడగడ లాడించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటివారు జన్మించిన గొప్ప నేల ఈ జిల్లా. కర్నూలు జిల్లా ప్రజల రాజసం కొండారెడ్డి బురుజు. జీఎస్టీ తగ్గించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు అధికారులు ప్రభుత్వానికి వేల కోట్ల నష్టం వస్తుందని చెప్పినా.. నష్టం వచ్చినా పర్వాలేదు దేశానికి లాభం జరుగుతుందని ప్రధాని చెప్పారంటే ఆయనకు ప్రజలపై ఉన్న ప్రేమ తెలుస్తుంది. ప్రతి వస్తువుపైనా జీఎస్టీ తగ్గించడంతో ప్రజలు పండగ చేసుకుంటున్నారు. పేద ప్రజల చిరునవ్వే మన ప్రధానికి పండుగ. పేదరికం లేని దేశమే మన 'నమో' కల. జీఎస్టీ తగ్గించాలని ప్రధాని నిర్ణయం తీసుకున్న తర్వాత రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వచ్చి దాదాపు రూ.8 వేల కోట్లు నష్టపోతామని చంద్రబాబుకు చెప్పారు. ఆయన కూడా.. ప్రభుత్వానికి నష్టం వచ్చినా పర్వాలేదు.. పేద ప్రజలకు రూ. వేల కోట్ల లాభం జరుగుతుంది కదా అని అన్నారు. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా అది ప్రజల మంచి కోసమే, దానికి చంద్రబాబు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. వీరిద్దరిదీ డబుల్ ఇంజన్ సర్కారు కాదు, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కారు. ప్రధాని సాయంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. విశాఖలో రైల్వే జోన్ ఏర్పాటు చేసుకున్నాం. ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చెయ్యమని కంపెనీ వాళ్లను కోరినప్పుడు.. వాళ్లు మాకు 3 అంశాల్లో క్లారిటీ కావాలని అడిగారు. వెంటనే సీఎం ప్రధానిని కలిసి చెప్పగా.. ఆయన వెంటనే అంగీకరించారు. ఆయన సహకారం వల్లే భారత్‌లో అతి పెద్ద స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్‌కు వచ్చింది. గూగుల్ ఏఐ హబ్, స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలు, బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తోంది.

మోదీ ఏది ప్రారంభించినా విజయమే

నరేంద్ర మోదీ అంటే విక్టరీ. ఆయన ఏ కార్యక్రమం ప్రారంభించినా విజయమే. గుజరాత్‌ను పవర్ ఫుల్ స్టేట్‌గా మార్చారు. ఇప్పుడు దేశాన్ని సూపర్ పవర్‌గా మారుస్తున్నారు. గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు కేంద్ర ప్రభుత్వాలు అమెరికా వద్దకో, ఇతర దేశాల దగ్గరకో వెళ్లి సాయం కోరేవి. మోదీ రూటే సెపరేటు. పహల్గామ్ దాడికి ప్రతిగా ఆయన కొట్టిన దెబ్బకు పాకిస్థాన్‌కు దిమ్మ తిరిగిపోయింది. అమెరికా టారిఫ్‌లు పెంచితే పెద్ద పెద్ద దేశాలు వణికిపోయాయి. మోదీ మాత్రం ఆత్మనిర్భర్ భారత్ వంటి కార్యక్రమాలతో ధైర్యంగా సాగుతున్నారు. మోదీకి దేశ ప్రజలంటే నమ్మకం.. ప్రజలకు మోదీ అంటే నమ్మకం. ఆ నమ్మకమే దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోంది.

మోదీ ఓ కర్మయోగి


- ప్రతిఫలం ఆశించకుండా దేశానికి సేవ
- భారత్‌ను తలెత్తుకొని పొగరుగా నిలబడేలా మార్చారు
- పన్నుల భారం తగ్గించడం చరిత్రలోనే లేదు
- 15 ఏళ్లు కూటమి స్థిరమైన పాలన అందించాలి
- అన్ని శాఖలూ నిర్వహించే సమర్థత లోకేశ్‌కు ఉంది
- కర్నూలు సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



కర్నూలు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని మోదీ ఓ కర్మయోగి.. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా దేశానికి సేవ చేస్తున్నారు. అలాంటి వ్యక్తి మన దేశ ప్రధానిగా ఉండటం మన అదృష్టం. ప్రపంచ దేశాల్లో భారత్ తలెత్తుకుని పొగరుగా నిలబడేలా మార్చిన గొప్పనేత' అంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. కర్నూలులో గురువారం జరిగిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభలో ఆయన ప్రసంగించారు. "దేశంలో పన్నుల భారం పెరగడం తప్ప.. తగ్గించిన చరిత్ర లేదు. ప్రధాని మోదీ తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల పేదలు, సామాన్యులకు పెద్దఎత్తున ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. విద్యా, వైద్యం ఖర్చుల భారం తగ్గుతుంది. నిత్యావసర వస్తు ధరలు తగ్గడం వల్ల ఒక్కో కుటుంబానికి రూ. 20 వేలు వరకు ప్రయోజనం చేకూరుతుంది. ఆత్మనిర్భర్ భారత్ ద్వారా ప్రపంచ పటంలో దేశాన్ని నిలబెట్టారు. ప్రధాని మోదీ కృషి కారణంగా దేశం, రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. గూగుల్ వంటి అతిపెద్ద ప్రాజెక్టు రాష్ట్రానికి వచ్చింది. ధర్మాన్ని పట్టుకొని ముందుకు సాగే వ్యక్తి మోదీ. రెండు తరాలను ముందుకు నడిపిస్తూ భావితరానికి మార్గనిర్దేశం చేస్తున్నారు. ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయికి భారత్‌ను తీసుకెళ్లారు. ఒక దేశపు జెండా పౌరుషంగా ఎలా రెపరెపలాడుతుందో.. అలా మన దేశాన్ని ప్రపంచపటంలో తలెత్తుకునేలా నిలిపిన ఘనత మోదీదే. రాష్ట్రంలో రూ. 13 వేల కోట్లు విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. ఓర్వకల్లు, కొప్పర్తి పారిశ్రామిక హబ్ అభివృద్ధికే రూ. 4 వేల కోట్లతో శంకుస్థాపన చేశారు. రాయలసీమ ప్రాంతం పారిశ్రామిక ప్రగతి వైపు వేగంగా అడుగులు వేయడానికి కేంద్రం దోహదం చేస్తోంది. ప్రధాని మోదీ నాయకత్వం, సీఎం చంద్రబాబు స్ఫూర్తి, మార్గదర్శకత్వంలో ప్రజల ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్తున్నాం. కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లు సుస్థిర పాలన అందిస్తూ, పెట్టుబడిదారులు, పరిశ్రమల ఏర్పాటుకు నమ్మకాన్ని కలిగిస్తూ ఉండాలి. అలా మేమంతా ముందుకు వెళ్తాం. సోదరుడు, మంత్రి లోకేశ్‌కు అన్ని శాఖలు ఇచ్చినా సమర్థవంతంగా పని చేయగలడు" అని పవన్ కల్యాణ్ చెప్పారు.

ఏపీకి సెమీ కండక్టర్ పరిశ్రమలు

- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



కేంద్రంలో ప్రధాని మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బలమైన నాయకత్వంలో అభివృద్ధిలో ఏపీ ముందుకు సాగుతోందని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ చెప్పారు. రాష్ట్రానికి సెమీ కండక్టర్ లాంటి పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. కర్నూలు సభలో ఆయన ప్రసంగించారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో ప్రధాని మోదీ రాష్ట్రానికి నాలుగుసార్లు వచ్చారు. వచ్చిన ప్రతిసారి వేల కోట్ల రూపాయల జాతీయ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. విశాఖ పర్యటనలో రూ. 2 లక్షల కోట్లకుపైగా విలువైన జాతీయ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇప్పటికే పలు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రాజధాని అమరావతి పునర్నిర్మాణం కార్యక్రమానికి హాజరైనపుడు ప్రధాని రూ. 58 వేల కోట్లు విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇప్పుడు కర్నూలుకు వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో రూ. 13,430 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పలు ప్రాజెక్టులు జాతికి అంకితం చేశారు. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ పరిశ్రమకు నిధులు ఇచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుంది. ప్రపంచంలో 4వ ఆర్థిక శక్తిగా భారత్‌ను తీర్చిదిద్దిన వ్యక్తి మోదీ" అని పేర్కొన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు జనార్దన్ రెడ్డి, భరత్, నిమ్మల, కేంద్ర మంత్రులు శ్రీనివాసవర్మ, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, మంత్రులు లోకేశ్, సత్యకుమార్, ఎన్ఎండీ ఫరూక్, బీజేపీ అధ్యక్షుడు మాధవ్

బాబూ.. మీ హిందీ భేష్

- బిహార్ విజయంపై మాట్లాడి ఎన్డీయే కార్యకర్తల హృదయాలు గెలిచారు
- 'ఎక్స్'లో ప్రధాని మోదీ ప్రశంస

అమరావతి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సభలో సీఎం చంద్రబాబు హిందీలో చేసిన ప్రసంగంపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. మంచి హిందీ మాట్లాడారంటూ చంద్రబాబును అభినందించారు. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తూ మోదీ 'ఎక్స్'లో స్పందించారు. "బిహార్‌లో విజయావకాశాలపై మంచి హిందీలో ప్రసంగించడం ద్వారా ఎన్డీయే కార్యకర్తల హృదయాలను చంద్రబాబు గెలుచుకున్నారు. 'ఏక్ భారత్ - శ్రేష్ఠ భారత్' పట్ల గాఢమైన తన నిబద్ధతను ఆయన చాటుకున్నారు" అని మోదీ పేర్కొన్నారు.

లోకేశ్‌కు మోదీ అభినందనలు

'సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్.' ప్రచార ఉద్యమాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ప్రత్యేకించి మంత్రి లోకేశ్ విజయవంతం చేయడంపై ప్రధాని మోదీ హర్షం ప్రకటించారు. వినూత్నమైన పోటీలు, ప్రచారం ద్వారా యువత జీఎస్టీ గురించి అర్థం చేసుకునేలా ప్రత్యేక కృషి చేశారంటూ 'ఎక్స్'లో ఆయన అభినందించారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. "జీఎస్టీ సంస్కరణల వల్ల పన్నుల విధానంలో మార్పులొచ్చి దేశానికి ఆదాయం పెరుగుతోంది. ఇంత మంచి కార్యక్రమం తలపెట్టినందుకు మా రాష్ట్ర ప్రజల తరఫున మీకు ధన్యవాదాలు" అంటూ లోకేశ్ స్పందించారు.



శ్రీశైలం ఆలయంలో కూర్చుని ముచ్చటిస్తున్న మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్

ఆంధ్ర వైభవం!

రాష్ట్రాన్ని కొనియాడుతూ ప్రధాని ప్రసంగం

విజయవంతమైన మోదీ రాష్ట్ర పర్యటన

- శ్రీశైల మల్లన్న దర్శనంపై ఆనందం
- రాష్ట్ర ప్రగతి, ప్రాజెక్టులపై మోదీ ఫోకస్
- సభ విజయవంతంపై కూటమి నేతల ఆనందం

(కర్నూలు/అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ సామర్థ్యం, అభివృద్ధిలో వేగంపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. దేశ ప్రగతిలో రాష్ట్ర పాత్ర గురించి తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ఏపీ పర్యటనలో భాగంగా తొలుత శ్రీశైలం చేరుకున్న ప్రధాని అక్కడ సుమారు గంటపాటు గడిపారు భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో స్వామివారి రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన సేవలో పాల్గొన్నారు. ఆ సమయంలో ఆయన వెంట చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాత్రమే ఉన్నారు. పూజల అనంతరం కొద్దిసేపు ఆలయ ఆవరణలోనే మోదీ ధ్యాన ముద్రలో గడిపారు. అనంతరం శ్రీశైలంలోపి ఛత్రపతి శివాజీ మహరాజ్ స్మారక స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు.

కూటమి నేతల్లో ఆనందం

ఉదయం 10 గంటలకు కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్న ప్రధాని శ్రీశైల క్షేత్ర సందర్శన, నన్నూరులో బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం సాయంత్రం 4.45కి ఢిల్లీ తిరుగు ప్రయాణమయ్యారు. కర్నూలులో నిర్వహించిన జీఎస్టీ సభ విజయవంతం కావడంతో కూటమి నేతల్లో ఆనందం నెలకొంది. కేవలం జీఎస్టీ సభలా కాకుండా రాయలసీమ అభివృద్ధికి వేదికగా సభ నిర్వహణ సాగిందని నేతలు వ్యాఖ్యానించారు. చంద్రబాబు సైతం ఎక్స్‌లో తన ఆనందాన్ని పంచుకున్నారు. అక్టోబరు 16 ఏపీ ప్రజలకు రెట్టింపు ఆనందాన్ని అందించిందని ఆయన పేర్కొన్నారు.

విమానాశ్రయంలో ఘన స్వాగతం

గురువారం ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని కర్నూలు విమానాశ్రయానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడికి చేరుకున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ప్రధానికి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతి రాజు శ్రీనివాస్‌వర్మ, రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ గుప్త, డీఐజీ కోయ ప్రవీణ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ముకేశ్ కుమార్ మీనా, ప్రధానమంత్రి పర్యటన వ్యవహారాల ప్రత్యేక అధికారి వీరపాండియన్, రాజమండ్రి, మచిలీపట్నం, కర్నూలు, నంద్యాల ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, వల్లభనేని బాలశౌరి, నాగరాజు, శబరి తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

అరుగుపై ముచ్చట్లు...

శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో అరుగుపై మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ పది నిమిషాలపాటు ముచ్చటించుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి మోదీ చర్చించినట్లు సమాచారం. అమరావతి, పోలవరం పనులు ఎలా సాగుతున్నాయని ఆరా తీశారు. ఈ రెండు అంశాల్లో ఎలాంటి సాయం చేయడానికైనా కేంద్రం సిద్ధంగా ఉంటుందని ఇద్దరు నేతలకు ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. అలాగే.. శ్రీశైల సందర్శనపైనా ఆయన తన అనుభవాన్ని పంచుకున్నారు. గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయ పరిసరాల్లోనే తాను పుట్టానని, చిన్ననాటి నుంచి సోమనాథుడిని చూస్తూ పెరిగానని, ఇప్పుడు శ్రీశైలం రావడం తన అదృష్టమని ప్రధాని పేర్కొన్నట్లు సమాచారం.

ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులు



- కర్నూలు నగరంలో పీఎస్-3 వద్ద పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టుల కోసం అదనపు పవర్ గ్రిడ్‌కు రూ.2,886 కోట్లతో శ్రీకారం
- రూ.4,922 కోట్లతో కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్, కడప జిల్లాలో కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి.
- పెందుర్తి-సింహాచలం నార్త్ మధ్య రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి రూ.184 కోట్లతో శంకుస్థాపన.
- కొత్తవలస- విజయనగరం మధ్య రూ.493 కోట్లతో చేపట్టే నాలుగో రైల్వే లైన్.
- విశాఖలో సబ్బవరం-షీలానగర్ మధ్య రూ.964 కోట్లతో జాతీయ రహదారి నిర్మాణం.

మోదీ ప్రారంభించిన ప్రాజెక్టులు

- రూ.82 కోట్లతో నిర్మించిన రేణికుంట-కడప-మదనపల్లె రోడ్డు ప్రారంభోత్సవం
- రూ.286 కోట్లతో నిర్మించిన కడప-నెల్లూరు-చునియాంపల్లి రోడ్డు ప్రారంభం
- గుడివాడ-నూజెండ్ల మధ్య రూ.98 కోట్లతో నిర్మించిన నాలుగు వరుసల రోడ్డు, ఫ్లైఓవర్ ప్రారంభం
- కళ్యాణదుర్గం-రాయదుర్గం-మొలకలమూరు మధ్య రూ.13 కోట్లతో నిర్మించిన జాతీయ రహదారి ప్రారంభోత్సవం.
- రూ.593 కోట్లతో నిర్మించిన పీలేరు-కలసూరు నాలుగు వరుసల నేషనల్ హైవే ప్రారంభం
- రూ.362కోట్లతో కృష్ణాజిల్లా నిమ్మలూరులోని బీఈఎల్‌లో రక్షణ శాఖ చేపట్టిన అడ్వాన్స్‌డ్ నైట్ విజన్ గ్లాసుల ఉత్పత్తి కేంద్రం.
- చిత్తూరు జిల్లాలో ఇండేన్ ఆయిల్ కార్పొరేషన్ రూ.200 కోట్లతో చేపట్టిన బాట్లింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవం.

జాతికి అంకితం చేసిన ప్రాజెక్టులు

- రూ.546 కోట్లతో పూర్తి చేసిన కొత్తవలస-కోరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులు.
- 1,730 కోట్లతో శ్రీకాకుళం జిల్లాలో పూర్తి చేసిన శ్రీకాకుళం-అంగుల్ నేచురల్ గ్యాస్ పైప్‌లైన్.



ప్రారంభోత్సవాలు.. శ్రీకారాలు..

కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి నుంచి సభా ప్రాంగణం వరకు ఐదు కిలోమీటర్లు ఎటు చూసినా జనజాతరే కనిపించింది. నన్నూరు టోల్‌ప్లాజా వద్ద రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించారు. దాదాపు 450 ఎకరాల్లో ఉన్న గ్రీన్‌హిల్స్ మొత్తం జనంతో నిండిపోయింది. శ్రీశైలం నుంచి మోదీ, చంద్రబాబు, పవన్ ఒకే హెలికాప్టర్‌లో కర్నూలుకు వచ్చారు. ముగ్గురూ హెలిప్యాడ్ నుంచి ఓపెన్‌టాప్ జీపులో సభా వేదిక వద్దకు వచ్చారు. అర కిలోమీటరుపాటు నిర్వహించిన రోడ్ షోలో విక్టరీ సింబల్ చూపుతూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జనం ముక్తకంఠంతో మోదీ.. మోదీ అంటూ నినాదాలు చేశారు. 'జయహో భారత్' పాటకు జాతీయ జెండాలు రెపరెపలాడిస్తూ ఘనస్వాగతం పలికారు. వేదిక పైనుంచి ప్రధాని మోదీ రూ.13 వేల కోట్లకు పైగా విలువైన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. అనువాదంతో కలిపి 33 నిమిషాలు ప్రధాని ప్రసంగం సాగింది. ఏపీ సామర్థ్యం, కేంద్ర సహకారం, తాజాగా చేపట్టిన ప్రాజెక్టుల విశేషాలు, వాటి ప్రయోజనాలకు మోదీ తన ప్రసంగంలో ప్రాధాన్యమిచ్చారు. జీఎస్టీ సంస్కరణల గురించి చివర్లో ప్రస్తావించారు. 'విశాఖలో గూగుల్ ఏఐ హబ్' ఏర్పాటు గురించి ప్రత్యేకంగా వివరించారు. జనసందోహాన్ని చూసి మోదీ పులకించిపోయారు. చిన్నారులు, కళాకారులు, సీమ సంస్కృతి కళా ప్రదర్శనలు సభికులకు కనువిందు చేశాయి.



లోకేశ్ భేష్..!

కర్నూలు విమానాశ్రయంలో ప్రధానికి స్వాగతం పలికినప్పటి నుంచి సభా వేదికపైదాకా మంత్రి లోకేశ్‌కు ప్రధాని ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారు. వేదికపై సూపర్ జీఎస్టీ కార్యక్రమాల నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను సీఎం చంద్రబాబు ప్రధాని మోదీకి బహూకరించారు. ఆ సమయంలో.. ప్రొటోకాల్ ప్రకారం దూరంగా ఉన్న లోకేశ్‌ను తన పక్కకు రావాల్సిందిగా ప్రధాని ఆహ్వానించారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల రూపకల్పన, నిర్వహణ అద్భుతంగా చేశావని కితాబునిచ్చారు. లోకేశ్ చేతుల మీదుగానే పుస్తక ప్రతిని అందుకున్నారు. అంతకుముందు విమానాశ్రయంలో తనకు స్వాగతం పలికిన లోకేశ్‌తో ప్రధాని ముచ్చటిస్తూ... 'చాలా సన్నబడ్డావు. గతంలో చూసినప్పటి కంటే ఇప్పుడు బరువు తగ్గావు. త్వరలోనే మీ నాన్నలా తయారవుతావు. వెరీ గుడ్' అని ప్రశంసించారు.

ఏపీ సామర్థ్యాన్ని విస్మరించిన కాంగ్రెస్

ఇప్పుడు ప్రపంచం మన దేశాన్ని 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా చూస్తోంది. 'ఆత్మ నిర్భర్ భారత్' దీనికి బలమైన పునాది. ఈ దిశగా ఏపీ ఎంతో కీలకం కాబోతోంది. గతంలో పలుమార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏపీ సామర్థ్యాన్ని గుర్తించలేదు. తద్వారా రాష్ట్రానికే కాదు.. దేశానికీ నష్టం చేసింది. ఇప్పుడు మన ఎన్డీయే పాలనలో ఏపీ ముఖ చిత్రం మారుతోంది. చంద్రబాబు నేతృత్వంలో ఏపీ సరికొత్త శక్తిగా అవతరిస్తుంది. కృష్ణా జిల్లా నిమ్మలూరులోని అడ్వాన్స్ నైట్ విజన్ ఫ్యాక్టరీ ప్రారంభం మన దేశ రక్షణ రంగం ఆత్మ నిర్భరత సాధనలో మరో ముందడుగు పడింది. ఈ ఫ్యాక్టరీలో నైట్ విజన్ పరికరాలతోపాటు క్షిపణులకు అవసరమైన సెన్సర్లు, డ్రోన్ గార్డ్ వ్యవస్థలు తయారవుతున్నాయి. దీంతో మన దేశ రక్షణ రంగ ఎగుమతులు కొత్త దశకు చేరుకుంటాయి.

ఏపీ.. సత్తా, స్పీడు

ఏపీకి 'స్పీడ్... స్కోప్' చాలా ఉంది. వికసిత్ భారత్ సాధనకు 'స్వర్ణాంధ్ర' లక్ష్యం మరింత ఊతమిస్తుంది. టెక్నాలజీ విషయంలో ఏపీ యువత చాలా ముందుంటుంది. మన దేశం, ఏపీ వేగాన్ని, సామర్థ్యాన్ని యావత్ ప్రపంచం గమనిస్తోంది. రెండు రోజుల క్రితం గూగుల్ సంస్థ ఏపీలో భారీ పెట్టుబడి ప్రకటించింది. విశాఖలో గూగుల్ ఏఐ హబ్ ఏర్పాటవుతుంది. దీనిపై గూగుల్ సీఈవోతో నేను మాట్లాడాను. అమెరికా వెలుపల పెడుతున్న అతి భారీ పెట్టుబడి ఇదే అని ఆయన చెప్పారు. కొత్త ఏఐ హబ్‌లో శక్తివంతమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్‌తో పాటు ఫైబర్ ఆప్టికల్ విస్తరణ ఉంటుందని వివరించారు. గూగుల్ ఏఐ పెట్టుబడితో కొత్త అంతర్జాతీయ గేట్‌వే ప్రారంభం కాబోతోంది. తూర్పు తీరంలోని విశాఖపట్నం కేబుల్ కేంద్రం అవుతోంది. దేశానికే కాదు.. ప్రపంచానికే సేవలందించే కేంద్రంగా విశాఖ అవుతుంది. ఈ సందర్భంగా ఏపీ ప్రజలకు నా శుభాకాంక్షలు! సీఎం చంద్రబాబు విజన్‌ను ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నా. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం కొత్త పారిశ్రామిక కారిడార్లను ఏర్పాటు చేసుకోవాలి. అందులో భాగంగా ఇప్పటికే ఓర్వకల్లు, కొప్పర్తిని ఏపీ ప్రభుత్వం గుర్తించి అభివృద్ధి చేస్తోంది.

మీ స్పీడు.. మా తోడు



మోదీని సత్కరిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ. చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి సత్యకుమార్ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

డ్రోన్ హబ్‌కు జేజేలు

కర్నూలును భారత దేశ డ్రోన్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న చంద్రబాబు సంకల్పం హర్షణీయం. దేశ రక్షణ రంగ శక్తి ఏమిటో ఆపరేషన్ సిందూర్‌లో మనందరం ప్రత్యక్షంగా చూశాం. ఈ ఆపరేషన్‌లో మన డ్రోన్లు అద్భుతాలు సృష్టించాయి. ప్రపంచం వాటిని చూసి అబ్బుర పడిందని గర్వంగా చెబుతున్నా. రాబోయే రోజుల్లో కర్నూలు డ్రోన్ రంగానికి ఎంతో కీలకంగా మారబోతోంది.



(మొదటి పేజీ తరువాయి)

భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'సోదర సోదరీ మణులకు నమస్కారములు' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రధాని ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ఆయన మాటల్లోనే..

16 నెలల్లో పరుగు...

గత 16 నెలలుగా డబుల్ ఇంజన్ సర్కారుతో ఏపీలో ప్రగతి పరుగులు తీస్తోంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల సమర్థ నాయకత్వం తోడైంది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తోంది. చంద్రబాబు చెప్పినట్లుగా 2047 నాటికి 'వికసిత్ భారత్'ను సాధించాలి. వికసిత్ ఆంధ్రప్రదేశ్‌తోనే వికసిత భారత్ సాధ్యమవుతుంది. వికసిత ఏపీలో రాయలసీమ అభివృద్ధి ఎంతో కీలకం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆత్మ గౌరవానికి, సంస్కృతికి నిలయం. సైన్స్, ఇన్నోవేషన్‌కు కేంద్రం. ఇక్కడ అనంత అవకాశాలు, అపారమైన శక్తి ఉన్నాయి. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ రూపంలో సమర్థమైన నాయకత్వం ఉంది. రాష్ట్ర విజన్‌కు కేంద్ర ప్రభుత్వ మద్దతు సంపూర్ణంగా లభిస్తోంది.

కర్నూలుకు మేలు...

నేడు విద్యుత్ రంగం, జాతీయ రహదారులు, రైల్వే, వాణిజ్య ప్రాజెక్టుల్ని ప్రారంభించాం! కొన్నింటికి శంకుస్థాపన చేస్తున్నాం. ఇది దేశంలోని ఇతర ప్రాంతాలకు కనెక్టివిటీని పెంచి అభివృద్ధికి దోహద పడుతుంది. ఈ రోజు ఇక్కడ మూడు వేల కోట్ల విలువైన ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నాం. ఫలితంగా దేశ ఇంధన సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఈ రోజు కర్నూలులో ప్రారంభమైన పనులు రాయలసీమలో ఉద్యోగాలు సృష్టిస్తాయి. సీమ ప్రగతికి కొత్త ద్వారాలు తెరుస్తాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ఈ ప్రాంత ప్రజలకు నా అభినందనలు. ఇంధన విప్లవానికి ఏపీ ప్రధాన కేంద్రంగా మారింది. ఈ రోజు చంద్రబాబు నేతృత్వంలో శ్రీకాకుళం నుంచి అంగుల్ (ఒడిశా) వరకూ గ్యాస్ పైప్‌లైన్ ప్రారంభమైంది. దీనిద్వారా 15 లక్షల కుటుంబాలకు గ్యాస్ సరఫరా చేయవచ్చు. చిత్తూరులో కూడా ఎల్‌పీజీ ప్లాంట్ ప్రారంభించాం. విశాఖపట్నంలో సబ్బవరం నుంచి షీలానగర్ వరకూ కనెక్టివిటీ మెరుగు పరిచాం. రైల్వే రంగంలో కొత్త లైన్లు, రైళ్ల పై ఓవర్లతో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు లభిస్తున్నాయి.

'స్థానిక' స్మరణం...

ప్రధాని మోదీ తన ప్రసంగంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, మహనీయులను స్మరించుకున్నారు. "అహోబిలం నరసింహ స్వామి, మహానంది లోని మహానందీశ్వరుడికి నా నమస్సులు. మంత్రాలయంలో కొలువైన గురురాఘవేంద్ర స్వామి ఆశీస్సులు మనందరిపైనా ఉండాలని ప్రార్థిస్తున్నాను. సౌరాష్ట్రే సోమనాథంచ.. శ్రీశైలే మల్లికార్జునమ్.. అని జ్యోతిర్లింగ స్తోత్రం చెబుతోంది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో మొదటిది సోమనాథ్ అయితే... రెండోది శ్రీశైలం. సోమనాథుడి భూమి సౌరాష్ట్రలో జన్మించడం నా అదృష్టం. కాశీ సేవ చేయడం మరింత సౌభాగ్యం. నేడు... శ్రీశైల మల్లికార్జునుడి ఆశీస్సులు పొందాను. ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించుకుని శ్రద్ధాంజలి అర్పించే అవకాశం లభించింది" అన్నారు.

ప్రజలే ప్రాధాన్యం...

ప్రజా ప్రయోజనమే కేంద్రం (సిటిజన్ సెంట్రిక్ డెవలప్‌మెంట్)గా ఎన్డీయే ప్రభుత్వం సరికొత్త సంస్కరణలు ప్రవేశపెట్టింది. ప్రజల జీవితాలను మరింత సుఖమయం చేయడమే మా సంకల్పం. దేశంలో రూ.12 లక్షల్లోపు ఆదాయానికి పన్నులేకుండా చేశాం. తక్కువ ధరకే మందులు, మెరుగైన చికిత్స ఆయుష్మాన్ భారత్, వృద్ధులకు ఉచిత మందులతో కొత్త శకానికి నాంది పలికాం. దీంతో దేశ ప్రజల జీవన విధానంలో కొత్త అధ్యాయం లిఖించాం. దసరా శరన్నవరాత్రుల మొదటి రోజున జీఎస్టీ 2.0 ద్వారా ధరల భారం తగ్గించాం. ఇక్కడ లోకేశ్ నాయకత్వంలో జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని వేడుకగా చేసుకోవడం ఆనందం కలిగిస్తోంది. 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' ప్రచారాన్ని కూడా విజయవంతంగా నిర్వహించారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా ఏపీ ప్రజలకు రూ.8వేల కోట్లు ఆదా అయ్యాయి. ఈ పొదుపుతో పండగ సీజన్ ఆనందం మరింత పెరుగుతుంది. అదే సమయంలో... స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని (వోకల్ ఫర్ లోకల్) కోరుతున్నాను.

21వ శతాబ్దం మనదే..

ఇప్పుడు చంద్రబాబు ఆవేదనతో మాట్లాడారు. నేను ఆత్మవిశ్వాసంతో చెబుతున్నా. ఈ 21వ శతాబ్దం మన దేశానిదే. ఈ శతాబ్దం 140కోట్ల మంది భారతీయులది. అభివృద్ధి వేగంగా పరుగులు తీస్తున్న ఈ సమయంలో... గతాన్ని కూడా ఒకసారి గుర్తు చేసుకోవాలి. పదకొండేళ్ల క్రితం కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సగటు తలసరి విద్యుత్ వినియోగం వెయ్యి యూనిట్లలోపు ఉండేది. నిత్యం కరెంటు కోతలు! వేలాది గ్రామాల్లో కనీసం విద్యుత్ స్తంభాలు కూడా ఏర్పాటు చేయలేని దుస్థితి. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. క్లీన్ అండ్ టోటల్ ఎనర్జీ వరకూ మన దేశం కొత్త రికార్డులు నెలకొల్పుతోంది. ప్రతి గ్రామానికి విద్యుదీకరణ, ప్రతి కుటుంబానికి విద్యుత్ సరఫరా జరుగుతోంది. పరిశ్రమలకు సమృద్ధిగా విద్యుత్ లభిస్తోంది. తలసరి విద్యుత్ వినియోగం 1400 యూనిట్లకు పెరిగింది.

సభా ప్రాంగణం వద్ద జన సందోహం



అది నాణ్యతలేని మద్యమే

అద్దేపల్లి నకిలీ మద్యం కేసులో ల్యాబ్ నివేదిక.. స్ట్రెంత్ ప్రమాణాలు పాటించకుండా తయారీ

- 25గా ఉండాల్సిన యూపీ 35గా నమోదు
- 75 ఉండాల్సిన ఓపీ 65
- ప్రమాదకరం కాకపోయినా మంచిది కాదు
- ఎక్సైజ్ అధికారులకు చేరిన నివేదిక

విజయవాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో అద్దేపల్లి జనార్దనరావు తయారు చేసిన మద్యంలో నిబంధనల ప్రకారం ఉండాల్సిన ప్రమాణాలు లేవని తేలింది. ఈ మద్యం అత్యంత ప్రమాదకరమైనది కాకపోయినా అందులో స్ట్రెంత్(గాఢత), నాణ్యత ప్రమాణాల కంటే తక్కువగా ఉన్నాయని రుజువైంది. ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారీ గోదాము నుంచి ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సరుకు నమూనాల ల్యాబ్ నివేదిక గురువారం ఎక్సైజ్ ఉన్నతాధికారులకు చేరింది. గోదాములో మద్యం తయారీకి ఉపయోగించిన ముడిసరుకు, రసాయనాలు, స్పిరిట్‌తో పాటు తయారు చేసిన మద్యంను అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మొత్తం సరుకుకు సంబంధించిన 45 రకాల నమూనాలను పరీక్షల నిమిత్తం కాకినాడలోని ప్రాంతీయ ఎక్సైజ్ ప్రయోగశాలకు పంపారు.

యూపీ 35-ఓపీ 65

మద్యం తయారీలో ఎంత నాణ్యత ఉంది? ఎంత స్ట్రెంత్ ఉంది? అన్న వివరాలను యూపీ(అండర్ ప్రూఫ్), ఓపీ(ఓవర్ ప్రూఫ్)లు తెలియజేస్తాయి. ప్రతి మద్యం తయారీకి ఒక సూత్రం ఉంటుంది. దాని ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలను పాటిస్తూ మద్యం తయారు చేయాలి. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన డిస్టిలరీలు ఈ విధానాన్ని పాటిస్తాయి. డిస్టిలరీల్లో మద్యం తయారైన తర్వాత ఆ నమూనాలను ఎక్సైజ్ శాఖ ప్రయోగశాలకు పంపి పరీక్షలు చేయిస్తారు. నిర్దేశించిన నిబంధనల ప్రకారం మద్యం తయారు చేశారని ధ్రువీకరణ ఇచ్చిన తర్వాతే డిస్టిలరీల్లో సరుకును సీసాల్లో నింపుతారు. ముఖ్యంగా మద్యంలో రెండు ప్రమాణాలు యూపీ, ఓపీ ఉంటాయి. యూపీ 25గా ఉండాలి. జనార్దనరావు గోదాములో లభించిన మద్యంలో అది 35గా నమోదైంది. 100 నుంచి యూపీని తీసివేయగా వచ్చిన విలువ ఓపీని సూచిస్తుంది. ప్రమాణాల ప్రకారం 75 ఉండాల్సిన ఓపీ ఇబ్రహీంపట్నంలో సీజ్ చేసిన సరుకులో 65గా ఉన్నట్టు నిర్ధారణైంది. ఈ విధంగా విలువలు నమోదైన మద్యంలో నీరు గానీ, ఇంకా ఏమైనా ద్రవపదార్థాలను గానీ మిశ్రమం చేసినట్టు సైంటిస్టులు భావిస్తున్నారు. సాధారణంగా యూపీ 25, ఓపీ 75గా ఉన్న మద్యం తాగాలంటే అందులో నీరు, సోడా, డ్రింక్ ఇలా ఏదో ఒకటి మిశ్రమం చేసుకోవాలి. జనార్దనరావు తయారు చేసిన మద్యంలో యూపీ 35, ఓపీ 65గా ఉండడంతో ఎలాంటి ద్రవపదార్థం కలపకుండా దాన్ని తాగొచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. ఎలాంటి నాణ్యత, గాఢతా ప్రమాణాలు పాటించకుండా తయారు చేశారని సైంటిస్ట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

విలువలు ఎలా నిర్ధారిస్తారంటే..

మద్యం తయారీలో రెక్టిఫైడ్ స్పిరిట్, కార్మెల్(రంగు తెలియజేసే రసాయనం)తో పాటు వివిధ రకాల రసాయనాలు ఉపయోగిస్తారు. వాటిని బ్రాందీకి ఒకవిధంగా, విస్కీకి ఒకవిధంగా, రమ్ముకు ఒకవిధంగా మిశ్రమం చేస్తారు. ఈ మిశ్రమానికి సంబంధించి ప్రతి వెరైటీకి ఒక్కో ప్రత్యేక సూత్రం ఉంటుంది. డిస్టిలరీల్లో తయారైన మద్యం ప్రయోగశాలకు వెళ్లిన తర్వాత అక్కడ బీరడాల్లో పోస్తారు. ముందుగా థర్మామీటర్‌ను బీరడాలో పెట్టి ఉష్ణోగ్రతను నమోదు చేస్తారు. తర్వాత థర్మామీటర్‌ను తీసేసి హైడ్రోమీటర్ పెడతారు. ఇది ఒక రీడింగ్‌ను చూపిస్తుంది. థర్మామీటర్ చూపించిన ఉష్ణోగ్రత, హైడ్రోమీటర్ చూపించిన రీడింగ్‌ను నమోదు చేసుకుని సైక్స్ టేబుల్ ఉన్న పుస్తకంలో చూస్తారు. అందులో ఉన్న విలువలను బట్టి మద్యంలో ఉన్న గాఢతను నిర్ధారిస్తారు.

జోగి, జగన్ కలిస్తే కల్తీ మద్యం తయారు!

- రమేశ్‌ను అరెస్టు చేస్తే.. పెద్దల పేర్లు బయటికొస్తాయ్: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జోగి.. జోగి.. రాసుకుంటే బూడిద రాలినట్టు జోగి, జగన్ కలిస్తే కల్తీ మద్యం తయారైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పేర్కొన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నకిలీ మద్యం తయారీ కేసులో జోగి రమేశ్‌ది కీలకపాత్ర అన్నారు. చంద్రబాబు ప్రమాణం చేయాలని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగన్, భారతి.. వేంకటేశ్వరస్వామి వద్ద ప్రమాణం చేస్తారా? అని ప్రశ్నించారు. జోగి రమేశ్ ఏ తప్పూ చేయకపోతే సిట్ అధికారుల ముందుకెళ్లాలని సూచించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో జగన్ అరడజను దొంగలు.. కొడాలి నాని, పేర్ని నాని, దేవినేని అవినాశ్, వెలంపల్లి శ్రీనివాసరావు, వల్లభనేని వంశీ అని పేర్కొన్నారు. నకిలీ మద్యం కేసులో జోగి రమేశ్ వెనుక ఇంకా పెద్దలు ఉన్నారని, జోగిని అరెస్టు చేసి విచారిస్తే వారి పేర్లు కూడా బయటకు వస్తాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నకిలీ మద్యాన్ని బయటకు తెచ్చిందని, ఇద్దరు టీడీపీ నాయకుల పేర్లు బయటపడిన వెంటనే తమ నాయకుడు వారిని సస్పెండ్ చేశారని, మరి జగన్.. జోగి రమేశ్‌ను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు రంకెలు వేయటం మాని, పోలీసులకు లొంగిపోయి విచారణకు సహకరించాలని హితవు పలికారు.



'మద్యం' నిందితుల బెయిల్ పిటిషన్లను విచారించండి

- శ్రీధర్, రాజ్ కసిరెడ్డి, చాణక్యల పిటిషన్లపై ట్రయల్ కోర్టుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో నిందితులు సజ్జల శ్రీధర్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి, చాణక్య బెయిల్ పిటిషన్లపై విచారణ కొనసాగించాలని ట్రయల్ కోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకూ మద్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లపై నిర్ణయం తీసుకోవద్దని ట్రయల్ కోర్టును హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. హైకోర్టు తీర్పును శ్రీధర్ రెడ్డి, రాజ్ కసిరెడ్డి, చాణక్యలు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్లను గురువారం జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. బుధవారం చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కేసులో ఇచ్చిన ఆదేశాలే ఈ కేసులకూ వర్తిస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు మెరిట్ ఆధారంగా విచారించి నిర్ణయం తీసుకోవాలని ట్రయల్ కోర్టుకు న్యాయస్థానం సూచించింది.

లిక్కర్ కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఏడుగురు నిందితులకు ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. జైలులో ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బూనేటి చాణక్య, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణను ఎస్కార్ట్ పోలీసులు ఏసీబీ కోర్టులో గురువారం హాజరుపరిచారు. వారి రిమాండ్‌ను 24 వరకు పొడిగిస్తూ న్యాయాధికారి భాస్కరరావు ఉత్తర్వులు ఇచ్చారు.

మిథున్‌రెడ్డి న్యూయార్క్ పర్యటన పిటిషన్‌పై నేడు తీర్పు

- ఇరు పక్షాల వాదనలు పూర్తి

విజయవాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): న్యూయార్క్ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ, సిట్ జారీ చేసిన లుక్ అవుట్ సర్క్యులర్ రద్దు చేయాలని అభ్యర్థిస్తూ రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తీర్పును ఏసీబీ కోర్టు శుక్రవారం వెలువరించనుంది. ఈ పిటిషన్‌పై గురువారం వాదనలు ముగిశాయి. మిథున్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగార్జున రెడ్డి వాదనలు వినిపించారు. కోర్టు ద్వారా సిట్ నుంచి తీసుకున్న పాస్‌పోర్టును న్యూయార్క్ సమావేశానికి మాత్రమే మిథున్‌రెడ్డి ఉపయోగిస్తారని వివరించారు. అక్కడికి వెళ్లేందుకు వీలుగా లుక్ అవుట్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున జేడీ రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. మద్యం కేసులో నిందితుడిగా ఉండి షరతుల ద్వారా బెయిల్ పొందిన మిథున్‌రెడ్డి న్యూయార్క్ ఎలా వెళ్తారని ప్రశ్నించారు. వాదనలు విన్న న్యాయాధికారి తీర్పును శుక్రవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

జనార్దనరావును కస్టడీకి అనుమతించండి

- నకిలీ మద్యం కేసులో మరిన్ని వివరాలు రాబట్టాలి
- కోర్టులో ప్రాసిక్యూషన్ వాదనలు

విజయవాడ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగులోకి వచ్చిన నకిలీ మద్యం తయారీలో కీలక సూత్రధారిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావును పది రోజులు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని ప్రాసిక్యూషన్ తరఫు న్యాయవాదులు కోరారు. గురువారం విజయవాడలోని ఆరో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో వాదనలు జరిగాయి. ప్రాసిక్యూషన్ తరఫున రాధిక, అహ్మద్ వాదనలు వినిపించారు. నకిలీ మద్యం ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న అంశమని, ఈ కేసు చాలా తీవ్రమైనదని పేర్కొన్నారు. విచారణలో జనార్దనరావు కొన్ని విషయాలు మాత్రమే వెల్లడించాడని, అతడితో పాటు సోదరుడు జగన్మోహనరావు నుంచి మరిన్ని వివరాలు రాబట్టడానికి కస్టడీకి ఇవ్వాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. జనార్దనరావు తరఫున న్యాయవాది రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. మద్యం తాగడం వల్ల ప్రాణాలు కోల్పోతే అది కల్తీ మద్యం కిందకు వస్తుందని చెప్పారు. జనార్దనరావు ప్రభుత్వం అనుమతి లేకుండా ఒక ఫార్ములాతో మద్యం తయారు చేస్తే అది నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం కిందకు వస్తుందని వివరించారు. జనార్దనరావును రిమాండ్‌కు పంపే క్రమంలో ఎక్సైజ్ పోలీసులు అన్ని నిబంధనలను ఉల్లంఘించారన్నారు. వాద ప్రతివాదనలు విన్న అనంతరం న్యాయాధికారి లెనిన్‌బాబు తీర్పును 22వ తేదీకి వాయిదా వేశారు.

నలుగురిపై పీటీ వారెంట్‌కు అనుమతి

నకిలీ మద్యం కేసులో తంబళ్లపల్లె ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన నలుగురు నిందితులపై పీటీ వారెంట్‌ను కోర్టు అనుమతించింది. కట్టా రాజు, అంతా దాస్, మిథున్ దాస్, సయ్యద్ హాజీలను కొద్ది రోజుల క్రితం తంబళ్లపల్లె ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నంలో వెలుగులోకి వచ్చిన నకిలీ మద్యానికి సంబంధించి భవానీపురం ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో ఈ నలుగురు నిందితులుగా ఉన్నారు. వారిపై పోలీసులు కోర్టులో పీటీ వారెంట్ పిటిషన్ దాఖలు చేశారు. గురువారం దీనికి న్యాయాధికారి లెనిన్‌బాబు అనుమతి ఇచ్చారు. ఆ నలుగురు నిందితులను 22వ తేదీ లోగా కోర్టులో హాజరుపరచాలని ఉత్తర్వులు ఇచ్చారు.



Printed and Published by ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* ***Editor : N.Rahul Kumar,*** *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder :*** *K.L.N. Prasad.*